శుక్రవారం
14•6•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 8 • సంచిక 350
• పేజీలు: 16 + 16

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం • మన పత్రిక
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




## గుజరాత్‌కు తప్పిన ముప్పు



- ఒమన్‌వైపు మళ్లిన వాయు తుఫాన్
- గుజరాత్‌లో కొనసాగుతున్న హై అలర్ట్
- తీరప్రాంత జిల్లాలకు భారీ వర్ష సూచన

9

## గగన వీధిలో మన స్టేషన్

- భారత్‌కు సొంతంగా అంతరిక్ష కేంద్రం
- ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఇస్రో ప్రకటన
- గగన్‌యాన్ తర్వాత దృష్టిసారిస్తామన్న చైర్మన్ శివన్
- మాడ్యూల్ రూపంలో భారత స్పేస్‌స్టేషన్!

9

## మూడుతరాలుగా దక్కని హక్కు

ధర్మగంట

- ఖమ్మం జిల్లా కొణిజర్లలో 180 మంది రైతుల అరిగోస
- 370 ఎకరాలకు పట్టాలకోసం ఎక్కని మెట్టులేదు
- సీలింగ్‌చట్టం సాకుతో హక్కు పత్రాలివ్వని అధికారులు

4



ఉర్దూలో రాసివున్న 1962 నాటి అగ్రిమెంట్

# పార్లమెంటరీ నేత కేకే

### లోక్‌సభాపక్షనేతగా నామా • ఎన్నుకున్న టీఆర్‌ఎస్‌పీపీ

- లోక్‌సభలో ఉపనేతగా కొత్త ప్రభాకర్‌రెడ్డి
- రాజ్యసభలో ఉపనేతగా బండాప్రకాశ్
- విప్‌లుగా లోక్‌సభలో బీబీపాటిల్, రాజ్యసభలో సంతోష్‌కుమార్
- రాష్ట్ర సమస్యలపై కేంద్రాన్ని నిలదీద్దాం
- మన హక్కులను సాధించుకుందాం
- పార్టీ ఎంపీలకు సీఎం కేసీఆర్ పిలుపు



గురువారం టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో ఎంపీలు కే కేశవరావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బండా ప్రకాశ్, బడుగుల లింగయ్య యాదవ్, మాలోత్ కవిత కూడా ఉన్నారు.



కే కేశవరావు



నామా నాగేశ్వర్‌రావ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్‌ఎస్) పార్లమెంటరీ పార్టీ నేతగా రాజ్యసభ సభ్యుడు, సీనియర్‌నేత కే కేశవరావు, లోక్‌సభలో టీఆర్‌ఎస్‌పక్ష నాయకుడిగా ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. గురువారం టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఈ సమావేశంలో చర్చించారు. పార్లమెంటరీ, లోక్సభాపక్ష నేతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లోక్‌సభలో పార్టీ ఉపనాయకుడిగా మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, విప్‌గా జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్‌ను ఎన్నుకున్నారు. రాజ్యసభలో టీఆర్‌ఎస్ పక్ష ఉపనేతగా బండా ప్రకాశ్, విప్‌గా సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. వీరి ఎన్నిక విషయాన్ని అధికారికంగా తెలియజేస్తూ పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషికి టీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ లేఖరాశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ, పార్లమెంటు సమావేశాల్లో పార్టీ ఎంపీలు అనుసరించాల్సిన వైఖరిపై దిశానిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మధ్య ఏ విధమైన సంబంధాలు ఉంటాయో.. ఆదేవిధమైన సంబంధాలు ఇకపై కొనసాగిద్దామని అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులతో పాటు, హక్కులను సాధించుకుందామని చెప్పారు. రాష్ట్రహక్కుల సాధనకు పోరాడటంలో ఎప్పుడూ ముందుండాలని పార్టీ ఎంపీలకు సూచించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలు అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాల్సి ఉండగా.. వారి పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల పట్ల ఒక తీరుగా, ఇతర

మిగతా 5వ పేజీలో

## నేడు మహారాష్ట్రకు ముఖ్యమంత్రి కేసీఆర్

### కాళేశ్వరం ప్రారంభోత్సవానికి సీఎం ఫడ్నవీస్‌ను ఆహ్వానించనున్న కేసీఆర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు శుక్రవారం మహారాష్ట్రకు వెళ్లనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఆహ్వానించడానికి ఉదయం 10.20 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి ముంబై రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు మహారాష్ట్ర సీఎం అధికార నివాసమైన వర్షకు వెళ్తారు. ఈ నెల 21న జరిగే కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఫడ్నవీస్‌ను సీఎం కేసీఆర్ స్వయంగా ఆహ్వానిస్తారు.

## ఈఎస్ఐ చెల్లింపు వాటా రేటు తగ్గింపు

- 6.5 శాతం నుంచి 4శాతానికి కుదించిన కేంద్రం
- ఉద్యోగి వాటా 1.75% నుంచి 0.75%కి తగ్గింపు
- యాజమాన్యం వాటా 4.75% నుంచి 3.25 శాతానికి
- 3.6 కోట్ల మంది ఉద్యోగులు, 12.85 లక్షల మంది యజమానులకు లబ్ధి

**న్యూఢిల్లీ, జూన్ 13:** ఈఎస్ఐ చెల్లింపు వాటా రేటును కేంద్రం తగ్గించింది. ఈ మేరకు కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ గురువారం అధికారిక ప్రకటన చేసింది. ప్రైవేటు సంస్థల్లో పనిచేసే చిరు ఉద్యోగులకు వర్తించే కేంద్ర ఆరోగ్య పథకమైన ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ).. వారికి ఆరోగ్య భరోసా కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ వాటాలో కొంత ఉద్యోగి వేతనం నుంచి, మిగతాది యాజమాన్యం చెల్లిస్తుంది. ఈఎస్ఐ చట్టం ప్రకారం ఈ వాటా రేటును కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ నిర్ణయిస్తుంది. ఈ పథకం కింద ఉద్యోగులు, యాజమాన్యాలు ఇప్పటివరకు

మిగతా 9వ పేజీలో






# ఐఎఫ్ఏడీ కన్సల్టెంట్‌గా హైదరాబాద్ శాస్త్రవేత్త షేక్ ఎన్ మీరా



డాక్టర్ షేక్ ఎన్ మీరా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రైతుల జీవనోపాధిని మెరుగుపరచడమే ధ్యేయంగా పనిచేస్తున్న ఐక్యరాజ్య సమితికి చెందిన ప్రత్యేక సంస్థ ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ (ఐఎఫ్ఏడీ)కి కన్సల్టెంట్‌గా హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ షేక్ ఎన్ మీరా ఎంపికయ్యారు. డాక్టర్ షేక్ ఎన్ మీరా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్స్ (ఐసీఏఆర్)లో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్నారు. మెరుగైన మార్కెటింగ్ సంబంధాలు తదితరాలతో చిన్న రైతులు తమ ఆదాయాన్ని పెంపొందించుకొనేలా సలహాలు ఇచ్చేందుకు షేక్ ఎన్ మీరా ఈజిప్టును సందర్శించనున్నారు. వ్యవసాయరంగంలో డిజిటల్ ఎక్స్‌టెన్షన్ స్పెషలిస్టుగా ప్రపంచప్రఖ్యాతిని పొందిన డాక్టర్ షేక్ ఎన్ మీరా.. ఈజిప్టుకు చెందిన వ్యవసాయ సంస్థలు ఆధునాతన డిజిటల్ వ్యూహాల అమలుతో డిజిటల్ లెర్నింగ్ ఆర్గనైజేషన్లుగా మారేలా సూచనలు చేయనున్నారు. చిన్న కమతాలను కలిగిఉన్న రైతులకు ప్రయోజనాలు చేకూర్చడం కోసం డ్రోన్లను, అగ్రిగేషన్ మోడల్స్‌ను, మొబైల్ కంప్యూటరింగ్ తదితర సేవలను ఉపయోగించుకొంటూ ఏకీకృత వ్యూహాన్ని రూపొందించనున్నారు. డిజిటల్ అగ్రికల్చర్ ప్రాజెక్టులను నిర్వహించడంలో మీరాకు 16 ఏండ్లకుపైగా అనుభవం ఉన్నది. ఇంతవరకు ఆయన 3,500కు పైగా ప్రాజెక్టులను విశ్లేషించారు. పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకున్నారు.

# కాళేశ్వరం ప్రారంభోత్సవానికి పటిష్ఠ భద్రత

ప్రాజెక్టు పరిసరాల్లో భద్రత కట్టుదిట్టం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి బందోబస్తుపై పోలీసులు దృష్టి సారించారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఏపీ, మహారాష్ట్ర సీఎంలతోపాటు పలువురు వీఐపీలు హాజరుకానున్న నేపథ్యంలో ప్రాజెక్టు పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల జిల్లాల ఎస్పీలతో భద్రతాచర్యలపై ఉన్నతాధికారులు చర్చించారు. ప్రాజెక్టు మారుమూల ప్రాంతంలో ఉండటం.. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలను మోహరిస్తున్నారు. ఇంకా పూర్తిస్థాయిలో కార్యక్రమాల షెడ్యూల్ నిర్ణయం కానున్నందున ప్రస్తుతం సాధారణ బందోబస్తు ఏర్పాటుచేశామని, పూర్తి వివరాలు తెలిసిన తర్వాత అందుకు తగ్గట్టుగా భద్రతావ్యూహాలు రూపొందిస్తామని నార్త్‌జోన్ ఐజీ నాగిరెడ్డి 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.

## కాళేశ్వరాన్ని సందర్శించిన ఈఎన్సీలు

**జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఈ నెల 21న కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు, ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్,



గురువారం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ప్రాజెక్టు ఈఎన్సీ, జిల్లా కలెక్టర్ తదితరులు

ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, సీఎంవో అధికారులు గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. మహదేవపూర్ మండలంలో మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంపుహౌస్‌ను సందర్శించారు. జిల్లాకలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, ఎస్పీ ఆర్ భాస్కరన్‌తో కలిసి ఇక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లను చర్చించారు. హెలిప్యాడ్లు నిర్మించేందుకు ప్రతిపాదిత స్థలాలను పరిశీలించారు.

### శంషాబాద్ విమానాశ్రయంలో
# 720 గ్రాముల బంగారం పట్టివేత



గుళికల రూపంలో ఉన్న బంగారం

**శంషాబాద్:** ఓ ప్రయాణికుడు మలద్వారంలో పెట్టుకొని అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆదివారం కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు విమానం లో వచ్చిన ఓ ప్రయాణికుడిపై అధికారులకు అనుమానం రావడంతో ఆపి తనిఖీచేశారు. అతడు మలద్వారంలో బంగారాన్ని గుళికల మాదిరిచేసి తీసుకొచ్చినట్టు గుర్తించారు. బంగారం విలువ రూ.17,56,863 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.





గురువారం హైదరాబాద్‌లో పౌరసరఫరాల కమిషనర్ అకున్‌సబర్వాల్‌తో సమావేశమైన ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయసంస్థ ప్రతినిధి టోనీసంగనిరా



హైదరాబాద్‌లోని పౌరసరఫరాలభవన్‌లో కమిషనర్ అకున్ సబర్వాల్‌తో సమావేశమైన బంగ్లాదేశ్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌కు చెందిన 37 మంది అధికారులు

# ధాన్యం సేకరణ విధానం అద్భుతం

- ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ ప్రతినిధి ప్రశంస
- పౌరసరఫరాల కమిషనర్ అకున్‌సబర్వాల్‌తో టోనీసంగనిరా భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ధాన్యం సేకరిస్తున్న విధానం అద్భుతంగా ఉన్నదని ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయసంస్థ ప్రతినిధి టోనీ సంగనిరా ప్రశంసించారు. కనీస మద్దతు ధర చెల్లించి ఒక ఏడాదిలో దాదాపు 14 లక్షల మంది రైతుల నుంచి రూ.13.5 వేల కోట్ల విలువ చేసే 76 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం అభినందనీయమన్నారు. గురువారం పౌరసరఫరాలభవన్‌లో కమిషనర్ అకున్ సబర్వాల్‌తో టోనీ సంగనిరా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతుల నుంచి ధాన్యం సేకరించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కమాండ్ కంట్రోల్‌సెంటర్, ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఓపీఎంఎస్), గోదాముల్లో సీసీ కెమెరాలు, టీ-రేషన్ యాప్, వేలిముద్రలతో రేషన్ పంపిణీ (ఈపాస్ విధానం), ఐరిస్, వినియోగదారుల ఫోరం టోల్‌ఫ్రీ నంబర్ పనితీరును పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయరంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తుండటంతో ఏటేటా ధాన్యం దిగుబడి పెరుగుతున్నదని, దానిని రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నామని కమిషనర్ అకున్‌సబర్వాల్ వివరించారు. ధాన్యం కొనుగోలు, చెల్లింపులకు సంబంధించి ఆన్‌లైన్ విధానం ద్వారా పూర్తి పారదర్శకత ఏర్పడిందని తెలిపారు.

## బంగ్లా అధికారుల బృందం అధ్యయనం..

తెలంగాణ పౌరసరఫరాలశాఖలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, అమలుతీరును బంగ్లాదేశ్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారుల బృందం అధ్యయనం చేసింది. సాంకేతికతను వినియోగించి పేదలకు ప్రజాపంపిణీ ద్వారా సేవలందిస్తున్న విధానం బాగుందని కొనియాడింది. గురువారం బంగ్లాదేశ్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌కు చెందిన 37మంది అధికారులు పౌరసరఫరాలభవన్‌లో కమిషనర్ అకున్ సబర్వాల్‌తో సమావేశమయ్యారు. ప్రజాపంపిణీ విధానం ద్వారా 2.83 కోట్ల మంది లబ్ధిదారులకు 17,200 రేషన్ దుకాణాల ద్వారా ప్రతినెలా 1.75 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నామని ఈ సందర్భంగా కమిషనర్ అకున్ సబర్వాల్ తెలిపారు. ఈ రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా వందశాతం ఆధార్ అనుసంధానంతో ఈపాస్, ఐరిస్ విధానం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామన్నారు. టీ రేషన్, పోర్టబిలిటీ యాప్‌ల ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. పౌరసరఫరాలశాఖలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

# డేంజర్.. స్కూల్ బస్సులు

- బస్సుల ఫిట్‌నెస్ పట్టని పాఠశాలలు
- గవర్నెన్స్ పరికరం లేకుండానే రోడ్లపై పరుగులు
- ఈ ఏడాది ఆర్టీఏకు రాని 7,270 బస్సులు
- ప్రత్యేక చర్యలకు సిద్ధమవుతున్న రవాణాశాఖ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ వేలసంఖ్యలో ప్రైవేటు పాఠశాలలు బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలకు దూరంగా ఉన్నాయి. సామర్థ్యం పరీక్షలు చేయించకుండానే బస్సులను రోడ్లపై తిప్పుతున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందునుంచే అధికారులు నోటీసులు జారీచేస్తున్నా.. విద్యా సంస్థలు వాటిని తేలిగ్గానే తీసుకుంటున్నాయి. స్పీడ్ గవర్నెన్స్‌కు సంబంధించి ఆదేశాలు ఇవ్వడంలో ఆలస్యం జరగడంతో.. ఇదే అదునుగా విద్యాసంస్థలు ఫిట్‌నెస్ పరీక్షలకు ఎగనామం పెడుతున్నాయి. కొన్నిరోజులు గడిస్తే.. ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకుంటారని ప్రైవేట్ విద్యాసంస్థలు బాహాటంగానే పేర్కొంటున్నాయి. స్కూల్ బస్సులకు స్పీడ్ గవర్నెన్స్ బిగించాలని, ఫిట్‌నెస్ పరీక్షలన్నీ పూర్తిచేయాలని జూన్ మొదటివారంలోనే రవాణాశాఖ ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాలను కొన్ని విద్యాసంస్థలు మాత్రమే పాటించినట్టు తెలుస్తున్నది. ఈ నెల8న రెండవ శనివారం, 9న ఆదివారం సెలవు కారణంగా గవర్నెన్స్ పరికరాల బిగించుకోలేదని సాకులుచెప్తూ తప్పించుకున్నారు. కొన్ని బస్సులకు పరికరాలు బిగించుకున్నా ఫిట్‌నెస్ టెస్టులకు రాలేదని తెలుస్తున్నది. గతంలో ఫిట్‌నెస్ లేని బస్సులు ప్రమాదాలకు గురైన సంఘటనల నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా.. ముందుగానే చర్యలు తీసుకోవాలంటున్నారు. మరోవైపు రవాణాశాఖ ఉన్నతాధికారులు స్పీడ్ గవర్నెన్స్ పరికరం బిగించుకునే గడువును మరో 10 రోజులు పెంచుతూ మంగళవారం ఆదేశాలిచ్చారు. ఈ పదిరోజుల వ్యవధిలో స్పీడ్ గవర్నెన్స్ పరికరం బిగించుకుని, ఫిట్‌నెస్ టెస్ట్‌లకు రావాలని నోటీసులు సైతం జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన బస్సులు 23,226 ఉన్నాయి. వీటిలో 15,956 బస్సులకు గురువారం వరకు ఫిట్‌నెస్ చేయించుకున్నారు. మిగిలిన 7,270 బస్సుల ఫిట్‌నెస్ పెండింగ్‌లో ఉంది. ఈ బస్సులు ఫిట్‌నెస్ పరీక్షల కోసం రవాణాశాఖ కార్యాలయాలకు రాలేదు.

## రవాణాశాఖ కొరడా

విద్యార్థుల భద్రతను గాలికొదులుతున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై రవాణాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలకు సిద్ధమవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పలు పాఠశాలల బస్సులపై ప్రత్యేక దృష్టి పెట్టాలనే ఫిర్యాదులు కూడా రావడంతో.. రవాణాశాఖ దృష్టి సారించింది. అధికారులు పేరొందిన పాఠశాలలకు చెందిన బస్సుల విషయంలో చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని విద్యాసంస్థలు ఒకే నంబర్‌తో రెండుబస్సులు నడుపుతున్నట్టు కూడా అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. వాటిపై త్వరలోనే ప్రత్యేక దృష్టి పెడుతామని రవాణాశాఖ అధికారులు చెపుతున్నారు. దీనిలోభాగంగా ఫిట్‌నెస్ లేని బస్సులపై శుక్రవారం నుంచి రవాణాశాఖ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నది. ఫిట్‌నెస్‌లేని బస్సులపై స్పెషల్‌డ్రైవ్ చేపడుతున్నట్టు ఇప్పటికే ప్రకటించిన రవాణాశాఖ స్పెషల్ డ్రైవ్ కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలను ఏర్పాటుచేసింది.

## తెలంగాణ ఓపెన్‌స్కూల్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్ష ఫలితాలను గురువారం విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి విడుదలచేశారు. ఎస్సెస్సీలో 47,986 మంది పరీక్షలకు హాజరుకాగా 16,595 (34.58 శాతం) మంది, ఇంటర్‌లో 35,462 మంది హాజరు కాగా 13,755 (38.79 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షలు ఏప్రిల్ 24 నుంచి మే 20 వరకు జరిగాయి.

## ముహూర్తం



సూర్యోదయం: 5.46 గంటలకు



సూర్యాస్తమయం: 6.47 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం ద్వాదశి మధ్యాహ్నం 3.32 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: స్వాతి ఉదయం 10.17 వరకు, తదుపరి విశాఖ, అమృత ఘడియలు: తె.జా. 1.43 నుంచి 3.19 వరకు, రాహుకాలం: ఉదయం 10.39 నుంచి మధ్యాహ్నం 12.16 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.22 నుంచి 9.14 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.43 నుంచి 1.35 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 3.49 నుంచి సాయంత్రం 5.25 వరకు.

# మిస్సింగ్ కేసులపై మరింత సీరియస్

- కేసు ఛేదించగానే సీసీటీఎన్ఎస్‌లో అప్‌లోడ్ చేయాలి
- ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి
- పోలీసులకు ఉన్నతాధికారుల ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో నమోదవుతున్న అదృశ్యం కేసులపై పోలీస్‌శాఖ మరింతగా దృష్టిసారించింది. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదయ్యే మిస్సింగ్ కేసులపై సిబ్బంది తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ప్రత్యేకంగా ఆదేశాలు అందినట్టు సమాచారం. అదృశ్యం కేసుల్లో చాలావరకు పురోగతి సాధిస్తున్నప్పటికీ.. ఆ వివరాలను సీసీటీఎన్ఎస్ (క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్) అప్‌లోడ్ చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. దీంతో పెండింగ్ కేసుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటున్నదని, పరిష్కారమైన కేసుల సమాచారాన్ని ఫిర్యాదుదారులకు వెంటనే ఇవ్వడంతోపాటు, అప్‌డేట్ చేయాలని సూచించారు. మిస్సింగ్ కేసులు ప్రత్యేకించి మహిళలు, చిన్నారుల అదృశ్యం కేసుల్లో వెనువెంటనే దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. ఈ నెల ఒకటి నుంచి 10 వరకు రాష్ట్రంలోని నార్త్ జోన్ పరిధిలోని జిల్లాల్లో మొత్తం 69 అదృశ్యం కేసులు నమోదు కాగా 34 కేసులు పరిష్కారమయ్యాయని, అదేవిధంగా వెస్ట్ జోన్ పరిధిలోని జిల్లాల్లో 150 కేసులు నమోదు కాగా, 58 కేసులను ఛేదించినట్టు పోలీస్ ఉన్నతాధికారి ఒకరు 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.

## తప్పుడు ప్రచారం చేస్తున్న యువజన కాంగ్రెస్ నేత అరెస్టు

**హైదరాబాద్ సిటీబ్యూరో:** మహిళలు, బాలికలు అదృశ్యాలపై అసత్య ప్రచారం చేస్తూ గందరగోళం సృష్టించిన ముగ్గురు యువకులను గురువారం హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టుచేశారు. ఈ నెల 8వ తేదీ నుంచి హైదరాబాద్‌లో మహిళలు, యువతులు, బాలికల అదృశ్యాలు పెరిగిపోతున్నాయని, వీరందర్నీ కిడ్నాపర్లు, మాఫియా ఎత్తుకెళ్తుందని సోషల్ మీడియాలో వైరల్ అయింది. 24 గంటల్లో తెలంగాణ వ్యాప్తంగా 82 మంది అదృశ్యమయ్యారని ప్రచారం జరిగింది. దీనిని 12వ తేదీన సుమోటో కేసుగా స్వీకరించిన సీసీఎస్ పోలీసులు ఈ ప్రచారం మోతీనగర్‌కు చెందిన తెలంగాణ యువజన కాంగ్రెస్ కార్యదర్శి గురజాల వెంకట్ చేస్తున్నట్టుగా గుర్తించారు. తన అనుచరులు క్రాంతి కిరణ్ నాయుడు, బాలరాజు (డిజైనర్, కంటెంట్ రైటర్)తో కలిసి తెలంగాణ యువసైన్యం ఐడీతో సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టినట్టు విచారణలో తేలింది. పోలీసులు ఈ ముగ్గురినీ అరెస్టు చేశారు. కేసీఆర్ ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకే ఈ కుట్ర జరిగిందని సీసీఎస్ పోలీసుల దర్యాప్తులో స్పష్టమైంది. కాగా, పుకార్లను ఫార్వర్డ్ చేసినా, షేర్‌చేసినా నేరమేనని హైదరాబాద్ సీసీఎస్ జాయింట్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి హెచ్చరించారు. ప్రజలు తప్పుడు సమాచారాన్ని నమ్మొద్దని, అలాంటి సమాచారం వచ్చినా దానిని నిర్ధారించుకోకుండా ఇతరులకు షేర్ చేయొద్దని సూచించారు.



గురువారం సచివాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

# 18 నుంచి నట్టల మందు పంపిణీ

- గొర్రెలు-మేకల్లో నట్టల నివారణకు వారంపాటు స్పెషల్ డ్రైవ్
- పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గొర్రెలు-మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ ఈ నెల 18 నుంచి 25 వరకు చేపట్టనున్నట్టు పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. గురువారం సచివాలయం నుంచి పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, టీఎస్ఎల్‌డీఏ సీఈవో డాక్టర్ మంజువాణి, గొర్రెల అభివృద్ధి సమాఖ్య ఎండీ డాక్టర్ వీ లక్ష్మారెడ్డిలతో కలిసి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 18న ఈ కార్యక్రమాన్ని మహబూబాబాద్ జిల్లా గుమ్మనూరులో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లితో కలిసి మంత్రి తలసాని ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని 3.25 లక్షల గొర్రెలు, మేకలకు మొదటి విడత నట్టల నివారణ మందువేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని చెప్పారు. ప్యారావెట్, గోపాలమిత్రల సేవలను కూడా ఇందులో వినియోగించుకుంటామని తెలిపారు. గతంలో ఏడాదికి రెండుసార్లు మాత్రమే నట్టల నివారణ మందు పంపిణీ జరిగేదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత మూడువిడుతలుగా ఈ ప్రక్రియ చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇందుకోసం రూ.22 కోట్లు ప్రభుత్వం ఖర్చుచేస్తున్నదని వెల్లడించారు. గత ఏడాది 563 దవాఖానల అభివృద్ధితోపాటు మౌలిక వసతుల కల్పన కోసం గతంలో ఎన్నడూలేదనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.12.18 కోట్లను ఖర్చుచేసినట్టు చెప్పారు. ఈ ఏడాది సుమారు రూ.12.87 కోట్ల ఖర్చుతో 543 పశువైద్యశాలలను అభివృద్ధి చేయడం, పరికరాలు, మౌలిక వసతులు కల్పించడం వంటిని చేయనున్నట్లు చెప్పారు. గోపాలమిత్రలకు రూ.8,500 వేతనం చెల్లిస్తున్నామన్నారు. ఈ నెల 25న మెదక్ జిల్లాలో గోపాలమిత్రలకు వృత్తినైపుణ్యంపై శిక్షణ ఏర్పాటుచేసినట్టు తెలిపారు.

# భద్రాచలం ఏపీకి ఇచ్చే ప్రతిపాదన లేదు



గురువారం తిరుమల శ్రీవారి ఆలయం బయట కుటుంబసభ్యులతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

**తిరుమల, నమస్తే తెలంగాణ:** భద్రాచలంను ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వాలనే ప్రతిపాదన ఎక్కడా లేదని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి స్పష్టంచేశారు. గురువారం తిరుమలలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐదేండ్ల వ్యవధి ఉన్నప్పటికీ హైదరాబాద్‌లోని ఏపీ భవనాలను తెలంగాణకు కేటాయించడం అభినందనీయమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఆహ్వానించామని తెలిపారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సహాయ సహకారాలు అందించుకొని అభివృద్ధికి కృషిచేయాలని పేర్కొన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని వీఐపీ విరామ సమయంలో దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో మంత్రికి వేదపండితులు వేద ఆశీర్వచనంచేయగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.

## లోకం పోకడ



నా డ్యూటీ టైం అయిపోయింది, నేనెళ్తా.. నీ డ్యూటీ టైంలో నేనే పని చేయాలంటే ఎట్లా?

# నేటినుంచే బడిబాట

- ఏర్పాట్లు పూర్తిచేసిన విద్యాశాఖ
- 17న సామూహిక అక్షరాభ్యాసం
- రోజువారీ కార్యక్రమాల జాబితా విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో శుక్రవారం (ఈ నెల 14) నుంచి 19 వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటను నిర్వహించడానికి సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేలా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాధికారులకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు రోజువారీ కార్యక్రమాలు రూపొందించి అమలుచేయాలని, ప్రతి ఆవాస ప్రాంత పాఠశాల యాజమాన్య కమిటీలోని తల్లిదండ్రులు, గ్రామ పాలకవర్గం, స్వయం సహాయ మహిళా సంఘాలు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల సహకారంతో గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులదేనని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ఆవాసాల్లో విలేజ్ ఎడ్యుకేషనల్ రిజిస్టర్ (వీఈఆర్) ఎప్పటికప్పుడు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ స్పష్టం చేశారు.

## రోజువారీ కార్యక్రమాలు

పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు 14న మన ఊరి బడి, 15న బాలికా విద్య, 17న సామూహిక అక్షరాభ్యాసం, 18న స్వచ్ఛ పాఠశాల హరితహారం, 19న పాఠశాల యాజమాన్య కమిటీ- బాలకార్మికుల విముక్తి వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బడిబాటను విజయవంతం చేయడానికి 25 అంశాలతో డీఈవోలకు లక్ష్యాలను నిర్దేశించారు.



# 17న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్ ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ హైదర్‌గూడలో కొత్తగా నిర్మించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసగృహాల సముదాయాన్ని ఈ నెల 17న ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ప్రారంభించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఉదయం 11 గంటలకు ఆయన క్వార్టర్స్‌ను ప్రారంభించనున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి ఆర్అండ్‌బీ, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గృహవాస్తు పూజలు నిర్వహించనున్నారు.

# ప్రైవేటు స్కూళ్లకు ఫైర్‌సేఫ్టీ ప్రమాణాల సడలింపు

యాజమాన్యాలకు ఊరట కలిగించిన విద్యాశాఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఫైర్‌సేఫ్టీ ప్రమాణాల విషయంలో రాష్ట్రంలోని ప్రైవేటు స్కూళ్లకు ఊరట కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. 2009 కంటే ముందు గుర్తింపు పొందిన ప్రైవేటు స్కూళ్లకు సడలింపు ఇచ్చారు. ఫైర్‌సేఫ్టీ ప్రమాణాలు పాటించకపోయినా అందుకు సంబంధించిన పరికరాలు మాత్రం తప్పనిసరిగా ఉండాలని నిర్ణయం తీసుకున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ తెలిపారు. 2009 సంవత్సరం తర్వాత విద్యాశాఖ నుంచి గుర్తింపు పొందిన ప్రైవేటు స్కూళ్లు మాత్రం సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ఫైర్‌సేఫ్టీ ప్రమాణాలు తప్పకుండా పాటించాల్సిందేనని తెలిపారు. నిబంధనల సడలింపుతో దాదాపు వెయ్యి ప్రైవేటు స్కూళ్లకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. 2009కి ముందు విద్యాశాఖ నుంచి పదేండ్ల వరకు పొందిన ప్రైవేటు స్కూళ్ల గడువు ముగిసింది. మరో పదేండ్లు గుర్తింపు పొందడానికి పాఠశాల విద్యాశాఖకు దరఖాస్తు చేసుకున్నందున పరిశీలిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

## న్యాయశాఖ కార్యదర్శి పదవీకాలం పొడిగింపు

- మరో ఏడాది కొనసాగనున్న నిరంజన్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు పదవీకాలాన్ని ఏడాదిపాటు పొడిగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చేనెల 3తో పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. పదవీకాలాన్ని పొడిగించినందుకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు విశిష్ట విహంగ అతిథి



శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం విశిష్ట విహంగ అతిథికి స్వాగతం పలికింది. ప్రపంచంలోనే అతిపెద్ద విమాన సర్వీస్ కలిగిన ఎతిహాద్ ఎయిర్‌వేస్‌కు చెందిన 787-10 డ్రీమ్‌లైనర్ లేటెస్ట్ వర్షన్ విమానం తొలిసారి శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది. దీని పొడవు 60 మీటర్లు, ఎత్తు 17 మీటర్లు. ఇందులో 330 మంది ప్రయాణించవచ్చు. 11,910 కిలోమీటర్లు ఆగకుండా ప్రయాణించగలిగే సామర్థ్యం దీని ప్రత్యేకత. అబుదాబీ నుంచి వచ్చిన ఎతిహాద్ గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఎయిర్‌పోర్టులో దిగగా, ఎయిర్‌పోర్టు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. శంషాబాద్ విమానాశ్రయం భారీస్థాయి విమానాలు సైతం ల్యాండ్ అయ్యేందుకు తగిన సామర్థ్యం కలిగి ఉన్నది.

- శంషాబాద్



కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గానికి చెందిన జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు ఎమ్మెల్యే రసమయి బాల కిషన్ నేతృత్వంలో గురువారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావును కలిశారు. ఇటీవల జరిగిన పరిషత్ ఎన్నికల్లో విజయం సాధించిన వారిని ఈ సందర్భంగా కేటీఆర్ అభినందించారు.

## మధుమేహులకు మంచి ఆహారం

# తెలంగాణ సోనా

- షుగర్ బాధితులకు అనుకూల వరి వంగడం
- సాధారణ వరిలో 'గ్లైసెమిక్ ఇండెక్స్' 55 నుంచి 70కి పైనే..
- ఆర్‌ఎన్‌ఆర్15048 తెలంగాణ సోనా వంగడంలో 51.6 మాత్రమే
- ఇది షుగర్‌ఫ్రీ రైస్ కాదు: డాక్టర్ దామోదర్‌రాజు, ప్రధాన శాస్త్రవేత్త



ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీ శాస్త్రవేత్తలు ఆవిష్కరించిన ఆర్‌ఎన్‌ఆర్ 15048 వరి వంగడం





**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** మధుమేహ (షుగర్) వ్యాధి ఉందనగానే ఒక్కసారిగా మనిషిలో నీరసం వచ్చేస్తుంది. శరీరంలో వ్యాధి ప్రభావాన్ని మించి మానసిక వ్యథ పట్టిపీడిస్తుంది. ఈ వ్యాధి వచ్చిందంటే.. జీవితాంతం మందులు వేసుకోవాల్సిందే. ఇన్సులిన్ ఎక్కించుకోవాల్సి వస్తుందని కొందరు అన్నం కూడా తినలేమమని కుంగిపోతారు. వ్యాధిగ్రస్థులకు ఏవైద్యుడైనా చెప్పే సలహా అన్నం తగ్గించమనే.. బియ్యంతో వండిన ఆహారంతో రక్తంలో గ్లూకోజ్‌శాతం పెరుగుతుందనే మానసిక ఒత్తిడితోనోరు కట్టేసుకోవడంతో సగం ఆకలిపోతుంది. ఇలా దిగులు పడేవారికి ఓ తీపి కబురు అందించారు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధక శాస్త్రవేత్తలు. షుగర్ బాధితులు కూడా బియ్యంతో భోజనం చేయొచ్చు. ఇక్కడి శాస్త్రవేత్తలు వ్యాధిగ్రస్థుల కోసం తక్కువస్థాయిలో గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) ఉన్న వరి వంగడం 'ఆర్‌ఎన్‌ఆర్15048 తెలంగాణ సోనా'ను ఆవిష్కరించా రు. ఇది షుగర్ బాధితులకు ఒక వరం కానున్న ది. అన్నం తినడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయి పెరుగుతుంది కాబట్టి బాగా తగ్గించాలని వైద్యులు చెప్తారు. తెలంగాణ సోనా సాధారణ వరికంటే భిన్నంగా ఉంటూ మధుమేహ బాధితులకు అనుకూలమైంది. ఈ వంగడంలో జీఐ 51.6 ఉంటే, సాధారణ రకాల వరిలో 55 నుంచి 70 వరకు ఉంటుంది. షుగర్ బాధితులు తక్కువ జీఐ ఉన్న ఆహారం తీసుకోవాలని వైద్యులు చెప్తారు. సాధారణ, పాలిష్డ్ వరిలో కార్బోహైడ్రేట్స్ అధికంగా ఉంటాయి. ఈ అన్నంతో రక్తంలో గ్లూకోజ్ శాతం అధికమవుతుంది. బాస్మతి వరిలో జీఐ 70 ఉంటే బీపీటీ వరిలో ఇది 50 నుంచి 60 ఉంటుంది. బాస్మతి రైస్‌ను నూనెతో మమేకం చేసి వండటంతో జీఐ పడిపోతుంది.

**షుగర్ కంటెంట్ ఉత్పత్తి**

షుగర్ కంటెంట్ చక్కెర, పండ్లు, పిండి పదార్థాల నుంచి ఉత్పత్తి అవుతుంది. చక్కెర నుంచి సుక్రోజ్, పండ్ల నుంచి ఫ్రక్టోజ్, కార్బోహైడ్రేట్స్ నుంచి గ్లూకోజ్ వస్తాయి. చక్కెరలో జీఐ 70 ఉంటే, గ్లూకోజ్‌లో 100, ఫ్రక్టోజ్‌లో 50 కంటే దిగువస్థాయిలో ఉంటుంది. మొక్కలు, ఫొటోసింథసిస్, నీటి నుంచి గ్లూకో జ్ ఉత్పత్తి అవుతుంది. గ్లూకోజ్ మాలిక్యులర్ ఫార్ములాలో సాధారణంగా షుగర్. అందుకే షుగర్ కంటెంట్‌కు దూరంగా ఉండాలంటారు.

**తెలంగాణ సోనా నూతన ఆవిష్కరణ**

ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీ శాస్త్రవేత్తలు ఆవిష్కరించిన సరికొత్త వంగడం తెలంగాణ సోనా. వరిలో జీఐ 55కు దిగువస్థాయిలో ఉంటే గ్లూకోజ్ తక్కువ స్థాయిలో ఉన్నట్టు, 55 నుంచి 69 వరకు ఉంటే మధ్యమ స్థాయిలో, 70కి ఎగువన ఉంటే ఉన్నతస్థాయిలో ఉన్నట్టు శాస్త్రవేత్తలు చెప్తారు. తక్కువస్థాయిలో పాలిష్‌చేసిన రైస్ మధుమేహ బాధితులు తినదగినవని, వాటిలో జీఐ అథమస్థాయిలో ఉంటుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. అన్నం, పిండి పదార్థాలు, కార్బోహైడ్రేట్స్, గ్లూకోజ్ కంటెంట్ అధికంగా శక్తిని ఉత్పత్తిచేస్తాయి. కూరగాయలు, జొన్నరొట్టె మొదలైనవి షుగర్ బాధితులకు శ్రేయస్కరం. ఆర్‌ఎన్‌ఆర్ 15048 లోనూ తక్కువస్థాయిలో జీఐ ఉన్నందున తినడం మంచిదని పేర్కొన్నారు.

### షుగర్ ఉన్నవారికి శుభవార్త



ఏ బియ్యంలోనైనా కార్బోహైడ్రేట్స్ ఉంటాయి. వాటిలో వివిధస్థాయిల్లో జీఐ ఉంటుంది. ఆర్‌ఎన్‌ఆర్ 15048 తెలంగాణ సోనా వంగడం షుగర్‌ఫ్రీ కాదు. ఇది తక్కువస్థాయిలో జీఐ ఉన్న వరి వంగడం. దీంతో షుగర్ కంట్రోల్ కాకున్నా, మిగతా వాటితో పోల్చితే షుగర్ ఉన్నవారికిది మంచి ఆహారం. 2014లోనే దీన్ని ఆవిష్కరించాం. ప్రాచుర్యంలోకి రావడానికి సమయం పట్టింది. ఈ వంగడాన్ని స్వల్పకాల పంటగా గుర్తించాం. కేవలం 120 రోజుల్లో పంట చేతికొస్తుంది. ప్రస్తుతం ఐదు లక్షల ఎకరాల్లో దీన్ని పండిస్తున్నాం. స్వల్పకాల పంటల్లో ఇది సన్న రకం.

-డాక్టర్ సీహెచ్ దామోదర్‌రాజు,
ప్రధాన శాస్త్రవేత్త, వరి పరిశోధన కేంద్రం

## మూడ్రోజులు వడగాడ్పులు

### రాష్ట్రంలో పెరుగనున్న ఎండల తీవ్రత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో మూడ్రోజులు (శుక్ర, శని, ఆదివారాల్లో) వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. రాష్ట్రంలో అత్యధికంగా గురువారం కరీంనగర్ జిల్లాలో 42.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, మంచిర్యాలలో 42.6, సిద్దిపేటలో 42.4 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35.8 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం వడదెబ్బతో 14 మంది మృతిచెందారు. కరీంనగర్, వరంగల్ రూరల్ జిల్లాల్లో నలుగురు చొప్పున, వరంగల్ అర్బన్ జిల్లాలో ఇద్దరు, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో కలిపి ముగ్గురు, జనగామ జిల్లాలో ఒకరు వడదెబ్బతో చనిపోయారు.

## పట్టుపరిశ్రమలశాఖలో పదోన్నతులకు కమిటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పట్టు పరిశ్రమశాఖలో లెవల్-1, లెవల్-2 గెజిటెడ్ అధికారుల పదోన్నతులకు ప్రభుత్వం డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్స్ కమిటీ (డీపీసీ)ని ఏర్పాటుచేసింది. పట్టుపరిశ్రమశాఖ డైరెక్టర్ కన్వీనర్‌గా, వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ జాయింట్ సెక్రటరీ, పట్టుపరిశ్రమశాఖ డిప్యూటీ డైరెక్టర్లు సభ్యులుగా కమిటీని ఏర్పాటుచేశారు. ఈ మేరకు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

**పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయము**
పరిపాలన భవనం, రాజేంద్రనగర్, హైదరాబాదు-500 030
పశుసంవర్ధక, మరియు మత్స్య శాస్త్ర పాలిటెక్నిక్ ప్రవేశ ప్రకటన
నెం. 2/Exam/2019 తేది : 13.06.2019

పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయము నందు గల పశుసంవర్ధక మరియు మత్స్య శాస్త్రము నందు రెండు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సులకు 2019-20 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించబడును. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు, దరఖాస్తు, మార్గదర్శకాలు మరియు ఇతర వివరముల కొరకు విశ్వవిద్యాలయం యొక్క వెబ్ సైట్ http://tsvu.nic.in ను సందర్శించగలరు. పూర్తి చేసిన దరఖాస్తులు స్వీకరించడానికి చివరి తేది 10.07.2019.
రిజిస్ట్రారు యస్.టి. వీరోజ రావు

**TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION**
TSPSC
Prathibha Bhavan, M.J.Road, Nampally, Hyderabad
**ASSISTANT PROFESSORS (Clinical Departments)**
**IN DIRECTOR OF MEDICAL EDUCATION**
(General Recruitment) Notification No. 49/2017
**RESULT NOTIFICATION FOR INTERVIEW)**

The Commission published the List of provisionally admitted candidates for **INTERVIEW** (Oral Test) to the post of Assistant Professors (Clinical Departments) in Director of Medical Education. The Interviews will be held in the office of TSPSC at Prathibha Bhavan, Nampally, Hyderabad from **24/06/2019 to 26/06/2019.**

For the List of candidates provisionally admitted for Interview and specialty wise Interview Schedule and further details, candidates can visit the Commission's Website **www.tspsc.gov.in**

**Hyderabad** Sd/-
**Date. 12/06/2019.** **SECRETARY**
DIPR R.O. No.153pp/CL/Advt/1/1/2019-20.

# సింగరేణి.. హరితవారధి

- కనుమరుగవుతున్న వృక్షజాతులకు పునరుజ్జీవం
- 12 నర్సరీల్లో 50 రకాల వృక్షజాతుల పెంపకం
- ఇప్పటిదాకా 3.32 కోట్ల మొక్కలు నాటిన సంస్థ
- ఈఏడాది కోటి మొక్కలు నాటేందుకు ప్రణాళిక



సింగరేణి సత్తుపల్లి డంప్‌యార్డులో హరితహారంలో భాగంగా పెంచినవనాలు



హరితహారంలో మొక్కనాటిన సింగరేణి సీఎండీ శ్రీధర్ (ఫైల్‌ఫొటో)

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కనుమరుగవుతున్న వృక్షజాతులను సంరక్షించేందుకు సింగరేణి సంస్థ నడుం బిగించింది. ఇప్పటికే పెద్దసంఖ్యలో మొక్కలను నాటిన సింగరేణి.. అంతరించిపోయే దశలో ఉన్న 50 రకాల మొక్కలను విస్తృతంగా నాటుతూ హరిత తెలంగాణ నిర్మాణంలో కీలక బాధ్యత నిర్వర్తిస్తున్నది. పర్యావరణాన్ని కాపాడేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇప్పటికే భారీస్థాయిలో చేపట్టిన హరితహారం కార్యక్రమంలో సింగరేణి ఇప్పటివరకు 3.32 కోట్ల మొక్కలను నాటి తన ప్రత్యేకతను చాటుకున్నది. ఈ ఏడాది హరితహారంలో తనవంతుగా మరో కోటి మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నది. సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ స్వయంగా హరితహారంలో పాల్గొని తమ సిబ్బంది, కార్మికుల్లో ఉత్సాహాన్ని నింపుతుండటంతో ఏటా ఈ కార్యక్రమం విజయవంతమవుతున్నది. ఈ ఏడాది మరో కోటి మొక్కలను నాటేందుకు సింగరేణి గనులు విస్తరించి ఉన్న ఆరు జిల్లాల్లోని 12 నర్సరీల్లో సుమారు 70 లక్షల మొక్కలను సిద్ధంచేయించిన ఆయన.. మరో 30 లక్షల మొక్కలను ఇతర నర్సరీల నుంచి సమకూర్చుకునేందుకు ఏర్పాట్లు చేశారు. 1984 నుంచి 2014 వరకు (30 ఏండ్ల కాలంలో) 1.31 కోట్ల మొక్కలను నాటిన సింగరేణి.. హరితహారం ప్రారంభమైన నాటినుంచి గత నాలుగేండ్లలో మరో 3.32 కోట్ల మొక్కలను నాటింది. రైతులు పంటగా వాడుకునేందుకు యూకలిప్టస్ మొక్కలను పంపిణీ చేసింది.

**కనుమరుగవుతున్న జాతులకు ప్రాధాన్యం**

అడవుల్లో ముఖ్యమైన వృక్ష జాతులు కనుమరుగవుతున్న విషయాన్ని గుర్తించిన సింగరేణి యాజమాన్యం వాటిని కాపాడుకోవాలని సంకల్పించింది. 6 జిల్లాల్లోని 12 నర్సరీల్లో నారెప, వెదురు, మారేడు, నేరుడు, చిందుగ, నెమలినార, తాని, మర్రి, ఎర్రచందనం, ఏగిస, జువ్వి, బూరుగ, జిట్రేగి, రావి, ఉసిరి, బట్టగణం, సిస్సో లాంటి మొక్కలను పెంచుతూ వాటికి పునరుజ్జీవం పోస్తున్నది. విశాలమైన ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడం (బ్లాక్ ప్లాంటేషన్) వల్ల అవి పెరిగి ఆయా ప్రాంతాలు సహజసిద్ధమైన అడవులుగా రూపుదిద్దుకొంటున్నాయి. పశుపక్షాదులు కూడా వచ్చి చేరుతున్నాయి. సత్తుపల్లి, రుద్రంపూర్, మణుగూరు, బెల్లంపల్లి తదితర ప్రాంతాల్లో సింగరేణి అభివృద్ధి చేసిన ప్లాంటేషన్లు నేడు సహజ అడవులను తలదన్ని వాటికంటే ఎక్కువ వృక్షసాంద్రతతో పర్యావరణానికి మేలుచేస్తున్నాయి.

**KL UNIVERSITY** (DEEMED TO BE UNIVERSITY) VIJAYAWADA Ph: 0866-2577715
NAAC ACCREDITED A++ GRADE | CATEGORY 1 UNIVERSITY
**KLH UNIVERSITY** (DEEMED TO BE UNIVERSITY) HYDERABAD Ph: 040-23542127
KONERU LAKSHMAIAH EDUCATION FOUNDATION
(Deemed to be University estd., u/s 3 of UGC Act 1956)

**EXCLUSIVE B.Tech COUNSELLING for EAMCET, JEE, CBSE & IPE CANDIDATES - HYDERABAD & VIJAYAWADA Campuses**

15th June 2019 saturday & 16th June 2019 Sunday From 9.00 AM

*Candidates belonging to Open Category with
- EAMCET (TS / AP) Ranks 1-50000
- JEE '19 - 60% & above
- IPE(TS) - 800 Marks & Above
- IPE(AP) - 8.5 CGPA & above
- CBSE - 8.0 CGPA & Above

*Candidates belonging to EAMCET (TS/AP), IPE (TS/AP) Categories who have not applied earlier can directly attend the counseling
- 25% of the seats are reserved for these categories

| CATEGORY | MERIT SCHOLARSHIPS (T & C Apply) | | | |
|---|---|---|---|---|
| | 50% | 25% | 15% | 10% |
| EAMCET (TS / AP) Ranks | 01-1000 | 1001-2000 | 2001-3000 | 3001-4000 |
| JEE MAINS percentile | 95% & above | 90% & above | 85% & above | 80% & above |
| INTER(TS) Marks | 985 - 989 | 980 - 984 | 975 - 979 | 952 - 974 |
| INTER(AP) CGPA | 9.95 & above | 9.90 & above | 9.85 & above | 9.80 & above |
| CBSE/CISCE/IB/CAMBRIDGE | 9.0 CGPA & above | 8.75 CGPA & above | 8.5 CGPA & above | 8.25 CGPA & above |

EDUCATION LOANS : Students can apply education loans from the bank counters being kept at the campus counselling centers.
Director : 9490361111, Hyderabad - 9966695455, 9550344777, 9030027222
Khammam - 9290429635 | Karimnagar - 7997995709





గొట్టిముక్కలలో ఏర్పాటుచేసిన స్పెషల్ డ్రైవ్‌లో రైతుల సమస్యలను పరిష్కరిస్తున్న రెవెన్యూ అధికారులు

## గొట్టిముక్కలలో 83 సమస్యలు పరిష్కారం

- 'ఒక ఊరు.. వంద తప్పులు' కథనానికి స్పందన
- స్పెషల్ డ్రైవ్‌లో రైతులను విచారించిన తాసిల్దార్ రామకృష్ణ
- 65 మంది రైతులకు ప్రొసీడింగ్స్ అందజేత
- మరో 18 మంది రైతుల మ్యుటేషన్స్ పరిష్కారం

**దేవరకొండ, నమస్తేతెలంగాణ:** ఈ నెల 11న 'నమస్తే తెలంగాణ'లో 'ఒక ఊరు.. వంద తప్పులు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. 24 గంటల వ్యవధిలోనే 83 మంది రైతుల సమస్యలను పరిష్కరించారు. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం గొట్టిముక్కలలో 70 శాతానికిపైగా రైతుల రికార్డులు సరిగా లేకపోవడం.. వివిధ కారణాలతో పాస్‌పుస్తకాలు రాకపోవడంతో చాలా మంది రైతుబంధుకు దూరమయ్యారు. ఈ పరిస్థితుల్లో 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితం కావడంతో జాయింట్ కలెక్టర్ చంద్రశేఖర్ స్పందించారు. దేవరకొండ తాసిల్దార్ కార్యాలయంలో బాధిత రైతులతో జేసీ మాట్లాడారు. వారంరోజుల్లో సమస్యలన్నీ పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో అధికారులు గొట్టిముక్కలలో బుధ, గురువారాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వీఆర్వో, ఆపరేటర్‌ను ప్రత్యేకంగా నియమించడంతోపాటు ముగ్గురు వీఆర్ఏలను కేటాయించారు. తాసిల్దార్ రామకృష్ణ కూడా గ్రామానికి వెళ్లి భూసమస్యలను తెలుసుకున్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో 70 వరకు మ్యుటేషన్‌కు సంబంధించిన సమస్యలను గుర్తించారు. వివిధ దశల్లో ఈ సమస్యలను పరిష్కరించాల్సి ఉండగా 18 ఖాతాలకు పరిష్కారం చూపారు. మరో 65 ఖాతాలకు సంబంధించి మ్యుటేషన్స్, ఫౌతీలకు ప్రొసీడింగ్స్ తయారైనప్పటికీ వీఆర్వో రైతులకు అందజేయకుండా తనవద్దే ఉంచుకున్నట్టు విచారణలో తేలింది. దీంతో వాటిని తెప్పించి రైతులకు అందజేశారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న గొట్టిముక్కల రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న భూముల లెక్కలను కూడా తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎన్ని భూములకు అవార్డ్సు పాస్‌చేసేశారన్న వివరాలన్నింటినీ ఒకచోట చేర్చి రెండు, మూడు రోజుల్లో లెక్కతేల్చనున్నారు. మ్యుటేషన్‌కు సంబంధించిన మ్యానువల్ వర్క్ దాదాపుగా పూర్తికావొచ్చిందని, డిజిటల్ పని మిగిలిపోయిందని తాసిల్దార్ రామకృష్ణ తెలిపారు. వారంరోజుల్లో గొట్టిముక్కలలోని భూసమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.



మోతెలో సూర్యాపేట-ఖమ్మం రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

## మా భూసమస్యలు పరిష్కరించండి

- సూర్యాపేట జిల్లా మోతెలో రావికుంటతండా రైతుల రాస్తారోకో
- వీఆర్వో లక్ష్మీనారాయణను సస్పెండ్‌చేయాలని డిమాండ్

**మోతె:** భూసమస్యలు పరిష్కరించి తమకు వెంటనే పాస్‌పుస్తకాలు ఇప్పించాలని డిమాండ్‌చేస్తూ సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రంలో సూర్యాపేట- ఖమ్మం ప్రధాన రహదారిపై రావికుంటతండా రైతులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. రావికుంటతండాలో రోజురోజుకు భూసమస్యలు పెరిగిపోతున్నాయని, సుమారు 25 మంది భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించాలని తాసిల్దార్ కార్యాలయం చుట్టు తిరిగినా పట్టించుకోవడంలేదని వాపోయారు. వీఆర్వో లక్ష్మీనారాయణ ఒక్కొక్క రైతు నుంచి రూ.5 వేల నుంచి రూ.6 వేలు తీసుకున్నా పాస్‌పుస్తకాలు మాత్రం ఇవ్వడం లేదని, దీంతో తమకు ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు పథకం వర్తించడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. రావికుంటతండాలో రూ.లక్షల అవినీతికి పాల్పడ్డ వీఆర్వో లక్ష్మీనారాయణపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. పోలీసులు వచ్చి రైతులకు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తాసిల్దార్ సరస్వతికి అందజేశారు.

## మూడు తరాలుగా
# దక్కని హక్కు

ఖమ్మం జిల్లా కొణిజర్లలో 180 మంది రైతుల అరిగోస

370 ఎకరాలు పట్టాకోసం ఎక్కని మెట్టులేదు • 70 ఏండ్ల క్రితం జాగీర్దార్‌ల నుంచి కొన్న అన్నదాతలు

సీలింగ్ చట్టం సాకుతో హక్కు పత్రాలివ్వని అధికారులు • కోర్టు ఆదేశాలూ బుట్టదాఖలు



క్షేత్రస్థాయి సర్వేచేసి పట్టాలు ఇవ్వాలని కోర్టు ఇచ్చిన తీర్పు కాపీని చూపుతున్న రైతులు

భూరికార్డుల ప్రక్షాళన చేపట్టి రాష్ట్రంలోని అన్నదాతలందరికీ పెట్టుబడి సాయం కోసం రైతుబంధు.. భరోసా కోసం రైతు బీమా పథకాలతో ప్రతి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొని ఉంటే.. ఆ ఊళ్లో మాత్రం ఎంత ఎవుసం చేసినా దండుగే నన్న పరిస్థితి దాపురించింది. ఎప్పుడో ఏడు దశాబ్దాల క్రితం జాగీర్దార్ కాలం నుంచి సాగుచేసుకొంటూ వస్తున్న భూమిపై మూడు తరాలు మారినా హక్కు పత్రాలు అందకపోవడంతో రైతులు తీవ్ర నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం సింగరాయపాలెం రెవెన్యూ గ్రామంలోని సుమారు నాలుగు గ్రామాలకు చెందిన రైతుల దుస్థితి ఇది. అధికారుల ఉదాసీనతతో సుమారు 180 మంది రైతులు ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు.

**కొణిజర్ల:** ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం సింగరాయపాలెం రెవెన్యూ పరిధిలోని తీగల బంజర, మంగాపురం, అల్లీపురం, గుండ్రాతి మడుగు గ్రామాలకు చెందిన రైతాంగం 1950 నుంచి 1960 సంవత్సరం మధ్య కాలంలో నాటి జాగీర్దార్లైన మహమ్మద్ అసద్ అలీ, హైమదా బేగం వద్ద నుంచి సుమారు 370 ఎకరాల భూమి కొనుగోలుచేశారు. ఆ భూములపై పూర్తి హక్కు పత్రాలు రాకముందే.. 1973లో వచ్చిన సీలింగ్ చట్టం పిడుగులా పడింది. రైతులు కొన్న 370 ఎకరాలు సీలింగ్ పరిధిలోకి వస్తాయంటూ.. ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో ఆందోళన చెందిన రైతాంగం తాము భూములు కొన్న జాగీర్దార్లకు మొరపెట్టుకోగా.. వాళ్లు వారికి అనుకూలంగా స్పందించారు. సీలింగ్ చట్టం రావడానికి ముందే తమ భూములను చిన్న, సన్నకారు రైతులకు విక్రయించామని, అప్పటి నుంచి వారంతా సాగు చేసుకొంటున్నారని వరంగల్ ట్రిబ్యునల్‌లో విన్నవించారు. వాదోపవాదాలన్నీ విన్న ట్రిబ్యునల్ సంబంధిత వ్యవహారాన్ని ఖమ్మం ఆర్డీవోకు బదలాయించింది. ఆయా భూములపై క్షేత్రస్థాయిలో సర్వే జరిపి రైతాంగానికి భూమి హక్కు పత్రాలు అందించాలని సూచించింది. ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. కానీ భూమి హక్కు పత్రాలు మాత్రం ఇవ్వలేదు. ఆరు దశాబ్దాలుగా రైతాంగం ఎక్కని మెట్టు, తిరుగని కార్యాలయం లేదు. ఈ సమయంలోనే కొందరు మధ్యవర్తులు ఈ వ్యవహారంలో దూరి.. పాస్‌పుస్తకాలిప్పిస్తామంటూ రైతుల నుంచి ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ముడుపులు దండుకొన్నారు. అయినా పని మాత్రం కాలేదు. సుమారు 180మంది రైతులు ఈ సమస్యతో ఇబ్బందులు పడుతూ చివరకు 'ధర్మగంట'ను ఆశ్రయించారు. కాళ్లరిగేలా తిరిగినా కనికరించే వారే కరువయ్యారని, పుడమి తల్లినే నమ్ముకున్న తమ కుటుంబాలను కేసీఆర్ సార్ ఆదుకోవాలని, సమగ్ర విచారణ జరిపించి భూములపై హక్కులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, జీవితాంతం తమ కుటుంబాలు కేసీఆర్ సార్‌కు రుణపడి ఉంటాయని ప్రాధేయపడుతున్నారు.

### ఇబ్బందులు పడుతున్నాం



దశాబ్దాల క్రితం కొనుగోలుచేసిన భూమికి నేటికీ పాస్‌పుస్తకాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పాస్‌బుక్‌లు ఇప్పిస్తామంటూ ఎవరొచ్చినా వాళ్ల కాళ్లావెళ్లాపడుతున్నా మా సమస్య పరిష్కరించిన వారులేరు. సీఎం కేసీఆర్ సార్ మా రైతాంగంపై దయచూపి మా సమస్య పరిష్కారమయ్యేలా అధికారులను ఆదేశించాలి. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

**- షేక్ యాకూబ్ అలీ, తీగలబంజర**

### రైతుబంధు అందడం లేదు



తోటి రైతులందరికీ రైతుబంధు వర్తిస్తున్నది. మాకు మాత్రం అందటంలేదు. మా నాన్న కొనుగోలు చేసిన భూమిని ప్రస్తుతం నా కొడుకుకు ఇచ్చా. మా భూమి 2015 వరకు పహాణీలో వచ్చింది. ప్రస్తుతం ఏ రికార్డుల్లోనూ మా పేరు నమోదై లేదు. ఎన్నో ఏండ్లుగా సాగుచేస్తున్న మా భూమిపై మాకు హక్కులు కల్పిస్తే రుణపడి ఉంటాం.

**- తుమ్మలపల్లి గోపాలరావు, సింగరాయపాలెం**

# పేరు మాయమైంది

- రిజిస్ట్రేషన్ చేసుకోకపోవడమే తప్పు
- అసలు యజమాని ఉండగానే రియల్టర్‌కు భూ మార్పిడి
- ధర్మగంటను ఆశ్రయించిన యాదాద్రి భువనగిరి జిల్లా రైతు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం, దిలావర్‌పూర్ గ్రామంలోని సర్వే నంబర్ 159/అలో ఉన్న 3.12 ఎకరాల భూమిని 1974లో కస్తూరి విశ్వనాథం వద్ద సాదాబైనామా ద్వారా కొన్న. అప్పట్నుంచి నేటివరకూ ఈ పొలాన్ని నేనే దున్నుతున్న. 1987-88 వరకూ రికార్డుల్లో నా పేరే ఉన్నది. తర్వాత ఏమైందో కానీ నా పేరు కనిపించకుండా పోయింది. ఈ క్రమంలో స్థానిక ఎమ్మార్వోను సంప్రదించాం. పంచనామాచేయమని దరఖాస్తు చేసుకున్నం. ఆలేరు ఎమ్మార్వో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వో కలిసి 2006 మార్చి 2 న పంచనామాచేశారు. మేం చెప్తున్నది వాస్తవమేనని నిర్ణయించి మా పేరును రెవెన్యూ రికార్డుల్లో నమోదుచేస్తూ అప్పటి తాసిల్దార్ మెమో నంబర్ సీ 5774 జారీచేశారు. 2006లో మాకు ప్రొసీడింగ్‌లూ ఇచ్చారు. ఇంతలో కస్తూరి శంకరయ్య అనేవ్యక్తి ముందుకొచ్చి, తనను కస్తూరి విశ్వనాథం దత్తత తీసుకున్నారని, 3.12 ఎకరాల పొలాన్ని తన నాన్న అమ్మలేదంటూ ఆర్డీవో దగ్గర కేసుపెట్టాడు. నకిలీ పత్రాలను తయారుచేయించి ఒక రియల్టర్‌కు విక్రయించాడు. ఆర్డీవో లాయర్‌ను మచ్చికచేసుకొని మేం కబ్జాలో ఉన్నప్పటికీ, మా పేరును రికార్డుల్లో నుంచి తొలిగించేలాచేశాడు. ఇది తెలుసుకున్న వెంటనే.. మాకు న్యాయంచేయాలని కోరుతూ.. జేసీ కోర్టులో 2013లో కేసు వేశాం. మాకు అనుకూలంగా 2019 జనవరి 5న తీర్పు వచ్చింది. కస్తూరి శంకరయ్య పాస్‌పుస్తకాలు నకిలీవని తేలింది. కాకపోతే, ఎమ్మార్వోను సమగ్ర విచారణ చేయమన్నారు. అదే మాపాలిట శాపమైంది. గతనెల 22న అన్ని ఆధారాలతో మోఖాపై ఉండమని ఎమ్మార్వో నోటీసులు పంపి.. తీరా వచ్చేసరికి ఆ రోజు మోఖాపైకి రాకుండానే, మా కాగితాలు చూడకుండానే.. కస్తూరి శంకరయ్య విక్రయించిన రియల్టర్‌కు అనుకూలంగా ఎమ్మార్వో రిపోర్టు రాసి ఆర్డీవోకు ఇచ్చారు. వాళ్లకు వాస్తవాలు తెలుసు. 1974లో కొన్న విషయమూ తెలుసు. అయినా పట్టించుకోవడంలేదు. మరోవైపు ఈ పొలం పక్కనే నా భార్య పేరిట రిజిస్టర్ అయిన 5.13 ఎకరాల పొలం ఉన్నది. ఇందుకు సంబంధించిన కొత్త పాస్ పుస్తకమున్నది. రైతుబంధు చెక్కు కూడా వచ్చింది. కానీ ఇదే తన 3.12 ఎకరాల భూమి అంటూ ఈ 5.13 ఎకరాల పొలం తాను కొనుక్కున్నానంటూ దున్ననివ్వడం లేదు. వానకాలం రావడంతో వరినాట్లు వేయడానికి మా పొలంలోనికే వెళ్లనీయకుండా అడ్డుపడుతున్నాడు. 'పోలీసులకు ఫిర్యాదు చేసినా పరిష్కారం కావడంలేదు. రెవెన్యూ అధికారులకు చెప్తేనేమో పాస్‌పుస్తకం మీ పేరిటే ఉన్నది కదా.. రైతుబంధు కూడా వస్తుంది.. అంతకుమించి మేమేం చేయలేం' అంటూ చేతులెత్తేస్తున్నారు. ఎంతమంది అధికారులకు చెప్పుకున్నా మా సమస్య పరిష్కారం కావడం లేదు. అందుకే, ధర్మగంటను ఆశ్రయించిన. 45 ఏండ్ల నుంచి దున్నుతున్న మా పొలానికి సంబంధించిన పాస్‌పుస్తకాలను జారీచేయాలి. నా భార్య పేరిట ఉన్న 5.13 ఎకరాల పట్టా భూమిని మాకు ఇప్పించే ఏర్పాట్లుచేయాలి'

**- కోతులాపురం మహాలింగయ్య**



బాధితుడు కోతులాపురం మహాలింగయ్య

### 1974లో కొన్నది వాస్తవమే!

1974లో 3.12 ఎకరాల భూమిని మహాలింగయ్య కొన్నది వాస్తవమే. కాకపోతే, ఆయన ఆ పొలాన్ని రిజిస్టర్ చేసుకోలేదు. ఈమధ్యలో మహాలింగయ్యకు ఆ భూమిని విక్రయించిన విశ్వనాథం కొడుకు.. ఆ స్థలం తమ నాన్న విక్రయించలేదని, ఆ పొలానికి సంబంధించి రూ.లక్ష ఇవ్వమని పెద్ద మనుష్యుల సమావేశంలో కోరినట్టు తెలిసింది. అంత సొమ్ము తన వద్ద లేదని మహాలింగయ్య అనడంతో ఆ చర్చ అర్థాంతరంగా ముగిసిపోయింది. అదే 3.12 ఎకరాల పొలాన్ని శంకరయ్య చెక్కిళ్ల రవీందర్ అనే రియల్టర్‌కు 2012లో విక్రయించాడు. అతను రిజిస్టర్ చేసుకున్నాడు. దీంతో వివాదం మొదలైంది. ఈ సమస్యపై సమగ్ర విచారణ జరుపమని జేసీ కోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. ఇదే విషయాన్ని నివేదికలో పేర్కొన్నా.

**- శ్రీనివాస్, వీఆర్వో**

# భూమి ఒకరిది.. పహాణీలో మరొకరి పేరు

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కేశవాపూర్‌లో ఘటన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కేశవాపూర్‌లో ముత్తినేని చిలుకమ్మ ఖాతా నంబర్ 53 మీద సర్వే నంబర్ 91/ఏలో 2.20 ఎకరాల భూమి ఉన్నది. ఆమెకు భర్త ఆగంరావు మరణానంతరం ఈ భూమి సంక్రమించింది. 2005-06 వరకు పహాణీలో చిలుకమ్మ పేరు మీదుగానే భూమి హక్కులు వచ్చాయి. 2006-07 పహాణీలో పెన్సిల్‌తో చిలుకమ్మ భూమిని ఆమె మరిది కొడుకు ముత్తినేని రంగారావు పేరు మీదికి రెవెన్యూ అధికారులు మార్చారు. భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో చిలుకమ్మ తన భూమిని కూతురు పేరిట మార్చాలని దరఖాస్తు చేసుకొన్నప్పుడు అసలువిషయం బయటపడింది. తన భూమి తన ప్రమేయం లేకుండా భూమి హక్కులు మారడంపై తీవ్ర ఆందోళనచెందిన వృద్ధురాలు చిలుకమ్మ రెవెన్యూశాఖలో కిందిస్థాయి నుంచి పైస్థాయివరకు దరఖాస్తు పెట్టుకున్నారు. ఆరోగ్యం సహకరించకపోయినా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగారు. తనకు న్యాయంచేయాలని, భూ రికార్డులు మార్చాలనివేడుకొన్నారు. రెండేండ్లయినా అధికారులు మాత్రం కనికరించలేదు. పేరు ఎలా మారిందనే విషయాన్ని కూడా పరిశీలించలేదు. పహాణీలో పేరు మారడానికి ఎలాంటి రికార్డులు ఉన్నాయనే విషయాన్ని తెలుసుకోలేదు. రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ అక్కడికి వెళితే ఇక్కడికి, ఇక్కడికి వెళ్తే అక్కడికి అన్నట్టుగా తాసిల్దార్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిప్పుకొన్నారు. వీఆర్వోలు, తాసిల్దార్లు, ఆర్డీవోలు మారుతున్నారే తప్ప సమస్యను పరిష్కరించేవారే లేకుండాపోయారు. గ్రామస్థులందరికీ భూమి ఎవరిదనేది స్పష్టంగా తెలుసు. చివరకు తన భూమి కూతురుకు చెందకముందే.. చిలుకమ్మ తుదిశ్వాస విడిచారు. చిలుకమ్మకు ఒక్కతే కూతురు.. ఆమెకు వారసత్వంగా బిడ్డకు చెందాల్సిన భూమిని రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి దక్కకుండాచేశారు. రంగారావు పేరును ఏ ఆధారాలతో నమోదుచేశారో చెప్పాలని సమాచారహక్కు చట్టం ద్వారా అడిగినా కూడా సమాచారం ఇవ్వలేదు. తమ వినతిని కూడా పరిగణనలోకి తీసుకోవడంలేదని, విచారణచేసి నిజానిజాలు తెల్చి తమకు న్యాయం చేయాలని చిలుకమ్మ కూతురు పేరాల చిట్టమ్మ వేడుకుంటున్నారు.

# పాసం పోతున్నా కనికరించలేదు

ఇరవై ఏండ్లుగా పట్టాకాని సాదాబైనామా • నిన్నమొన్నటిదాకా భర్త.. నేడు భార్య

అధికారుల చుట్టూ తిరిగినా తీరని వెతలు • మహబూబ్‌నగర్ జిల్లాలో రెవెన్యూ నిర్లక్ష్యం

తన భూమిని తన పేరిట మార్పిడి చేయించుకోలేని రైతు.. రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి చివరకు మట్టిలో కలిసిపోయాడు. సొంత అన్న డబ్బులు అవసరమై.. భూమిని ఇతరులకు అమ్ముతుంటే.. మనభూమిని ఇతరులకు ఎందుకు పోనియ్యాలని గ్రామపెద్దల సమక్షంలో సాదా కాగితంపై రాయించుకొని కొన్న రైతు.. ఆ భూమిని తన పేరుమీదకు మార్చుకోవడానికి అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయాడు. చివరకు తన భూ సమస్య పరిష్కారం కాకముందే.. మరణించాడు. ఇప్పుడు ఆయన భార్య భూమిపై తన హక్కు కోసం పోరాడుతున్నది.

**మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి:** మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం జానంపేటకు చెందిన జన్ను ఈశ్వరయ్య, సాయిలు.. అన్నదమ్ములు. ఈశ్వరయ్య మూసాపేట మండలంలోని నందిపేటలో ఉండేవాడు. సాయిలు జానంపేటలో తనకున్న భూమిలో 22వ సర్వే నంబర్‌లోనుంచి ఎకరా 98 సెంట్లు, 665 సర్వే నంబర్‌లోనుంచి ఎకరా 93 సెంట్లు.. మొత్తం 3 ఎకరాల 91 సెంట్లను తన తమ్ముడు ఈశ్వరయ్యకు ఎకరాకు రూ.6 వేల చొప్పున గ్రామ పెద్దల సమక్షంలో ఒప్పందం కుదుర్చుకొని అమ్మాడు. అందుకు సంబంధించి 27-07-1998 తేదీన రూ.15 వేలు ఇచ్చి ఒప్పంద పత్రం రాయించుకొన్నాడు. ఆ తర్వాత 18-01-1999తేదీన ఆ భూమికి సంబంధించిన మిగతా డబ్బులను జన్ను సాయిలుకు ఇచ్చి రూ.50 విలువ గల బాండ్ పేపర్‌పై 'మొత్తం డబ్బులు ముట్టినవి, భూమిని నీ పేరుపై ఎప్పుడు రిజిస్ట్రేషన్ చేయమని అడిగితే అప్పుడు వచ్చి రిజిస్ట్రేషన్ చేస్తా' అని రాసి సాయిలు సంతకంచేశారు. రిటైర్డ్ ఎమ్మార్వో జన్ను నర్సింహులు సాక్షి సంతకం కూడాచేశారు. కొన్నాళ్ల తర్వాత రిజిస్ట్రేషన్ చేయమని అన్నను ఈశ్వరయ్య అడుగగా నేను చేయననడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆ కాగితాలను తీసుకొని రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి తన పేరిట భూమి మార్పిడి చేయాలని ఈశ్వరయ్య అధికారులను కోరాడు. దరఖాస్తు చేశాడు. కానీ అధికారులు సాదాబైనామాను పట్టించుకోలేదు. చివరకు కలత చెంది 19-02-2009న ఈశ్వరయ్య మృతి చెందాడు. ఈశ్వరయ్య కుమారుడు చిన్న పిల్లవాడు కావడంతో ఆయన భార్య యశోద 2016 వరకు ఇంటిపట్టునే ఉండి కొడుకును చదివించుకొంటూ ఉండిపోయింది. 2016లో తన భూమికి సంబంధించిన పత్రాలను తీసుకొని రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి భూ మార్పిడి చేయాలని అధికారులను వేడుకొన్నప్పటికీ.. పని జరుగలేదు. ఉమ్మడి అడ్డాకుల మండలంలోని తాసిల్ కార్యాలయంతోపాటు, ప్రస్తుత మూసాపేట ఎమ్మార్వో కార్యాలయంలోనూ దరఖాస్తు చేసుకొన్నారు. మండలం ఏర్పాటయిన తర్వాత ముగ్గురు తాసిల్దార్లు మారినా పని జరుగలేదు. పరిశీలిస్తామని చెప్తారే తప్ప ఆ పరిశీలన ఎప్పుడు చేస్తారు? సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారన్నది తేల్చరు. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో ఆ భూమికి తాము అర్హులమని.. ఇతరులెవరి పేరునూ ఆన్‌లైన్‌లో నమోదు చేయకూడదని తాసిల్దార్‌కు దరఖాస్తుచేసుకోవడంతో ఆ సర్వే నంబర్లను ఆన్‌లైన్ చేయకుండా నిలిపివేశారు. ఆ తాసిల్దార్ బదిలీ కావడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. సాయిలుకే పాస్‌పుస్తకాలు వస్తున్నాయని అధికారులు చెప్పడంతో యశోద మళ్లీ తాసిల్ కార్యాలయానికి వెళ్లి తాసిల్దార్ పుష్పలతకు వినతిపత్రం ఇచ్చారు. ఇరవై ఏండ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నప్పటికీ, కనికరించడంలేదని యశోద ఆవేదన వ్యక్తంచేశారు.



బాధితురాలు జన్ను యశోద

### కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా..

సాదాబైనామా నుంచి పట్టా మార్పిడి గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా. కలెక్టర్‌కు రెఫర్ చేసిన లెటర్‌ను మీకు కూడా పోస్ట్‌చేస్తా. కలెక్టర్ ఎలా చెప్తే అలా నడుచుకుంటా. మండలంలో ఐదారుగురు సాదాబైనామా నుంచి పట్టా మార్పిడిచేయాలని అడుగుతున్నారు. అందరి సమస్యలను త్వరలో పరిష్కరిస్తా.

**- పుష్పలత, మూసాపేట తాసిల్దార్**

# పాస్‌బుక్‌లు ఇప్పించండి

జనగామ జిల్లా లక్ష్మక్కపల్లివాసి రజిని వేదన

**జనగామ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** జనగామ జిల్లా కొడకొండ్ల మండలం లక్ష్మక్కపల్లికి చెందిన పుసుకూరి రజిని భర్త నరేందర్‌రావు తొమ్మిదేళ్ల కిందట చనిపోయారు.. ఆమె భర్త పేరిట సర్వే నంబర్ 357, 359, 360, 350, 483, 355లో ఎనిమిదెకరాల భూమి ఉన్నది. భర్త చనిపోయిననాటి నుంచి రజిని కాస్తులో ఉండి పిల్లలను పోషించుకొంటున్నది. కాలంకలిసి రాకపోవడంతో కొంత కాలం కిందట రజిని బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సివచ్చింది. ఇదే అదునుగా భావించిన లక్ష్మి భర్త సోదరుడు రాంచందర్‌రావు దొంగ సంతకాలతో నకిలీ పత్రాలు సృష్టించి ఆ భూమిని ఇతరులకు విక్రయించాడు. విషయం తెలుసుకొన్న రజిని పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించినా పరిష్కారంకాలేదు. తాసిల్దార్‌ను పలుమార్లు కలిసిన బాధితురాలు రికార్డులను పరిశీలించి న్యాయపరంగా తనకు చెందిన ఎనిమిదెకరాల భూమికి పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీచేయాలని వేడుకొన్నది. సుమారు ఏడాదికాలంగా తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించకపోవడంతో బాధితురాలు రజిని 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

### ఏడాదిగా తిరుగుతున్న



నా భర్త చనిపోయి తొమ్మిదేండ్లయింది. ఆయన పేరిట 8 ఎకరాల భూమి ఉన్నది. మా భూమిని ఎవరికీ అమ్మలేదు. కొంతకాలం కిందట బతుకుదెరువు కోసం నేను హైదరాబాద్‌కు వెళ్లిన సమయంలో నా బావ పుసుకూరి రాంచందర్‌రావు మా భూమిని వేరేవారికి విక్రయించాడు. ఈ విషయం తెలుసుకున్న నేను తాసిల్దార్‌ను కలిసి నా భూమిని ఎవరికీ అమ్మలేదని, ఇతరులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వొద్దని దరఖాస్తు చేశా. భూ రికార్డుల ప్రక్షాళన సందర్భంగా మాకు కొత్త పాస్‌పుస్తకం ఇవ్వాలని అడిగినా అధికారులు పట్టించుకోవడం లేదు.

**- పుసుకూరి రజిని**

## 19న 'జైనీ' సాహితీ అవార్డుల ప్రదానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలుగు సాహిత్యరంగంలో విశేష కృషి చేసిన రచయితలకు ఈ నెల 19న సాయంత్రం ఆరుగంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ పురస్కారాలు అందజేయనున్నట్టు డాక్టర్ ప్రభాకర్ జైనీ ప్రకటించారు. 12 మందికి శ్రీమతి శకుంతలా జైనీ స్మారక కళా అవార్డులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్యా నవీన్‌కు జైనీ ఇంటర్నేషనల్ జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేస్తారు. కేంద్ర సమాచార హక్కు మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ఈ కార్యక్రమంలో ప్రభాకర్ జైనీ రాసిన నిఘా నవల, మీల్స్ టికెట్ కథా సంపుటిని ఆవిష్కరిస్తారు. సీనియర్ కథా రచయిత వీ రాజారామ్మోహన్‌రావు, అనువాద కవయిత్రి స్వాతి శ్రీపాద, నవలా రచయిత, 'నమస్తే తెలంగాణ' ఫీచర్స్ ఎడిటర్ నగేశ్ బీరెడ్డి, సాహిత్య విమర్శకులు వెంకట్ గుడిపాటి, కథా రచయిత డాక్టర్ పసునూరి రవీందర్, కవి అన్వర్, నవలా రచయిత శ్రీరామకవచం సాగర్, కవయిత్రి డాక్టర్ విజయలక్ష్మీ పండిట్, బాల సాహిత్య రచయిత డాక్టర్ పత్తిపాక మోహన్, నాటక రచయిత పెద్దింటి అశోక్‌కుమార్, కళ పత్రిక సంపాదకుడు డాక్టర్ మహ్మద్ రఫీ, ప్రవాస యువకవి చరణ్ జానీ బాషా.. శకుంతలా జైనీ స్మారక కళా అవార్డులు అందుకోనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



గురువారం హైదరాబాద్‌లోని అగ్రి యూనివర్సిటీలో ఒప్పంద పత్రాలను చూపుతున్న విశ్వవిద్యాలయ అధికారులు, కార్నెల్ సద్గురు ఫౌండేషన్ ప్రతినిధులు. చిత్రంలో వర్సిటీ ఉపకులపతి ప్రవీణ్‌రావు

## కార్నెల్ సద్గురు ఫౌండేషన్‌తో అగ్రి వర్సిటీ ఒప్పందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విస్తరణ, విద్య, పరిశోధన అంశాల్లో కార్నెల్ సద్గురు ఫౌండేషన్‌తో కలిసి వ్యవసాయ సంక్షేమానికి కృషిచేయాలని నిర్ణయించుకున్నట్టు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు తెలిపారు. కార్నెల్ సద్గురు ఫౌండేషన్ ప్రతినిధులు విజయరాఘవన్, హేమలత, రాజేశ్వరి గురువారం మధ్యాహ్నం విశ్వవిద్యాలయం పరిపాలనాభవనంలో ఉపకులపతి ప్రవీణ్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్‌కుమార్, విశ్వవిద్యాలయ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో నైపుణ్యాభివృద్ధి, ప్రమాణాల పెంపునకు అవకాశం కలుగుతుందని ప్రవీణ్‌రావు తెలిపారు.

## 18 వరకు ఆర్మీసిబ్బంది ఎంపిక ప్రక్రియ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏవోసీ (ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్) సికింద్రాబాద్ హెడ్‌క్వార్టర్‌లో కోటా కింద సైనికుల నియామకానికి గురువారం ప్రారంభమైన ప్రక్రియ ఈ నెల 18 వరకు కొనసాగనుంది. టెక్నికల్, సాధారణ సైనికులు, క్రీడాకోటా సైనికుల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నట్టు ఆర్మీ ఉన్నతాధికారులు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సికింద్రాబాద్‌లోని ఈస్ట్‌మారేడుపల్లి ఏవోసీ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. క్రీడాకోటా కోసం బాస్కెట్‌బాల్, పుట్‌బాల్, వాలీబాల్, హాకీ, కబడ్డీ, స్విమ్మింగ్, రెస్లింగ్‌లో ప్రతిభ ఉన్న కీడ్రాకారులు ధ్రువపత్రాలతో హాజరుకావాలని తెలిపారు.

## ఖాళీ అవుతున్న హెర్మిటేజ్ కాంప్లెక్స్

- ఏపీ ప్రభుత్వానికి అప్పగించేందుకు చకచకా ఏర్పాట్లు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ ఆదర్శ్‌నగర్‌లో ఉన్న హెర్మిటేజ్ ఆఫీస్ కాంప్లెక్స్ ఖాళీ అవుతున్నది. రాష్ట్రంలో ఉన్న ఏపీ భవనాలు తెలంగాణ ప్రభుత్వ ఆధీనంలోకి రావడం, బదలాయింపుగా హెచ్‌ఎండీఏ ఆధీనంలోని హెర్మిటేజ్ కాంప్లెక్స్‌ను ఏపీ ప్రభుత్వానికి కేటాయించిన సంగతి తెలిసిందే. హెర్మిటేజ్ కాంప్లెక్స్‌లోని ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేట్ ఏజెన్సీలు ఒక్కొక్కటిగా ఖాళీ చేస్తున్నారు. హెచ్‌ఎండీఏకు చెందిన అమీర్‌పేటలోని స్వర్ణజయంతి కాంప్లెక్స్‌కు తమ కార్యాలయాలను తరలిస్తున్నారు. గురువారం హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ విభాగాన్ని తార్నాకలోని సంస్థ ప్రధాన కార్యాలయానికి తరలించారు. కాంప్లెక్స్‌లో 40 శాతం మేర ఖాళీ ఉండగా, లీజు ప్రాతిపదికన కొనసాగిన సెర్ప్, తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ వంటి సంస్థలు స్వర్ణజయంతి కాంప్లెక్స్‌కు తరలే ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. 32 గుంటల విస్తీర్ణంలోని ఈ కాంప్లెక్స్ ఇకనుంచి ఏపీ ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లనున్నది.

## రేపు ఉద్యోగ సంఘాల జేఏసీ సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ సమావేశం టీఎన్జీవోభవన్‌లో శనివారం (ఈ నెల 15న) ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ వీ మమత తెలిపారు. సమావేశంలో ఉద్యోగులకు సంబంధించిన పలుఅంశాలపై చర్చిస్తామని గురువారం ఒక ప్రకటనలో చెప్పారు.





గురువారం ప్రగతిభవన్‌లో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్‌కు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న సీఎం కేసీఆర్

# పార్లమెంటరీ నేత కేకే

మొదటిపేజీ తరువాయి...

రాష్ట్రాల పట్ల మరోతీరుగా వ్యవహరిస్తున్నాయని సీఎం అన్నారు.

**సీఎంకు ఎంపీ బండా ప్రకాశ్ కృతజ్ఞతలు**

టీఆర్‌ఎస్ రాజ్యసభాపక్ష ఉపనేతగా తనను నియమించిన సీఎం కేసీఆర్‌కు ఎంపీ బండా ప్రకాశ్ కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. అధ్యక్షుడి ఆదేశాలకు అనుగుణంగా సభలో టీఆర్‌ఎస్ పక్షాన రాష్ట్ర సమస్యలను వినిపిస్తానని తెలిపారు.

**బడుగులకు జన్మదిన శుభాకాంక్షలు**

రాజ్యసభసభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ జన్మదినం సందర్భంగా గురువారం ప్రగతిభవన్‌లో ఆయనకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లింగయ్యయాదవ్‌కు శాలువా కప్పి అభినందించారు.

# ఉద్యోగ కల్పనలోనూ సింగరేణి టాప్

- ఐదేండ్లలో 10,446 కొత్త ఉద్యోగాలు
- డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా 3,025 మందికి, 7,421 మంది డిపెండెంట్లకు ఉద్యోగాలు
- ఉమ్మడి రాష్ట్రంతో పోలిస్తే శరవేగంగా నియామకాలు
- రాత పరీక్ష రోజే ఫలితాలపై హర్షం
- సీఎం కేసీఆర్ ఆదేశాలతో ప్రక్రియ ముమ్మరం
- సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ వెల్లడి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్ సర్కారు పాలనలో సింగరేణి సంస్థ ఉద్యోగుల గనిగా మారింది. నిరుద్యోగులపాలిట వరమైంది. ఏండ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత భవితకు బంగారు బాటలు వేసింది. శరవేగంగా నియామకాలు చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఐదేండ్లలోనే 10,446 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి, అమ్మకాలు, లాభాల్లో అద్భుత ప్రగతిని సాధించడంతో పాటు కొత్త ఉద్యోగాల కల్పనలోనూ అగ్రగామిగా నిలిచిందని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ తెలిపారు. దశాబ్దాలుగా కొత్త ఉద్యోగ నియామకాలు లేని నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఆదేశం మేరకు సింగరేణి భారీఎత్తున ఉద్యోగాలు కల్పించిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు సింగరేణిలో 10,446 మందికి ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. వీటిలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా 3,025 మందికి, డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్ కింద 7,421 మందికి ఉద్యోగాలిచ్చామని తెలిపారు. మైనింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, పర్సనల్, అకౌంట్స్ తదితర విభాగాల్లో ఖాళీలను గుర్తించి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా 3,025 మంది అధికారులు, కార్మికులను నియమించినట్టు చెప్పారు. అర్హులకే ఉద్యోగం దక్కాలన్న ఉద్దేశంతో రాత పరీక్ష ద్వారానే నియామక ప్రక్రియ జరిపామని ఆయన వివరించారు. పరీక్షలు రాసిన రోజు సాయంత్రమే ఫలితాలు ప్రకటించడంపై నిరుద్యోగులు హర్షం వ్యక్తంచేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఉద్యోగావకాశాలు కల్పించిన తొలి సంస్థగా సింగరేణి పేరు నిలిచిపోయిందని చెప్పారు.

**నాడు నెలకు 30.. ప్రత్యేక రాష్ట్రంలో 200 నియామకాలు**

వివిధ కారణాలతో చనిపోయిన, అన్‌ఫిట్ అయిన కార్మికుల స్థానంలో డిపెండెంట్ ఉద్యోగాల కోసం ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న 7,421 మంది వారసులకు ఉద్యోగాలను కల్పించామని సీఎండీ శ్రీధర్ తెలిపారు. తెలంగాణ ఏర్పాటుకుముందు నెలకు 20 నుంచి 30 మందికి మాత్రమే డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించేవారని, ఆ తర్వాత నెలకు 150 నుంచి 200 మంది డిపెండెంట్లకుపైగా ఉద్యోగాలు కల్పిస్తూ పెండింగ్ జాబితా పూర్తిగా క్లియర్ చేశామని శ్రీధర్ పేర్కొన్నారు. 2014లో 674 మందికి, 2015లో 1,989 మందికి, 2018లో 1,663 మందికి, 2019లో మే నెల వరకు 1,378 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్టు వివరించారు. ఇదివరకు డిపెండెంట్ ఉద్యోగాల కోసం పడిగాపులు పడ్డామని, ఇప్పుడు వెంటనే ఉద్యోగాలివ్వడం ఎంతో సంతోషకరమని నిరుద్యోగులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నట్టు ఆయన తెలిపారు. అనారోగ్య కారణాలతో ఉద్యోగం చేయలేని కార్మికుల స్థానంలో వారు సూచించిన వారసులకు ఉద్యోగం కల్పిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో కారుణ్య నియామక ప్రక్రియ 2018 ఏప్రిల్ నుంచి ముమ్మరంగా సాగుతున్నదని స్పష్టంచేశారు. సీఎం కేసీఆర్ సూచన మేరకు నిమ్స్, గాంధీ దవాఖానల్లోని ప్రభుత్వ వైద్య నిపుణులతో కూడిన మెడికల్ బోర్డును ఏర్పాటుచేశామని చెప్పారు. కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్నవారిని పరీక్షించి అన్‌ఫిట్ అయిన కార్మికుల స్థానంలో వారు సూచించిన వారసులకు ఉద్యోగాలు కల్పించే ప్రక్రియను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి మెడికల్ బోర్డు ద్వారా 38 శిబిరాలు నిర్వహించి 4,728 మంది కార్మికులకు కారుణ్య నియామక ప్రక్రియలో ఉద్యోగం కల్పించామని పేర్కొన్నారు. మొత్తంగా 10,446 మంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొందగలిగినందుకు ఆనందం వ్యక్తంచేశారు. పెద్దసంఖ్యలో యువకుల చేరికతో సింగరేణి మరింత ఉత్సాహంతో వృద్ధిని సాధించే అవకాశం ఏర్పడిందని శ్రీధర్ తెలిపారు.

**ఏప్రిల్-మేలో 18.4 శాతం అధిక బొగ్గు ఉత్పత్తి**

ఏప్రిల్-మే నెలలో సింగరేణి సంస్థ 11.37 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిందని ఆ సంస్థ అధికారులు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 18.4 శాతం అధికమని పేర్కొన్నారు. ఈ ఏప్రిల్‌లో సింగరేణి సంస్థ 5.5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా, ఇది గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే 21.9 శాతం అధికమని తెలిపారు. 2019 మేలో 5.87 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా, ఇది గతేడాది మే నెలతో పోలిస్తే 15.3 శాతం అధికమని పేర్కొన్నారు.

## 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ మహాసభ

- సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి



ఓయూ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తదితరులు

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఎమ్మార్పీఎస్ స్థాపించి 25 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా వచ్చేనెల 7న మధ్యాహ్నం ఇందిరా పార్క్ వద్ద ఆవిర్భావ దినోత్సవ మహాసభను నిర్వహించనున్నట్టు ఎమ్మార్పీఎస్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. మాదిగ ప్రజలు లక్షల మంది తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం ఉస్మానియా యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో సభ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్యతో కలిసి వంగపల్లి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ.. మాదిగ దండోరా ఆవిర్భావానికి ముందు నిరాశ, నిస్పృహలతో ఉన్న మాదిగ పల్లెలు నూతన చైతన్యం నింపుకొని ఆత్మగౌరవ పతాకాన్ని ఎగురవేశాయని చెప్పారు. సభకు ముఖ్యఅతిథిగా టీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను ఆహ్వానించామని, ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు జన్ను కనకరాజు, దండు సురేందర్, భూమన్న, సాంబయ్య, గుర్రాల శ్రీను, చింతబాబు, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకట్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కొంగరి శంకర్, నాయకులు చందు, గోవర్ధన్, శ్రీకాంత్, తిరుమలేశ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధిపత్య పోరులో భాగంగానే భట్టి దీక్ష

- కాంగ్రెస్ నాయకులవి దొంగదీక్షలు
- ఉద్యమపార్టీని లేకుండా చేయాలని చూశారు
- టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్, రాష్ట్ర కార్యదర్శి గట్టు విమర్శలు



తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాల్క సుమన్. చిత్రంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు, టీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాంగ్రెస్ పార్టీ ఆధిపత్య పోరులో భాగంగానే సీఎల్పీనేత భట్టి విక్రమార్క దీక్ష అని టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తాము రాజ్యాంగం ప్రకారమే టీఆర్‌ఎస్‌లో విలీనమయ్యామని ఎమ్మెల్యేలు చెప్తుంటే కాంగ్రెస్ నాయకులు దొంగ దీక్షలకు దిగుతున్నారని ఆరోపించారు. తెలంగాణభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్రప్రభుత్వాలను రద్దుచేసిన చరిత్ర కాంగ్రెస్‌ది అని.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమాన్ని అణిచివేసి, తప్పుడు కేసులు బనాయించి టీఆర్‌ఎస్‌ను లేకుండా దుష్టపన్నాగం పన్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దౌర్జన్యంగా వ్యవహరించి, దమనకాండను ప్రదర్శించిందని, దీక్షలకు, ధర్నాలకు అనుమతి ఇవ్వలేదన్నారు. మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీ గత చరిత్రను గుర్తు చేసుకోవాలన్నారు. పరిషత్ ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. భ్రమలు వీడి వాస్తవాల్లోకి రావాలని సూచించారు. గట్టు రాంచందర్‌రావు మాట్లాడుతూ భట్టి విక్రమార్క చేసింది పదవీ పరిరక్షణ దీక్షగా అభివర్ణించారు. ఉన్న పదవి పోతుందనే దీక్షకు దిగినట్టుగా కన్పిస్తున్నదన్నారు. ఫిరాయింపులకు బ్రాండ్ అంబాసిడర్ అయి న రేవంత్‌రెడ్డి దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడటం విచిత్రంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేలను రాజీనామా చేయడమనడం కాదని, భట్టి విక్రమార్క రాజీనామా చేసి గెలవాలని సవాల్ విసిరారు. పరిషత్ ఎన్నికల్లో మధిర నియోజకవర్గం నుంచి టీఆర్‌ఎస్ ఐదు జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకుంటే.. కాంగ్రెస్ ఒక్కచోట మాత్రమే గెలిచిందని చెప్పారు. దళితుల మీద కాంగ్రెస్ నాయకులకు అంత ప్రేమఉంటే భట్టిని పీసీసీ అధ్యక్షుడిగా పెట్టుకోవాలని సూచించారు. కాంగ్రెస్ నుంచి వెళ్లింది ఒకరిద్దరు కాదని 12 మంది ఎమ్మెల్యేలని.. ఉన్న ఐదారుగురినైనా కాపాడుకోవాలని హితవుపలికారు. ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణకు తరతరాలుగా ద్రోహం చేసిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు. 1971లో తెలంగాణ ప్రజాసమితిని విలీనం చేసుకున్నారని, 2004లో టీఆర్‌ఎస్ నుంచి గెలిచినవారిని పార్టీలో చేర్చుకున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ తీరు చూస్తుంటే దొంగే దొంగ దొంగ అన్నట్టుగా ఉన్నదని ఆయన ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో టీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

## మాదిగ అమరవీరుల సంస్మరణ సభ 5న

- మాదిగలు పెద్దఎత్తున తరలిరావాలి: పిడమర్తి రవి



ఓయూలో మీడియాతో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి

**ఉస్మానియా యూనివర్సిటీ:** మాదిగ దండోరా ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులను స్మరించుకుంటూ వచ్చేనెల 5న ఇందిరా పార్క్ వద్ద సంస్మరణ సభను నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. సభకు లక్షల మంది తెలుగు రాష్ట్రాల మాదిగలు తరలిరావాలని కోరారు. ఈ ఇరవై ఐదేండ్ల మందకృష్ణ మాదిగ ఉద్యమంలో జరిగిన నష్టాన్ని రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి మాదిగ సమాజానికి వివరిస్తూ ప్రచారం చేస్తామని చెప్పారు. ఓయూ గెస్ట్‌హౌస్‌లో గురువారం ఆయన ఎమ్మార్పీఎస్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇటుక రాజు తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అనేక మంది అమరులయ్యారని, వారు కోరుకున్న వర్గీకరణ సాధించకుండా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు చేయడం అమరులను అవమానించడమేనని విమర్శించారు. వర్గీకరణ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తున్నా బీజేపీని ఎందుకు ప్రశ్నించడం లేదో సమాధానం చెప్పాలని పిడమర్తి డిమాండ్ చేశారు. ఏపీలోని ప్రకాశం జిల్లా ఈదుమూడులో నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా వస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వర్గీకరణపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు మైస ఉపేందర్, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు దండు వీరయ్య, వెంకటేశ్వర్లు, వినాయకరావు, మాదిగ విద్యార్థి జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగళ్ల సుందర్, వివిధ సంఘాల నాయకులు దితరులు పాల్గొన్నారు.

# 119 బీసీ గురుకులాలు ప్రారంభానికి సర్వం సిద్ధం

- 17న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- వివిధవర్గాల నుంచి సర్వత్రా హర్షం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యకు అధికప్రాధాన్యం ఇస్తున్నారు. 2016-17 విద్యాసంవత్సరంలో మాదిరిగానే ఈ ఏడాది ఏకమొత్తంలో పెద్దసంఖ్యలో బీసీ గురుకుల విద్యాలయాలను ప్రారంభించాలని ఆదేశించారు. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున రాష్ట్రంలో 119 మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాలయాలను ఈ నెల 17న ప్రారంభించేందుకు అధికారులు సర్వంసిద్ధంచేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావంనాటికి రాష్ట్రంలో 19 బీసీ గురుకులాలు మాత్రమే ఉండగా.. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకులాల సంఖ్య 261కి చేరింది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో 91,680 మంది విద్యార్థులు చదువుతుండగా, 5,335 మంది ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. కొత్తగా ఒకేసారి 119 బీసీ గురుకులాలను ప్రారంభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

### కేసీఆర్ వల్లే సాధ్యం..



ఏకకాలంలో 119 బీసీ గురుకులాలను ప్రారంభించి దేశవ్యాప్తంగా తెలంగాణ ప్రభుత్వం తన ప్రత్యేకతను చాటుకోనుంది. ఇటువంటి సంచలనాత్మక నిర్ణయాలు తీసుకోవడం, వాటిని విజయవంతంగా అమలుచేయడం సీఎం కేసీఆర్‌వల్లే సాధ్యం. కొత్త గురుకులాల ఏర్పాటును బలహీనవర్గాల వారు హర్షిస్తున్నారు.

– గెల్లు శ్రీనివాస్, టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు

### 119 గురుకులాల ఏర్పాటు హర్షణీయం



కేజీ నుంచి పీజీ విద్యావిధానం అమలులో భాగంగా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 119 బీసీ గురుకులాలు ఏర్పాటు చేయడం గొప్ప విషయం. రాజుల కాలంలో గురుకులాల్లో కొందరికే విద్య పరిమితమై ఉండేది. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలకు చెందిన చిన్నారులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చారు.

– కొండూరు సత్యనారాయణ, తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కో కన్వీనర్

### భావితరాలకు బంగారు బాటలు



రాష్ట్రంలో కేసీఆర్ సర్కారు గురుకులాల ద్వారా భావితరాలకు బంగారు బాటలు వేస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి 19 మాత్రమే ఉన్న బీసీ గురుకులాల సంఖ్య ఇప్పుడు 280కి చేరింది. ప్రతి నియోజకవర్గంలో బీసీ గురుకుల విద్యాలయాలను ఏర్పాటు చేయాలన్న నిర్ణయం దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయలేదు.

– కిశోర్‌గౌడ్, టీఆర్‌ఎస్వీ నేత



గౌతం విజయవర్గీ

## నైపర్ జేఈఈ టాపర్ తెలంగాణ విద్యార్థి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఫార్మసీ కాలేజీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నిర్వహించిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ (నైపర్ జేఈఈ)-2019 ఫలితాల్లో తెలంగాణ విద్యార్థి గౌతం విజయవర్గీ ఆలిండియా టాపర్‌గా నిలిచాడు. నైపర్ జేఈఈని ఈనెల 9న ఆన్‌లైన్‌లో నిర్వహించగా, గురువారం ఫలితాలు విడుదలయ్యాయి. గౌతం విజయవర్గీ రాష్ట్రంలోని సెయింట్‌పాల్ కాలేజీ ఫర్ ఫార్మసీలో బీఫార్మసీ ఫైనలియర్ చదువుతున్నట్టు ఆ కాలేజీ చైర్మన్ కే సుధీర్ తెలిపారు. నైపర్ జేఈఈలో దేశవ్యాప్తంగా 2,184 మందికి ర్యాంకులు ప్రకటించారు. ఫలితాలు, పూర్తి వివరాలు www.niper.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.



చేవెళ్ల ఎంపీగా గెలిచిన డాక్టర్ రంజిత్‌రెడ్డిని గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, ప్రతినిధులు లక్ష్మణ్, ఎస్‌ఎం ముజీబ్‌హుస్సేన్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్, కొండల్‌రెడ్డి తదితరులు

- హైదరాబాద్, నమస్తే తెలంగాణ

## ఇంటర్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంటర్మీడియట్, 10+2లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వడానికి టెక్ బీ-హెచ్‌సీఎల్ వారు సంయుక్తంగా ముందుకు వచ్చారు. ఉద్యోగాల్లో స్థిరపడేలా నైపుణ్యాలపై శిక్షణ కోసం విద్యార్థులనుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు హెచ్‌సీఎల్ వైస్‌ప్రెసిడెంట్ శ్రీమతి శివశంకర్ తెలిపారు. ఎంపికైనవారికి నైపుణ్యాలపై ఏడాది శిక్షణ ఇస్తామని, మొదటి నెలనుంచి రూ.10 వేల చొప్పున స్కాలర్‌షిప్ ఇస్తామని, ఇక్కడ శిక్షణ పొందుతూ ఉన్నత విద్య చదువుకోవడానికి బిట్స్ పిలాని, శాస్త్ర వర్సిటీ వంటివి అందుబాటులో ఉన్నాయన్నారు. దరఖాస్తులను https://www.hcitechbees.com/enroll-form/ లింకు ద్వారా చేసుకోవచ్చన్నారు.

## స్త్రీనిధిని సెర్ప్‌లో విలీనం చేయండి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్త్రీనిధిని సెర్ప్‌లో విలీనం చేయాలని సెర్ప్ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర జేఏసీ సమావేశంలో 33 జిల్లాల నుంచి ఏకాభిప్రాయం వచ్చిందని, టీఆర్‌ఎస్‌కేవీ ఆధ్వర్యలో సెర్ప్ జేఏసీ ప్రతినిధులు గురువారం హైదరాబాద్‌లో ఎర్రబెల్లిని కలిసి విన్నవించారు. సెర్ప్ జేఏసీ ప్రతినిధులు నర్సయ్య, గంగాధర్‌రెడ్డి, సుభాష్‌గౌడ్, జాన య్య, దుర్గాకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ఉభయసభల్లో గవర్నర్ ప్రసంగం నేడు

**అమరావతి:** ఏపీ శాసనభలో తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ శుక్రవారం ప్రసంగించనున్నారు. విజయవాడలోని గేట్‌వే హోటల్‌లో గవర్నర్‌ను గురువారం మధ్యాహ్నం సీఎం జగన్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గవర్నర్ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు.

## త్వరలో ఏపీలో 25 జిల్లాలు!

**విజయవాడ:** ఏపీలో ప్రస్తుతమున్న 13 జిల్లాలు.. త్వరలో 25 జిల్లాలు కాబోతున్నాయని వైఎస్సార్సీపీ రాజ్యసభ ఎంపీ వీ విజయసాయిరెడ్డి చెప్పారు. గురువారం వైఎస్సార్సీపీ విస్తృతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలో హైదరాబాద్ నుంచి తాడేపల్లికి వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయాన్ని తరలిస్తామని తెలిపారు.

## ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి ద్వివేది బదిలీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం ప్రధాన అధికారి గోపాల కృష్ణ ద్వివేది బదిలీఅయ్యారు. ఆయన స్థానంలో కే విజయానంద్ నూతన సీఈవోగా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. విజయానంద్ ప్రస్తుతం ఏపీ జెన్‌కో సీఎండీగా ఉన్నారు.



'ట్రిపుల్ తలాక్' బిల్లును పార్లమెంటులో మేం వ్యతిరేకిస్తాం.
బిల్లుకు మేం సూచించిన అనేక సవరణలను కేంద్ర ప్రభుత్వం ఒప్పుకున్నది.
ఇంకా ఒకట్రెండు అంశాల్లో చర్చ జరుగాల్సిన అవసరం ఉన్నది.
కాబట్టి ఆదరబాదరాగా బిల్లు తెస్తే మేం తీవ్రంగా ప్రతిఘటిస్తాం.

**అభిషేక్ సింఘ్వీ, కాంగ్రెస్ అధికార ప్రతినిధి**

బెంగాల్ గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠి బీజేపీ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు.
రాష్ట్రంలో శాంతిభద్రతల బాధ్యత ప్రభుత్వానిది, గవర్నర్ పని కాదు.
ఆయన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించటం సరికాదు. ప్రజల
శాంతిభద్రతల కోసం ప్రభుత్వం కట్టుబడి ఉన్నది.

**మమతా బెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



**1777**

నక్షత్రాలు, చారలతో కూడిన అమెరికా జెండాను రూపొందించిన ఫ్రాన్సిస్ హాప్కిన్సన్.

**1847**

'బున్‌సెన్ బర్నర్'ను కనుగొన్న రాబర్ట్ బున్‌సెన్ బర్నర్.





**1913**

వలస నియంత్రణ చట్టాన్ని తెచ్చిన దక్షిణాఫ్రికా. ఆసియన్లు భారతీయుల కదలికలపై నియంత్రణ. గాంధీ నేతృత్వంలో నిరసనోద్యమం.

థాయిలాండ్‌లో ఐదేండ్ల కిందట సైనిక తిరుగుబాటు జరిపిన ప్రయూత్ చన్ ఊచా తాను హామీ ఇచ్చిన ప్రకారం ఎన్నికలు జరిపించాడు. కానీ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరుగలేదు. ప్రయూత్ ప్రధాని అయ్యాడు. అయితే చట్టసభలో ఉన్న భిన్నత్వం వల్ల ప్రయూత్ అందరిని మెప్పిస్తూ పాలించవలసి ఉంటుంది. ప్రయూత్ విదేశాంగ విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలె. థాయిలాండ్ ఆగ్నేయాసియా దేశాల కూటమికి నేతృత్వం వహించబోతున్నందు వల్ల మరింత ప్రాధాన్యం అవసరం. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని థాయిలాండ్ పునర్నిర్మాణానికి ఉపయోగించుకోవాలె.

**సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్**

ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాడ్ ప్రభుత్వం ఎట్టకేలకు వివాదాస్పదమైన అదానీ బొగ్గు గనికి అనుమతి ఇచ్చింది. ఇంతకాలం పర్యావరణవాదులు 'స్టాప్ అదాని' ఉద్యమాన్ని నిర్వహించారు. భారత్ వంటి దేశాలకు బొగ్గు ఎగుమతి అయితే భూగోళం వేడెక్కడానికి దోహదపడుతుందనేది పర్యావరణవాదుల ఆందోళన. అదాని ప్రాజెక్టును ఆమోదించినా, రద్దు చేసినా భారత్ బొగ్గును ఉపయోగిస్తూనే ఉంటుంది. ఆస్ట్రేలియా దేశీయంగా శిలాజ ఉద్గారాలను తగ్గించుకోవాలె. భారత్ వంటి దేశాలను కూడా ఇందుకు ఒప్పించాలె.

**ది సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్**



# రోదసిలో పరిశోధన

అంతరిక్షంలో పరిశోధనశాలను నిర్మించతలపెట్టడం శాస్త్ర సాంకేతికరంగంలో భారత్ సాధిస్తున్న అభివృద్ధికి మరో సంకేతం. చంద్రుడి మీద పరిశోధనకు చంద్రయాన్-2 పథకాన్ని చేపట్టినట్టు, రోదసిలోకి భారతీయులను పంపేందుకు గగన్‌యాన్ పథకాన్ని చేపట్టినట్టు బుధవారం ప్రకటించిన ఇస్రో మరుసటిరోజే అంతర్జాతీయ పరిశోధనశాలను నిర్మిస్తున్నట్టు వెల్లడించి సంచలనం సృష్టించింది. 2030 నాటికి ఈ అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించాలని భారత్ భావిస్తున్నది. భారత్ ఇతరదేశాల పొత్తులేకుండా సొంతంగా ఈ అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించతలపెట్టడం కూడా విశేషమే. ఇప్పటివరకు అమెరికా, రష్యా, చైనా దేశాలు మాత్రమే సొంత అంతరిక్ష కేంద్రాలను నిర్మించుకున్నాయి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఈ మూడు పెద్ద దేశాలతో పాటు కెనెడా, జపాన్ తదితర దేశాలు భాగస్వాములుగా ఉన్నాయి. ఎంతోమంది శాస్త్రవేత్తలు ఐఎస్ఎస్‌కు వెళ్లి అక్కడ పరిశోధనలు సాగించుకొని తిరిగివచ్చారు. మొదట భారతీయ శాస్త్రవేత్తలు రష్యా సహకారంతో ఐఎస్ఎస్‌కు వెళ్లి శిక్షణ పొందుతారు. ఆ తర్వాత మన సొంత అంతరిక్ష కేంద్రం సిద్ధం కాగానే అందులో ప్రయోగాలు సాగిస్తారు. కొన్ని పరిశోధనలను భార రహిత స్థితిలో సాగించవలసి ఉంటుంది. ఔషధరంగంతో పాటు, ఖగోళ జీవశాస్త్రం, అనేక ఖగోళం, అంతరిక్షం, భౌతిక ధర్మాల పరిశీలన, వాతావరణం వంటి పలురంగాల్లో పరిశోధనలకు ఈ అంతర్జాతీయ పరిశోధనాశాల ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. భారత్ నిర్మించతలపెట్టేది మిగతా దేశాల మాదిరిగా భారీ పరిశోధనాశాల కాదు. అయినప్పటికీ మనకంటూ సొంత పరిశోధనశాల నిర్మించుకోవడమే గొప్పతనం.

**భారత్ ఆర్థికశక్తిగా ఎదుగుతున్న నేపథ్యంలో తన ప్రయోజనాల పరిరక్షణ కోసం భద్రతా ఏర్పాట్లు చేసుకోకతప్పదు. పొరుగునే ఉన్న చైనాను దృష్టిలో పెట్టుకొని భారత్ యుద్ధ వ్యూహాలను రూపొందించుకోవలసి వస్తున్నది. అంతరిక్షాన్ని యుద్ధానికి వేదికగా కాకుండా శాంతియుత అవసరాల కోసమే వాడుకోవాలనేది భారత్ సాంప్రదాయ విధానం. కానీ అంతర్జాతీయరంగంలో వచ్చిన మార్పుల వల్ల భారత్ కూడా ఈ దిశగా అడుగులు వేయక తప్పడంలేదు. అంతర్జాతీయ రంగంలో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకునే పరిస్థితి లేదు. బలమైన రాజ్యాల మాటే చెల్లుబాటు అవుతున్నది. ఈ నేపథ్యంలో భారత్ ప్రపంచ శాంతికోసం తన వంతు ప్రయత్నాలను కూడా కొనసాగించాలె.**

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే నెహ్రూ దార్శనికతతో పలు వైజ్ఞానిక రంగాల పరిశోధనల కు పునాది వేశారు. అణు శక్తి మొదలుకొని అంతరిక్ష శోధన వరకు భారత్ ఇవాళ ఈ దశలో ఉండటానికి ఆ పునాదులే కారణం. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లవుతున్న సందర్భంగా గగన్‌యా న్ పథకం పేర 2022లో రోదసిలోకి భారతీయులను పంపాలని ఇస్రో నిర్ణయించడం సముచితంగా ఉన్నది. గగన్‌యాన్ పథకంలో భాగంగా మన శాస్త్రవేత్తలు వారం పదిరోజులు మాత్రమే గగనయానం చేసినా అది మనదేశ వైజ్ఞానిక రంగ చరిత్రలో మైలురాయి అవుతుంది. భూ కక్ష్య లో పరిశోధనశాలను నిర్మించుకోవడం కూడా ఈ గగన్‌యాన్ పథకానికి కొనసాగింపే. చంద్రయా న్-2, గగన్‌యాన్ రెండూ దేశం చేపట్టబోయే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులే. చంద్రుడి దక్షిణ ధ్రువం మీద పరిశోధనలను ఇప్పటివరకు ఏ దేశమూ చేయలేదు. భారత్ స్వయంగా చంద్రుడి తలం మీద తిరుగాడే పరికరాన్ని (రోవర్) దింపి పరిశోధనలు సాగించనుంది. ఇది మన దేశమే సొం తంగా చేపట్టబోయే ప్రాజెక్టు. వచ్చే నెల 15వ తేదీననే మన అంతరిక్ష నౌక చంద్రుడి వైపుగా ప్రయాణం సాగించబోతున్నది. భవిష్యత్తులో చంద్రుడి మీద స్థావరాలను నెలకొల్పడం, అక్క డి వనరులను ఉపయోగించుకోవడం కోసం పెద్ద దేశాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. అందువల్ల చంద్రయాన్-2 ప్రాజెక్టుకు దీర్ఘకాలిక ప్రయోజనాలున్నాయి.

అంతరిక్షాన్ని ఆసరాగా చేసుకొని యుద్ధాన్ని ఎట్లా సాగించాలనే వ్యూహాలను రూపొందించడానికి డిఫెన్స్ స్పేస్ రిసెర్చ్ ఏజెన్సీ (డీఎస్ఆర్ఏ) ఏర్పాటుకు భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఇటీవలే ఆమోదం తెలిపింది. త్రివిధ దళాలతో సమన్వయం చేసుకోవడానికి శాస్త్రవేత్తల బృందాన్ని ఏర్పాటుచేస్తున్నారు. అంతరిక్షయుద్ధానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవడానికి కూడా భారత్ సిద్ధపడుతున్నదనేది మరో విశేషం. ప్రపంచంలోని పెద్ద దేశాలన్నీ అంతరిక్షాన్ని కూడా వేదికగా చేసుకుంటున్నాయి. కమ్యూనికేషన్ వ్యవస్థలను కాపాడుకోవడం, శత్రుదేశాల వ్యవస్థలను ధ్వంసం చేయడం, శత్రు దేశాలపై నిఘా వేయడం, ఉపగ్రహ వ్యవస్థల ఆధారంగా నియంత్రణలు, ఆదేశాలు సాగించడం తప్పనిసరైంది. అంతరిక్ష హంగుల ద్వారా శత్రు దేశానిది పైచేయి కాకుండా ఉండాలంటే, ఆ రంగంలో కూడా దీటుగా ఎదుగక తప్పదు. ఇటీవలే అంతరిక్షంలోని ఉపగ్రహాన్ని పేల్చివేసే ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించడం కూడా భారత్ అంతరిక్ష రక్షణ విధానంలో భాగమే. భారత్ ఆర్థికశక్తిగా ఎదుగుతున్న నేపథ్యంలో తన ప్రయోజనాల పరిరక్షణ కోసం భద్రతా ఏర్పాట్లు చేసుకోకతప్పదు. పొరుగునే ఉన్న చైనాను దృష్టిలో పెట్టుకొని భారత్ యుద్ధ వ్యూహాలను రూపొందించుకోవలసి వస్తున్నది. అంతరిక్షాన్ని యుద్ధానికి వేదికగా కాకుండా శాంతియుత అవసరాల కోసమే వాడుకోవాలనేది భారత్ సాంప్రదాయ విధానం. కానీ అంతర్జాతీయరంగంలో వచ్చిన మార్పుల వల్ల భారత్ కూడా ఈ దిశగా అడుగులు వేయక తప్పడంలేదు. అంతర్జాతీయ రంగంలో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకునే పరిస్థితి లేదు. బలమైన రాజ్యాల మాటే చెల్లుబాటు అవుతున్నది. ఈ నేపథ్యంలో భారత్ ప్రపంచ శాంతికోసం తన వంతు ప్రయత్నాలను కూడా కొనసాగించాలె. భూగోళంపై శాంతి నెలకొన్నప్పుడే, అంతరిక్షం కూడా శాంతియుత పరిశోధనలకు వేదికగా మారుతుంది.

**జనగళం**

### ఆదర్శం

వికారాబాద్ జిల్లా కలెక్టర్ మస్రత్ ఖనమ్ ఆయేషా తన కుమార్తె దబిష్ రాణియాను జిల్లా కేంద్రంలోని శివారెడ్డిపేట మైనార్టీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చేర్పించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. దీంతో ఆమెను కీర్తిస్తూ నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు తమ తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివించాలి. అప్పుడే ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని, అక్కడే నాణ్యమైన విద్య దొరుకుతుందని తల్లిదండ్రులకు చెప్పి ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను మాత్రం ప్రైవేట్ స్కూళ్లకు పంపించడం శోచనీయం.

**- అన్నాజి రాజేందర్, కరీంనగర్**

### నివారణపై దృష్టిసారించాలి

సాధారణంగా వానకాలంలో డెంగీ, మలేరియాలాంటి విష జ్వరాలు విజృంభించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ వ్యాధులు అటవీ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రబలే అవకాశాలుంటాయి. కాబట్టి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆయా ప్రాంతాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. విష జ్వరాల నివారణపై ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభిస్తే డెంగీ, మలేరియా ద్వారా వచ్చే మరణాల సంఖ్య తగ్గుముఖం పట్టే అవకాశాలుంటాయి. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

**- ముదాం శ్రీధర్, హైదరాబాద్**

### హర్షణీయం

పకడ్బందీగా మున్సిపల్ చట్టాన్ని రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన చేయడం అభినందనీయం. ఈ ఆలోచనతో గ్రామాలు, పట్టణాలు గుణాత్మకంగా అభివృద్ధి చెందుతాయనడంలో సందేహం లేదు. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలన్నింటా ప్రజలు సంతోషం వ్యక్తపరుస్తున్నారు. వినూత్న నిర్ణయాలు తీసుకుంటున్న కేసీఆర్ దేశానికే ఆదర్శం.

**- అమిరిశెట్టి రాజేందర్, హన్మకొండ**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**జాతీయం**



**అక్ష్యా సక్సేన**

# భాషపేరుతో ఆధిపత్య రాజకీయం

ఇప్పుడు మానవ జీవితం అంతా రాజకీయాల సమ్మిళితం. ప్రతిదాంట్లో రాజకీయాలు అంతర్లీనంగా ఉంటూ ప్రత్యేక ప్రయోజనాలను నెరవేరుస్తున్నాయి. ఆ క్రమంలోంచి.. హిందీ అంటే సంస్కృతం, హిం దూ అంటే ఉన్నత (అగ్రవర్ణం) కులం. ఇదే రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చే అంతసూత్రం. ఈ నేపథ్యంలో హిందీని రుద్దే ప్రయత్నాన్ని అర్థం చేసుకుంటే విషయాలు బోధపడుతాయి. దానివెనుక ఉన్న రాజకీయ శక్తి, ప్రయోజనాలు అవగతమవుతాయి.

ఈ మధ్య కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ విద్యా విధాన ముసాయిదా ప్రకటన దేశంలో తీవ్ర చర్చనీయాంశమైంది. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్‌ఈపీ)లో భాగంగా చెప్పిన త్రిభాషా సూత్రంపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. త్రిభాషా సూత్రంలో భాగంగా ప్రాథమిక విద్య స్థాయిలో స్థానిక భాషతోపాటు జాతీయ సమగ్రత కోసం హిందీని తప్పక నేర్చుకోవాలని, ఒక అంతర్జాతీయ భాష నేర్చుకోవాలని విద్యా విధాన ప్రకటనలో చెప్పుకొచ్చారు. దీనిపై దక్షిణాది రాష్ర్టాలపై హిందీ భాషను మరో రూపంలో రుద్దే ప్రయత్నంగా విమర్శలొచ్చాయి. దీంతో కేంద్రం వెనక్కి తగ్గి త్రిభాషా విధానంలో భాగంగా హిందీ తప్పనిగా నేర్చుకోవాలన్న షరతు, తప్పనిసరి కాదని వివరణ ఇచ్చుకున్నది.

దేశంలో త్రిభాషా విద్యా విధానం, విద్యలో భాష వినియోగంపై చర్చలు జరిగినప్పుడల్లా మూస పద్ధతిలో జరుగుతున్నాయి. కొందరు త్రిభాషా సూత్రంతోనే జాతీయతా భావన వెల్లివిరుస్తుందని చెప్పుకొస్తే, మరి కొందరు భాష పేర ఆధిపత్యాన్ని రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తారు. ఈ విధమైన చర్చలకు సుదీర్ఘమైన చరిత్రే ఉన్నది. కేవలం నూతనంగా ప్రకటించిన జాతీయ విద్యా విధాన ప్రకటనలో హిందీ ప్రాధాన్యం గురించిన చర్చగానే సాగటం సరైనది కాదు. దానిపేర, లేదా హిందీ మాటున కనిపించని విధానాలేవో చొచ్చుకు వస్తున్నాయి. ఈ చర్చను కేవలం హిందీ భాష చుట్టూ తిప్పితే లాభం లేదు. హిందీని ఆహ్వానించటమో, వ్యతిరేకించటమో చేస్తే అదే చాలదు. దీనిచుట్టూ అనేక విషయాలు అల్లుకొని ఉన్నాయి. హిందూ జాతీయవాదం, మతం, కులం ఉన్నాయి. ఈ క్రమంలో అంతర్జాతీయ భాష పేరుతో విదేశీ భాష అయిన ఇంగ్లీష్ పంచన చేరటం అనేది కూడా ఉన్నది.

ఈ నేపథ్యంలోనే ఎన్‌ఈపీ విధాన ప్రకటన వెలువడిన వెంటనే నిర్మలా సీతారామన్, ఎస్.జైశంకర్, పి.చిదంబరం, ఏఆర్ రహమాన్ లాంటి వారు ఎన్‌ఈపీపై ట్విటర్‌లో తమవైన అభిప్రాయాలు పెట్టారు. విచిత్రమేమంటే.. ఆ కామెంట్లన్నింటీ చదివితే అన్నింటి సారం ఒకేవిధంగా ఉన్నది. ఆ క్రమంలో తమిళ ప్రాంత నేతలు ప్రకటించిన భయాలను దూరం చేయటానికి అన్నట్లు.. ద్రావిడియన్ భాషలను ఆక్రమించటానికి హిందీని బోధనా భాషగా పెట్టటం లేదని వివరణ ఇచ్చారు. కేంద్రం హిందీని తప్పనిసరి చేయటంలో ఒక రాజకీయ కోణం ఉన్నది. దీనికి వ్యతిరేకంగా డీఎంకే, ఏఐడీఎంకే పార్టీలు స్పందించినా అందులో రాజకీయ కోణం, ప్రాంతీయ అస్తిత్వ చైతన్యం లేకపోలేదు.

మరొక ముఖ్య విషయమేమంటే.. దేశంలో ఎక్కువ శాతం మంది ప్రజలు మాట్లాడే భాష హిందీ ఎంత మాత్రం కాదు. ఉత్తరభారత దేశంలోని చాలా రాష్ర్టాల్లో అనే స్థానిక భాషలు మాట్లాడుతారు. కేవలం అధికార పత్రాల్లో వినియోగించినంత మాత్రాన ఆ ప్రాంతాల్లో హిందీ ప్రజల భాష కానేరదు. నూతన జాతీయ విద్యావిధాన ముసాయిదా ప్రకటన ప్రకారం.. బహుభాషా, సంస్కృతి కలిగిన ప్రాంతంగా ప్రజల మధ్య ఐక్యతను, సమగ్రతను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. అయితే దేశంలో ఉన్న అన్ని భాషలు నేర్చుకోవటం కష్టం కాబట్టి త్రిభాషా సూత్రంతో దేశ సమగ్రత పరిపుష్టం అవుతుందని చెబుతున్నారు.

ఈ నేపథ్యంలోంచే జాతీయ విద్యా విధానంలో ప్రతి విద్యార్థి ఒకటో తరగతి నుంచి మూడు భాషలు నేర్చుకోవాలనే నిబంధన పెట్టారు. కానీ అనేక రూపాల్లో విమర్శలు, నిరసనలు రావటంతో దాన్ని కొద్దిగా మార్చి ఈ విధంగా మార్చారు. విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి కోసం.. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ భాషలు నేర్చుకోవాలని తెలిపారు. మొదటిదాని ప్రకారం.. ఇంగ్లీష్ గ్లోబల్ కోసం, హిందీ జాతీయం కోసమని అర్థం చేసుకోవాలి.

త్రిభాషా సూత్రంలోని అసలు లక్ష్యమేమంటే.. హిందీని జాతీయ భాష చేసి జాతీయతకు కొత్త అర్థం, రంగు పులుమటానికి ప్రయత్నిస్తున్నారు. హిందీ అంటే హిందూగా గూఢార్థాన్ని చొప్పిస్తున్నారు. నిజానికి ఏ భాషా మరో భాష కన్నా గొప్పది, పవిత్రమైనది కాదు. అలాగే హిందీ కూడా మిగతా భాషలకన్నా ఏ విధంగానూ గొప్పది కాదు. చారిత్రకంగానూ, శాస్త్రీయంగానూ చూసినా హిందీకి మిగతా భాషలకన్నా ప్రత్యేకత ఏమీ లేదు. చాలా మంది భాషా శాస్త్రవేత్తలు కూడా హిందీకి ఏ విధమైన చారిత్రక విశిష్టత, ప్రత్యేకత లేదని తేల్చిచెప్పారు.

ఇప్పుడు మానవ జీవితం అంతా రాజకీయాల సమ్మిళితం. ప్రతిదాంట్లో రాజకీయాలు అంతర్లీనంగా ఉంటూ ప్రత్యేక ప్రయోజనాలను నెరవేరుస్తున్నాయి. ఆ క్రమంలోంచి.. హిందీ అంటే సంస్కృతం, హిందూ అంటే ఉన్నత (అగ్రవర్ణం) కులం. ఇదే రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చే అంతసూత్రం. ఈ నేపథ్యంలో హిందీని రుద్దే ప్రయత్నాన్ని అర్థం చేసుకుంటే విషయాలు బోధపడుతాయి. దానివెనుక ఉన్న రాజకీయ శక్తి, ప్రయోజనాలు అవగతమవుతాయి.

ప్రస్తుత విద్యావిధానంతో జరిగే క్రమాలను ఈ విధంగా అర్థం చేసుకోవచ్చు. వ్యవస్థాగతంగా హిందీని ఆధిపత్యంలోకి తేవటమంటే, చారిత్రకంగా ఉన్న హిందీ-ఉర్దూ భాషాసంస్కృతిని నాశనం చేయటమే. ప్రస్తుత విధానం.. హిందీ-ఉర్దూ-అరబిక్-పర్షియన్, సంస్కృతం పరిభాషల మేలు కలియిక అయిన హిందుస్థానీ భాషా సంస్కృతిని ధ్వంసం చేస్తుంది. మరో వైపు.. ఈ విద్యా విధానం చెబుతున్నదేమంటే.. హిందీ, ఉర్దూ భాషలకు తప్పుడు మూలాలను అంటగడుతున్నది. హిందీని మెజార్టీ ప్రజల భాషగా చెబుతూ ఉర్దూ భాషను ముస్లింల భాషగా ముద్రవేస్తున్నది. అలాగే, నూతన జాతీయ విద్యావిధాన ప్రకటనలో తల్లిదండ్రులు అనవసర అత్యాశలతో అశాస్త్రీయంగా 15 శాతం కూడా మాట్లాడని ఇంగ్లీష్‌ను కోరుకుంటున్నారని చెబుతున్నది. తమది కాని భాషను ఎంచుకుంటున్నారని అంటూనే ప్రతి ఒక్కరూ ఇంగ్లీష్‌ను నేర్చుకోవటం ద్వారా అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని చెప్పింది. శుద్ధమైన హిందీ పేరిట కూడా కులాధిపత్యాన్ని నెరపే ప్రయత్నం జరుగుతున్నది. మనం నేర్చుకునే భాషల్లో మనదైన సంస్కృతి, విలువలుండాలని చెబుతున్నది. అంతేకాదు, హిందీ భాషను ప్రధాన భాషగా చేయటంలో ఉత్తరాది ఆధిపత్యాన్ని సుస్థిరం చేసే ప్రయత్నం ఉన్నది. ఉత్తరాదిన కూడా అనేక భాషలున్నాయి. ఖరిబోలి, అవధి, మైథిలి, బ్రాజ్, ఉర్దూ భాషా సంస్కృతులు ప్రజల్లో వేళ్లూనుకొని ఉన్నాయి. వాటి అభివృద్ధికి ఏమి చేయకుండా హిందీని రాష్ట్ర భాషగా చేయటం ఆ భాషలకు తీరని నష్టం చేస్తుంది. నూతన జాతీయ విద్యా విధానంలో భాషను ఒక భావ వ్యక్తీకరణ పరికరంగా మాత్రమే చూశారు. కానీ భాష ఒక చారిత్రక, జీవనరీ తుల, సంస్కృతుల వ్యక్తీకరణగా చూడాల్సిన అవసరం ఉన్నది. జాతీయ సమగ్రత అనేదాన్ని ఒక గణిత సమీకరణంగా కుదించి చెబుతూ దానికి హిందీని అనుసంధాన భాషగా ఉండాలంటున్నారు. ఆ పేరుతో ఇతర భాషలను నిర్లక్ష్యం చేయటమే కాదు, వాటి విధ్వంసానికి కారకులవుతున్నారు. ఏవో కొన్ని భాషలకు ప్రాధాన్యం ఇచ్చినంత మాత్రాన ప్రజల భాషాసంస్కృతులు కలగలిసిపోయి సమైక్యత ఏర్పడదు. ఈ క్రమంలో అనేక భాషలు తీవ్ర నిర్లక్ష్యానికి గురై అంతరించిపోతున్నాయి. అనేక భాషలకు స్క్రిప్ట్ కూడా లేదు. తరతరాలుగా ప్రజల్లో ఉన్న భాషలకు, వారి సంస్కృతిక వ్యక్తీకరణకు భాషగా, సాహిత్యంగా గుర్తింపు లేదు. అనేక ప్రజా భాషలకు రాతను అభివృద్ధి చేసి వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. తెలిసో తెలియకో ప్రధాన భాషల ఆధిపత్యంలో అనేక ప్రజా భాషలు కునారిల్లుతున్నాయి. ఈ భాషల పరిపుష్టితోనే దేశీయ సాంస్కృతిక ఏకత సాధ్యమవుతుంది.

జాతీయ సమగ్రత అనేదాన్ని ఒక గణిత సమీకరణంగా కుదించి చెబుతూ దానికి హిందీని అనుసంధాన భాషగా ఉండాలంటున్నారు. ఆ పేరుతో ఇతర భాషలను నిర్లక్ష్యం చేయటమే కాదు, వాటి విధ్వంసానికి కారకులవుతున్నారు. ఏవో కొన్ని భాషలకు ప్రాధాన్యం ఇచ్చినంత మాత్రాన ప్రజల భాషాసంస్కృతులు కలగలిసిపోయి సమైక్యత ఏర్పడదు. ఈ క్రమంలో అనేక భాషలు తీవ్ర నిర్లక్ష్యానికి గురై అంతరించిపోతున్నాయి.

**(వ్యాసకర్త: వండర్‌బిల్ట్ వర్సిటీలో ఇంగ్లీష్ ప్రొఫెసర్) 'దివైర్' సౌజన్యం..**

# విలువలకు ప్రతీక గిరీశ్ కర్నాడ్

**నివాళి**



**చైతన్య కె.ఎం.**

రచయిత, నటుడు, హక్కుల ఉద్యమకారుడు గిరీశ్ కర్నాడ్ జీవితాంతం శాస్త్రీయ, మానవీయ విలువల కోసం ఉద్యమించాడు. హక్కులకు భంగం కలిగినప్పుడు ఏ విధమైన శషభిషలు లేకుండా వ్యతిరేకించాడు. దేనికీ లొంగలేదు. ఎవరికీ వెరువలేదు. తుదిశ్వాస వరకూ తాను విశ్వసించిన సిద్ధాంతాల కోసం కట్టుబడి జీవించాడు. ఆ క్రమంలో ఆయన వ్యక్తిత్వం, విలువల ప్రస్థానం అడుగడుగునా మనకు మార్గదర్శకంగా ఉంటుంది.

ఒక ప్రఖ్యాత నాటకకర్త తన జన్మదినం సందర్భంగా గిరీశ్ కర్నాడ్‌ను తన ఇంటికి ఆహ్వానించాడు. అప్పుడు గిరీశ్ కర్నాడ్.. 'పుట్టుక, చావులు వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత విషయాలు. అవి మనకు అత్యంత ఆప్తులు మాత్రమే పట్టించుకునేవి. అయితే విషయమేమంటే.. పుట్టుక, చావుకు మధ్య అతను ఏం చేశాడన్నదే ప్రధానం. అదే పట్టించుకోవాల్సినది..' అంటూ స్పందించాడు. కర్నాడ్ 16 ఏండ్ల వయస్సున్నప్పటి నుంచి ప్రముఖుల ముఖచిత్రాలను గీసి వారికే పంపిస్తూ.. వారి సంతకాలతో వాటిని సేకరించేవాడు. అలా అల్బర్ట్ ఐన్‌స్టీన్, సర్వేపల్లి రాధాకృష్ణన్ ఇంకా ఇతర ప్రముఖుల చిత్రాలను వారి ఆటోగ్రాఫ్‌లతో పొందాడు. ఒకసారి ఐరిష్ నాటక రచయిత సీన్ ఓ సెసీ ముఖచిత్రాన్ని కూడా గీసి ఆటోగ్రాఫ్‌తో దాన్ని తనకు పంపించాలని కర్నాడ్ కోరాడు. అప్పుడు ఐరిష్ నాటక రచయిత ఇలా అన్నాడు. 'ఎందుకు నీవు ఇతరుల చిత్రాలు గీసి వారి ఆటోగ్రాఫ్‌లను సేకరిస్తున్నావు? నీవే నీ యొక్క ప్రజ్ఞాపాటవాలతో ఏదైనా భిన్నమైనపని చేయి. అప్పుడు నీవే నీ ఆటోగ్రాఫ్‌తో ఇచ్చే స్థితి వస్తుంది' అని హితబోధ చేశాడు.



అంతే అప్పటి నుంచి గిరీశ్ కర్నాడ్ ఆలోచనాసరళిలో తీవ్ర మార్పు వచ్చింది. ప్రాపంచిక దృక్పథంలో నూతనత్వం వచ్చింది. ప్రపంచాన్ని చూడటంలో, అర్థం చేసుకోవటంలో వచ్చిన మార్పుతో ఆయన సామాజిక స్థితిగతులను లోతుగా అర్థం చేసుకోసాగాడు. సరిగ్గా అలాంటి పరిస్థితుల్లోంచే 22 ఏండ్ల వయస్సులోనే గిరీశ్ కర్నాడ్ ప్రఖ్యాత 'యయాతి' రచన చేశాడు. అప్పటి నుంచి ఆయన అనేక నాటకాలు రచించాడు. ఈ క్రమంలోంచే దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా గొప్ప నాటక రచయితగా పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు.

గిరీశ్ కర్నాడ్‌కు సంబంధించి నాకు అతనితో ఉన్న అనుబంధం సుదీర్ఘమైనది. 25 ఏండ్ల కిందట బెంగళూరులోని జేపీ నగర్‌లో గిరీశ్ కర్నాడ్ ఉన్నప్పటి నుంచి ఆయన నాకు బాగా తెలుసు. తెలుసు అనేకంటే మంచి అనుబంధం. ఒకరోజు ఆయన మా ఇంటి గుమ్మం ముందు ప్రత్యక్షమై.. తన ఇంట్లో చేసిన కూర 'బెల్లుల్లి తంబూలి'ని ఓ టిఫిన్ బాక్స్‌లో పెట్టుకొని మాకు తెచ్చి ఇచ్చాడు. ఇరుగు పొరుగు అన్నప్పుడు ఆహారపదార్థాలు, కూరలు ఇచ్చిపుచ్చుకోకుంటే అర్థమేమిటి అని మా అమ్మతో అంటూ తన ఇంట్లో చేసిన కూరలు మాకు పంచేవాడు. నేను అప్పటికే ఆయనను దూరదర్శన్‌లో ప్రసారమవుతున్న 'టర్నింగ్ పాయింట్' ప్రోగ్రాంలో ఆయన్ను చూసి ఉన్నాను. టీవీల్లో కనిపించే ఆయన మా ఇంటిముందు ప్రత్యక్షమయ్యేసరికి నేను ఆశ్చర్యపడటం, ఆనందపడటం ఒకేసారి జరిగాయి. కర్నాడ్ తన ఇంటిపక్కల ఉన్నవారినీ, పరిసరాల్లో ఉన్నవారినీ తనవారిగానే భావించేవాడు. అందరూ ఓ సమిష్టి కుటుంబంగా మెలగాలని కాంక్షించేవాడు. ఐదేండ్ల కిందట ఆయన ఇంటిముందు బెంగళూరు మున్సిపాలిటీ వారు తవ్వకాలు జరుపుతూ అక్కడ ఉన్న చెట్లన్నీంటినీ నరికేశారు. బెంగళూరు విస్తరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో ఇలా బెంగళూరులోని అనేక ప్రాంతాలు రూపురేఖలు మారిపోయాయి. మరో మాటలో చెప్పాలంటే ధ్వంసమయ్యాయి. దీంతో ఆ రోడ్డు వెంట విపరీతమైన ట్రాఫిక్ పెరిగింది. వాయు, ధ్వని కాలుష్యం పెరిగిపోయాయి. ఈ పరిస్థితుల ప్రభావంతోనే కావచ్చు ఆయన బాయిల్డ్ బీన్స్ ఆన్ టోస్ట్, వెడ్డింగ్ ఆల్బమ్, ఏ హీప్ ఆఫ్ బ్రోకెన్ ఇమేజెస్ లాంటి నాటకాలు రాశారు గిరీశ్ కర్నాడ్. ఆ నాటకాల్లోని పాత్రలు బెంగళూరు నగరం రూపుమారిన విధానాన్ని వ్యంగ్యంగా అనేక సందర్భాల్లో చెబుతాయి.

నేను కమ్యూనికేషన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన తర్వాత ముంబాయికి వెళ్లాలనేది నా ఆలోచన. అప్పుడు మా నాయన సూచన మేరకు నేను గిరీశ్ కర్నాడ్ వద్దకు వెళ్లాను. అప్పటికి ఆయన బాలీవుడ్‌లో పేరుగాంచిన నటుడుగా ఉన్నారు. ఓ సినిమా షూటింగ్ కోసం కర్నాడ్ గారు లండన్ నుంచి షూటింగ్ స్పాట్‌కు ఒక గంటముందే చేరుకున్నారు. అప్పుడు.. మరో ప్రఖ్యాత నటుడు షూటింగ్‌కు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినందుకు తీవ్రంగా మందలించటం నేను చూశాను. సమయపాలన పట్ల ఆయన ఎంత కఠినంగా, నిబద్ధతతో ఉంటారో ఈ ఘటనద్వారా తెలుస్తుంది. అప్పటి నుంచి ఆయనను కలువటానికి అనుకున్న సమయానికన్నా ముందే వెళ్లి ఇంటిముందర వాలేవాడిని. నాకు ముంబైలోని బాలీవుడ్‌లో సహాయం చేయాలని ఆయన్ను కోరాను. ఆయన ఆశ్చర్యంగా నా వైపు చూడటంలో.. తన తండ్రి సలహా మేరకే ఆ కోరిక కోరానని తెలిపాను. అప్పుడాయన.. ముంబైకే ఎందుకెళ్లాలి. నేనో టీవీ సీరియల్ తీస్తున్నాను. నాకు సహాయకుడిగా ఉండగలవా? అని నన్నడిగారు. ఆ విధంగా మా ప్రయాణం సినిమాల నుంచి టీవీ రంగానికి మారింది. ఆయనతో కలిసి రెండు టీవీ షోలకు పనిచేశాను. ఆయనతో సీరియళ్లకు పనిచేసే క్రమంలోనే నేను అసోసియేట్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నాను. ఆయనతో కలిసి చేస్తున్న సమయంలోనే ఆయనకు జ్ఞానపీఠ్ అవార్డు వచ్చింది. అప్పటికి మేం షూటింగ్‌లో ఉన్నాం. షూటింగ్ కార్యక్రమాన్ని నిలిపేయకుండానే తాను ఢిల్లీకి వెళ్తూ నన్ను మొత్తంగా షూటింగ్ వ్యవహార బాధ్యతను నాకు అప్పగించారు. మాల్గుడి డేస్‌కు పనిచేసిన ఎస్.రామచంద్ర గారే మా ప్రాజెక్టుకు సినిమాటోగ్రాఫర్. అప్పుడు నా వయస్సు 23 ఏండ్లు. ఆ తర్వాత వివిధ కారణాల చేత రెండు నెలలు షూటింగ్‌కు రాలేదు. ఆ ప్రాజెక్టు అంతా నేను దర్శకత్వం వహించాను. ఆ తర్వాత ఫిల్మ్ చూస్తూ.. తర్వాత భాగాలన్నింటినీ నన్నే డెరెక్ట్ చేయమన్నారు.

ఆయన ఏ స్థానంలో ఎక్కడ ఉన్నా తనదైన ముద్రవేశారు. ఎక్కడా రాజీపడలేదు. ఆయన ఒక విషయాన్ని సంపూర్ణంగా నమ్మితే ఎవరు వ్యతిరేకించినా తన దారిన తాను పోయేవాడు. ఆయన పునా ఫిలిం ఇనిస్టిట్యూట్‌కు డైరెక్టర్‌గా ఉన్నప్పుడు ఓంపురిని విద్యార్థిగా తీసుకోవటానికి నిర్వాహకులు నిరాకరించారు. ఎందుకంటే.. ఆయన ముఖంపై గుంతలతో ఉన్న తట్టు మచ్చలు, సన్నని బక్కపల్చని దేహం. ఆయన వర్చస్సు నటనకు పనికిరాదని నిర్వాహకుల భావన. కానీ గిరీశ్ కర్నాడ్ ఓంపురికి ప్రవేశం ఇవ్వాల్సిందేనని పట్టుబట్టి ఇప్పించాడు. ఓంపురి ఏం సాధించాడో చరిత్రే.

గిరీశ్ కర్నాడ్ ఏ విషయంలోనైనా నిబద్ధతతో ఉండేవాడు. నిజాయితీతో వ్యవహరించేవాడు. సందర్భానుసారంగా వ్యవహరించే రకం కాదు. ఆయనకు గీత, ఉపనిషత్‌లపై విస్తారమైన పరిజ్ఞానం ఉండేది. సందర్భానుసారంగా వాటిలోని శ్లోకాలను నోటికి చెప్పేవారు. అలాగే ఆయన తన కర్తవ్య నిర్వహణకు ఎవరు, ఏ రూపంలో ఆటంకంగా నిలిచానా వెంటనే బాధ్యతల నుంచి తప్పుకునేవాడు. అలా ఆయన అనేక పదవులను వదులుకున్నాడు. ఈ మధ్యకాలంలో పెరిగిపోతున్న అసహన, మెజార్టీవాద రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించారు. లౌకిక ప్రజాస్వామిక విలువల కోసం గొంతు విప్పారు. ముఖ్యంగా గౌరీలంకేశ్ హత్య తర్వాత ఆయన మరింత తీవ్రంగా పాలక ప్రభుత్వాల దమననీతికి వ్యతిరేకంగా గొంతువిప్పాడు. ప్రశ్నించే గొంతులను ప్రభుత్వం అర్బన్ మావోయిస్టుల పేరుతో అరెస్టులు చేసి జైలుపాలు చేస్తున్న తీరుకు నిరసనగా ఆయన 'నేను కూడా అర్బన్ మావోయిస్టునే' అని బోర్డు రాసి మెడకు వేసుకొని ప్రభుత్వ దమన కాండకు నిరసన వ్యక్తంచేశారు. తీవ్రమైన శ్వాసకోశ సంబంధ సమస్య ఉన్నా కూడా ఆక్సీజన్ పైపులు పెట్టుకొని గౌరీలంకేశ్, మైనారిటీలపై హిం దుత్వ వాదుల దాడులను నిరసిస్తూ జరిగిన నిరసన ప్రదర్శనలో పాల్గొనటం ఆయన నిబద్ధతకు నిదర్శనం. ఆయన సాహిత్యరంగంలోనే కాకుం డా నటుడుగా, హక్కుల ఉద్యమ కార్యకర్తగా అందరికీ ఆదర్శం. జీవితమంతా నిత్య సంఘర్షణతో నిబద్ధ జీవితంతో నిలిచిన గిరీశ్ కర్నాడ్ లేని లోటు సినీ రంగానికే కాదు, ప్రజాస్వామిక హక్కుల ఉద్యమానికి కూడా పూడ్చలేనిది.

**(వ్యాసకర్త: సినీ నిర్మాత, నాటకరంగ కళాకారుడు)**

**'ది వైర్' సౌజన్యంతో...**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.




జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని ఖాదీ ఆవరణలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో గురువారం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. త్రిదండి శ్రీరామానుజ చినజీయర్ స్వామి చేతుల మీదుగా ఈ వేడుక జరిగింది. ఉదయం నుంచి ఆరాధన, బాలభోగ నివేదన, శాంతి హోమం, వేదపారాయణం, మహాపూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు దంపతులు, ఆలయ ధర్మకర్త దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అంతకుముందు మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకార్చనలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణ వేడుకను వీక్షించి తరించారు. - మారుతీనగర్

## మెట్‌పల్లి విద్యార్థికి 'రూర్కి'లో పీహెచ్‌డీ సీటు



మానాల శివతేజ

**మెట్‌పల్లి, నమస్తే తెలంగాణ:** దేశంలో ప్రతిష్ఠాత్మక ఐఐటీ కళాశాలల్లో ఒకటైన ఉత్తరాఖండ్‌లోని రూర్కి ఐఐటీలో జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మానాల శివతేజ పీహెచ్‌డీ సీటును దక్కించుకున్నాడు. పీహెచ్‌డీ ఎంట్రెన్స్‌లో జాతీయ స్థాయిలో ఆరో ర్యాంకు సాధించాడు. కొండగట్టు జేఎన్టీయూ కళాశాలలో బీటెక్, రూర్కి ఐఐటీ కళాశాలలో ఎంటెక్ (ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్) చదివిన శివతేజ .. పీహెచ్‌డీ కోర్సుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.




వానాకాలం సాగు పనులను రైతులు సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. విత్తనాలు, పూజాసామగ్రితో చేలకు వెళ్లిన రైతులు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం చౌపన్‌గూడలో ఆదివాసీలు దేవునికి పూజలు చేసి నైవేద్యం సమర్పించి.. ఆపై విత్తనాలు వేశారు. ఈ సందర్భంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆటాపాటలతో సంబురాలు జరుపుకొన్నారు. -కెరమెరి







గట్టు భీముడు పార్థివదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న కేటీఆర్. చిత్రంలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు.. అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన అభిమానులు

# గట్టు భీముడికి కన్నీటి వీడ్కోలు

- నివాళులర్పించిన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మాజీ ఎమ్మెల్యే అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- భారీగా తరలివచ్చిన అభిమానులు, టీఆర్‌ఎస్ కార్యకర్తలు

**జోగుళాంబ గద్వాల, నమస్తేతెలంగాణప్రతినిధి:** బడుగుల ఆత్మ బంధువు, మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడికి నడిగడ్డ కన్నీటి వీడ్కోలు పలికింది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. భీముడి పార్థివ దేహాన్ని అదేరోజు ఆయన స్వగ్రామమైన జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం బలిగెరకు తరలించారు. టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఉదయం బలిగెరకు చేరుకొని గట్టు భీముడి పార్థివదేహంపై పుష్పగుచ్ఛాన్ని ఉంచి నివాళులర్పించారు. శోకసంద్రంలో మునిగిన భీముడి సతీమణి భువనేశ్వరిని, తమ్ముడు తిమ్మప్పను కేటీఆర్ ఓదార్చారు. అధైర్యపడొద్దని అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి చివరి వరకు బలిగెర గ్రామంలోనే ఉండి గట్టు భీముడి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు ఆంజనేయులు గౌడ్ గట్టు భీముడి పాడె మోసి అభిమానాన్ని చాటుకున్నారు. బలిగెర గ్రామంలోని గట్టు భీముడి వ్యవసాయక్షేత్రంలో ఆయన భౌతిక కాయాన్ని ఖననం చేశారు. ఆత్మీయనేత భీముడిని కడసారిగా చూసేందుకు వేలాది మంది అభిమానులు, టీఆర్‌ఎస్ కార్యకర్తలు బలిగెరకు తరలివచ్చారు. అంత్యక్రియల్లో ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, ఉమ్మడి పాలమూరు జెడ్పీ చైర్మన్ బండారు భాస్కర్, నూతనంగా ఎన్నికైన గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, డాక్టర్ అబ్రహం, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, షాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ శశాంక, ఎస్పీ లక్ష్మీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

# డెడ్ స్టోరేజీకి తుంగభద్ర!

- డ్యామ్ పూర్తి నిల్వ సామర్థ్యం 100.855 టీఎంసీలు
- ప్రస్తుతం 2.289 టీఎంసీలు నిల్వ
- ప్రాజెక్టు నిండితేనే కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ర్టాలకు సాగు నీరు
- నైరుతి రుతు పవనాలపైనే రైతుల ఆశలు

**అయిజ:** తుంగభద్ర జలాశయం డెడ్‌స్టోరేజీకి చేరుకున్నది. కర్ణాటక, ఏపీతోపాటు తెలంగాణలోని జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని 87,500 ఎకరాలకు సాగు నీరందించే టీబీ డ్యామ్ ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతున్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 100.855 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 2.289 టీఎంసీల నీరున్నది. గతేడాది ఇదే సమయంలో 4.739 టీఎంసీల నీరుండగా, 1,127 క్యూసెక్కుల నీటి ప్రవాహం నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఇన్‌ఫ్లో లేకుండాపోయింది. కాగా నైరుతి రుతుపవనాలపైనే మూడు రాష్ర్టాల రైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం డ్యామ్‌కు తాగునీటి అవసరాల కోసం178 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

టీబీ డ్యామ్ నిండితేనే..

కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం పూర్తిగా నిండితేనే కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ర్టాలకు సాగు నీరు విడుదల చేయనున్నారు. నదీ పరివాహక ప్రాంత రాష్ర్టాలకు కేడబ్ల్యూడీటీ 212 టీఎంసీల నీరు వాడుకునేందుకు కేటాయింపులు చేసింది. 2019-20 డాదికి టీబీ డ్యామ్‌కు 163 టీఎంసీల నీరు వస్తుందని అంచనా వేసిన టీబీ బోర్డు మూడు రాష్ర్టాలకు కేటాయింపులు చేసింది. తెలంగాణలోని 87,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్డీఎస్ ప్రాజెక్టు ద్వారా సాగు నీరు అందుతున్నది. ఈ ఏడాది ఆర్డీఎస్‌కు 5.005 టీఎంసీలను కేటాయించారు. కర్ణాటకలోని ఆర్డీఎస్‌కు నీరు రావాలంటే టీబీ డ్యామ్ పూర్తిగా నిండాల్సి ఉన్నది. ఇప్పటివరకు టీబీ డ్యామ్‌కు ఇన్‌ఫ్లో లేకపోవడం, ఎగువన వానలు కురవకపోవడంతో కనీసం జూలై చివరి నాటికైనా టీబీ డ్యామ్ పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంటుందని రైతులు ఆశతో ఉన్నారు.



డెడ్‌స్టోరేజీకి చేరిన తుంగభద్ర జలాశయం

### 'నైరుతి'పైనే..

తుంగభద్ర నదీ పరివాహక రైతులు నైరుతి రుతుపవనాలపైనే ఆశలు పెట్టుకున్నారు. జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాలు రావాల్సి ఉన్నది. ఈ ఏడాది రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో వానల కోసం రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. ఈనెల 15, 16న కర్ణాటకలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటుండటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

### అడుగంటిన సాగర్

**నల్లగొండ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** నాగార్జునసాగర్ ప్రాజెక్టు అడుగంటింది. 510 అడుగుల కనీస స్థాయి కంటే ప్రస్తుతం సాగర్‌లో ఇంకో ఒకటిన్నర అడుగుల లోతుకు నీటిమట్టం పడిపోయింది. 590 అడుగుల గరిష్ఠ స్థాయిలో 312 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండాల్సిన సాగర్‌లో ప్రస్తుతం 508.4 అడుగుల స్థాయిలో (128.97 టీఎంసీలు) మాత్రమే నీరు నిల్వ ఉన్నది. తాగునీటి అవసరాల కోసం ఎస్సెల్బీసీ (పుట్టంగండి) ద్వారా తీసుకుంటున్న 800 క్యూసెక్కులు మాత్రమే ఔట్‌ఫ్లో ఉన్నది. ఎగువన వర్షాలు త్వరగా కురవాలని.. పరుగు పరుగున కృష్ణమ్మ పొంగి నాగార్జున సాగర్ నిండాలని ఇరు రాష్ర్టాల రైతాంగం కోరుకుంటున్నది. గతేడాది ఇదే రోజున సాగర్ నీటిమట్టం 511 అడుగులు ఉన్నది.



పెద్దపల్లిలో మంత్రి ఈటల రాజేందర్‌తో మాట్లాడుతున్న చిన్నారి అక్షయ్ కుర్రే తల్లిదండ్రులు

## మానవత్వం చాటుకున్న మంత్రి ఈటల

వలస కార్మికుడి కుటుంబానికి చేయూత..

చిన్నారికి గుండె ఆపరేషన్ చేయించాలని కలెక్టర్‌కు ఆదేశం

**పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ/ కలెక్టరేట్ :** వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ మానవత్వాన్ని చాటుకున్నారు. గురువారం పెద్దపల్లి కలెక్టర్ క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవానికి మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ఈటల వచ్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ర్టానికి చెందిన పరమేశ్వర్ - శివకుమారి దంపతులు ఇక్కడ కలెక్టరేట్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. వీరి చిన్న కుమారుడు అక్షయ్ కుర్రే (1) గుండెకు రంధ్రం ఉందని మంత్రి ఈటల దృష్టికి స్థానిక వైద్యులు తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి ఈటల.. అక్షయ్ కుర్రేకు ప్రభుత్వం తరపున ఉచితంగా వైద్యం అందించాలని కలెక్టర్ శ్రీదేవసేనను ఆదేశించారు.

## 4.39 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు పట్టివేత



జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ పోలీసులకు నకిలీ పత్తి విత్తనాలు అప్పగిస్తున్న వ్యవసాయాధికారులు



జోగుళాంబ గద్వాల జిల్లాలో స్వాధీనం చేసుకున్న నకిలీ పత్తి విత్తనాలతో శాంతినగర్ పోలీసులు, వ్యవసాయ అధికారులు

**మల్దకల్:** వ్యవసాయాధికారుల దాడుల్లో 4.39 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో గురువారం సాయంత్రం చోటుచేసుకున్నది. పోలీసులు, వ్యవసాయాధికారి రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్దకల్ మండలం నాగర్‌దొడ్డికి చెందిన కుర్వ వెంకట్రాములు నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్నట్టు సమాచారం రావడంతో దాడులు నిర్వహించగా రెండు క్వింటాళ్ల విత్తనాలు లభ్యమయ్యాయి. వాటిని మల్దకల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదుచేశారు. టాస్క్‌ఫోర్స్, వ్యవసాయాధికారుల దాడుల్లో మల్దకల్ మండలం శేషంపల్లి గ్రామానికి చెందిన బోయ నర్సింహులు వద్ద రెండు క్వింటాళ్ల విత్తనాలు దొరకగా, వాటి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. అలాగే వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన గరక రాముడు వద్ద 10 కిలోలు, బోయ రాముడి వద్ద 10 కిలోలు, బీ ఆంజనేయులు వద్ద 19 కిలోల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నట్టు ఏవో రాధ తెలిపారు. వాటిని శాంతినగర్ పోలీసులకు అప్పగించి, ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

**విత్తన దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు**

**వరంగల్ చౌరస్తా(వరంగల్ అర్బన్):** వరంగల్ స్టేషన్ రోడ్‌లోని పలు విత్తన దుకాణాల్లో గురువారం విజిలెన్స్ సీఐ బీ మల్లయ్య ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, విత్తన నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా విత్తనాలు విక్రయిస్తే జరిపితే పీడీ యాక్టు నమోదు చేస్తామని దుకాణాల నిర్వాహకులను హెచ్చరించారు. తనిఖీల్లో ఎలాంటి అక్రమ నిల్వలు, నకిలీ విత్తనాలు అభ్యం కాలేదని సీఐ తెలిపారు.



నూతనంగా ఆవిర్భవించిన ములుగు జిల్లాలో టీఆర్‌ఎస్ కార్యాలయ భవన నిర్మాణం కోసం బండారుపల్లి సమీపంలోని ప్రభుత్వ భూమిని గురువారం వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ, ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ పరిశీలించారు. త్వరలో అన్ని హంగులతో తెలంగాణ భవన్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్టు వారు పేర్కొన్నారు. - ములుగు టౌన్

## జల్దిపల్లి సర్పంచ్ రిమాండ్

- కులం పేరుతో దూషించినందుకు..

**లింగంపేట:** కులం పేరుతో దూషించినందుకు గాను కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం జల్దిపల్లి సర్పంచ్ కల్లు రవీందర్‌తోపాటు అతని సోదరుడు రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎల్లారెడ్డి డీఎస్పీ సత్తెన్న తెలిపారు. గురువారం ఎల్లారెడ్డిలో డీఎస్పీ మీడియాతో వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈనెల 6న పంచాయతీ కార్యాలయంలోని కుర్చీలో అదే గ్రామానికి చెందిన పెద్ద సాయిలు కూర్చోవడాన్ని జీర్ణించుకోలేక సర్పంచ్ కల్లు రవీందర్, అతని సోదరుడు కల్లు రాజు అతడిని కులం పేరుతో దూషించారని, బోనాల పండుగ సందర్భంగా మేకలు కోయకుండా అడ్డుకున్నారని, పండుగ రోజు బోరు నీరు సరఫరా కాకుండా విద్యుత్ తీగలు తొలగించినట్టు బాధితులు ఫిర్యాదు చేయగా.. విచారణ జరిపిన పోలీసులు సర్పంచ్ కల్లు రవీందర్‌తోపాటు అతని సోదరుడు రాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ సత్తెన్న తెలిపారు.

## మనస్తాపంతో ఉపాధ్యాయురాలు ఆత్మహత్య

**కోదాడ రూరల్ :** కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన తిప్పన పురుషోత్తమరావు కూతురు జ్యోతి(35)కి గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బచ్చు సైదులుతో ఎనిమిదేండ్ల క్రితం వివాహం జరిగింది. గరిడేపల్లి మండలం అగ్రహారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నది. మనస్పర్థల కారణంగా కొంతకాలంగా జ్యోతి భర్తకు దూరంగా తండ్రి వద్ద ఉంటుంది. బుధవారం రాత్రి ఇంట్లోని వారందరూ బిల్డింగ్‌పైన నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు.

## చిన్నారులపై కత్తెరతో దాడి

- మద్యం మత్తులో తండ్రి ఘాతుకం

**జగిత్యాలక్రైం:** మద్యం మత్తులో ఓ తండ్రి తన కొడుకులపై కత్తెరతో దాడి చేశాడు. ఈ ఘటన జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేటలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన దామోదర్ పిల్లలు నందకిశోర్(13), జీవన్(12)లు మధ్యాహ్నం సమయంలో నిద్రిస్తున్నారు. ఆ సమయంలో ఇంటికి వచ్చిన దామోదర్ కొడుకులను నిద్రలేపే ప్రయత్నం చేశాడు. ఎంతకూ వారు లేవకపోవడంతో మద్యం మత్తులో ఉన్న దామోదర్ తన పిల్లలపై కత్తెరతో దాడి చేశాడు. భయాందోళనకు గురైన చిన్నారులు కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. చేతులకు గాయాలైన చిన్నారులను తల్లి, బంధువులు జగిత్యాల దవాఖానకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. చిన్నారుల తల్లి ఫిర్యాదు మేరకు జగిత్యాల పోలీసులు కేసు నమోదు చేశారు.



సిర్పూరు పేపర్ మిల్లులో స్విచ్ ఆన్ చేసి యంత్రాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

## ఎస్పీఎంలో మూడో నంబర్ యంత్రం ప్రారంభం

**కాగజ్‌నగర్ టౌన్ :** సిర్పూరు పేపరు మిల్లులో మూడో నంబర్ యంత్రాన్ని జేకే డైరెక్టర్ పీకే సూరి గురువారం ప్రారంభించారు. మరో వారం రోజుల్లో ఈ యంత్రం ద్వారా పేపర్ ఉత్పత్తి ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. పేపరు మిల్లు పునరుద్ధరణలో భాగంగా ఫిబ్రవరిలో ఏడో నంబరు యంత్రాన్ని సిర్పూరు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రారంభించగా.. ఫైబర్‌లైన్, పల్ప్ మిల్లు, చిప్పర్ హౌస్, బైలర్‌హౌస్‌ల్లో దశల వారీగా పనులు చేపట్టారు. మార్చి 30న 8వ నంబరు యంత్రాన్ని ప్రారంభించారు.

## కొడుకును చంపి.. తల్లి ఆత్మహత్య

**తొర్రూరు, నమస్తే తెలంగాణ :** కుటుంబ కలహాలతో 13 నెలల కొడుకుకు ఉరివేసి ఆతర్వాత తల్లి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూరులో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ చెట్టబోయిన అశోక్‌తో సంధ్యకు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 13 నెలల రుత్విక్ అనే బాబు ఉన్నాడు. వివాహం జరిగిన కొద్దికాలానికే సంధ్యకు ఆమె అత్త వెంకటమ్మతో గొడవలు జరిగేవి. దీంతో వేరు కాపురం పెట్టాలంటూ భర్తను కోరగా, విబేధాలు మరింత తీవ్రమయ్యాయి. ఈ క్రమంలో నెల రోజుల క్రితం సంధ్య పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 7న అశోక్ పెద్దమనుషులను తీసుకెళ్లి సంధ్యకు నచ్చచెప్పి తిరిగి కాపురానికి తీసుకువచ్చాడు. గురువారం ఉదయం టిఫిన్ తీసుకొచ్చేందుకు అశోక్ బయటికి వెళ్లగా సంధ్య కొడుకుతో కలిసి ఆత్మహత్య చేసుకుంది.

# ఏసీబీకి చిక్కిన వీఆర్వో

**పెద్దకొడప్‌గల్:** కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండల బేగంపూర్ వీఆర్వో బత్తిని శంకర్ ఓ రైతు దగ్గర లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ ప్రసన్న రాణి తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపూర్ గ్రామానికి చెందిన పుట్టల అంబయ్య కొన్నేండ్ల క్రితం భూమి కొనుగోలు చేశాడు. ఇందుకు సంబంధించి పట్టాపాసు పుస్తకం, ఆర్డర్ కాపీ కోసం వీఆర్వో శంకర్ వద్దకు వెళ్లగా రూ.15 వేలు లంచం డిమాండ్ చేశాడు. చివరకు రూ.8 వేలకు ఒప్పందం కుదిరింది. ఆ మేరకు గురువారం బిచ్కుందలో రైతు అంబయ్య నుంచి రూ.8 వేలు లంచం తీసుకుంటుండగా వీఆర్వో బత్తిని శంకర్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



వీఆర్వో శంకర్

**సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు..**

**సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. కార్యాలయంలో జోరుగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు తనిఖీలు జరిపారు. కార్యాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ, రోజువారీ రిజిస్ట్రేషన్ల నమోదు, తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. సబ్ రిజిస్ట్రార్లు సులోచనాదేవి, బాల్‌రాజుకు ఏసీబీ అధికారులు ప్రశ్నలు సంధించగా కొన్ని సమాధానాలను వారు దాటవేసినట్టు సమాచారం. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలపై ఆరా తీశారు. వారి ఫోన్ నంబర్లను కూడా సేకరించారు. ఈ సోదాల్లో ఏసీబీ అధికారులకు ఎలాంటి ధ్రువపత్రాలు గానీ, డబ్బు గానీ లభించలేదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు చేయడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

## మక్తల్ బస్టాండ్‌లో మహిళ ప్రసవం

**మక్తల్, నమస్తే తెలంగాణ:** పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణీని దవాఖానకు తరలిస్తుండగా బస్టాండ్‌లోనే ప్రసవించిన ఘటన గురువారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో చోటుచేసుకున్నది. వివరాలిలా.. మాగనూరు మండలం వర్కూర్‌కు చెందిన అక్కమ్మ గర్భిణి. గురువారం ఉదయం అక్కమ్మకు పురిటి నొప్పులు వస్తుండటంతో ఆమె అత్త కైకమ్మతో కలిసి మక్తల్ దవాఖానకు బస్సులో వచ్చారు. బస్టాండ్‌లో దిగాక నొప్పులు అధికం కావడంతో అక్కడే అక్కమ్మ ప్రసవించింది. పండంటి పాపకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను ప్రభుత్వ దవాఖానకు తరలించారు. తల్లీబిడ్డలకు వైద్య పరీక్షలు చేసి క్షేమంగా ఉన్నారని వైద్యురాలు గౌతమి తెలిపారు.

## నకిలీ విత్తనాల పట్టివేత

**బెల్లంపల్లి, నమస్తే తెలంగాణ :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని రడగంబాలబస్తీలో ఒకరి ఇంట్లో నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. బెల్లంపల్లి వన్ టౌన్ ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం, రడగంబాలబస్తీలోని నివాసముంటున్న దేవికై రైస్‌ల్లు యజమాని బండ సత్యనారాయణ ఇంట్లో నకిలీ పత్తి విత్తనాలు ఉన్నాయనే సమాచారంతో వ్యవసాయ అధికారులతో కలిసి సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో అతని ఇంట్లో బియ్యం సంచిలో ఉంచిన 120 కిలోల పత్తివితనాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 2.40 లక్షల వరకు ఉంటుదని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు సత్యనారాయణ పై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు వివరించారు.

# రేపు నీతి ఆయోగ్ భేటీ

ప్రధాని మోదీ అధ్యక్షతన రాష్ట్రపతి భవన్‌లో సమావేశం

హాజరు కానున్న వివిధ రాష్ట్రాల సీఎంలు, లెఫ్టినెంట్ గవర్నర్లు

**న్యూఢిల్లీ:** నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశం ఈ నెల 15న ఢిల్లీలో జరుగనున్నది. ఈ సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షత వహించనున్నారు. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన రాష్ట్రపతి భవన్‌లో జరిగే ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక, హోం, రక్షణ, వ్యవసాయ, వాణి జ్య, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రులు, వివిధ రాష్ట్రాల సీఎంలు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, నీతి ఆయోగ్ వైస్‌చైర్మన్, సీఈవో, సభ్యులు హాజరవుతారు. నీతి ఆయోగ్ ఏర్పాటైనప్పటి నుంచి ఇది ఐదో సమావేశం. దేశం లో వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ సంక్షోభం, నక్సల్స్ ప్రభావిత జిల్లాల్లో శాంతిభద్రతలు తదితర అంశాలను ఎజెండాగా నిర్ణయించారు. నరేంద్రమోదీ సర్కార్ తిరిగి కొలువు దీరిన తర్వాత జరుగుతున్న తొలి నీతి ఆయోగ్ భేటీ ఇది. కాగా, ఇప్పటివరకు జరిగిన సంస్థ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు తీరుపై ఈ సమావేశంలో సమీక్షిస్తారని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. ఇంతకుముందు ప్రధాని మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ గవర్నర్ మండలి నాలుగు సార్లు సమావేశమైంది.


**BEFORE THE HON'BLE DEBT RECOVERY TRIBUNAL -I, 3rd FLOOR, TREVENI COMPLEX, ABIDS AT: HYDERABAD**

O. A. No. 545 of 2018

STATE BANK OF INDIA , Stressed Assets Recovery Branch Hyderabad. .... APPLICANT

AND

M/s. Sri Balaji Saw Mills and 2 others ....DEFENDANTS

To,
Sri G. Srinivas
Son of Sri Ramaswamy, H.No. 8-5-381, Rammandir Area, Godavarikhani, Ramagundam, Karimnagar District, 505209.

Whereas the applicant bank has instituted an application under Section 19 of the Recovery of Debts due to Banks and Financial Institutions Act, 1993against you for recovery of **Rs.41,99,101/-** together with current and future interest and other reliefs and the same posted to **01.07.2019 at 10.30 a.m.** for your appearance. You are hereby required to show cause within 30 days from the date of summons or on the date and time mentioned above either in person or by Advocate duly instructed as to why the relief prayed for should not be granted. Take notice that in case of default, the application will be heard and determined in your absence.

By order of the Hon'ble Debt Recovery Tribunal-I, Hyderabad

**G. Hanumanth Reddy,** Advocate
H.No.2-2-1132/7, Shivam Road, New Nallakunta, Hyderabad-500044, Cell: 9441512916


# ఎవరెస్ట్ అధిరోహకుల మరణాలకు ట్రాఫిక్ జామ్ ఒక్కటే కారణం కాదు

అనారోగ్య సమస్యలు, వాతావరణం

అనుకూలించకపోవడం కూడా కారణాలే: నేపాల్

**కాఠ్మండు, జూన్ 13:** ఈ సీజన్‌లో ఎవరెస్ట్ అధిరోహకులు పలువురు మరణించడానికి శిఖరంలో ట్రాఫిక్ జామ్ కావడం ఒక్కటే కారణం కాదని.. ఎత్తైన ప్రదేశానికి వెళ్లినప్పుడు తలెత్తే అస్వస్థత, ఇతర అనారోగ్య సమస్యలు, వాతావరణం అనుకూలించకపోవడం కూడా కారణాలని నేపాల్ ప్రభుత్వం గురువారం వెల్లడించింది. అంతేగాక మృతుల సంఖ్యను ఒక్కొక్కరు ఒక్కో విధంగా ప్రకటిస్తున్నారని తెలిపింది. ఈ సీజన్‌లో 11 మంది మరణించినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొన్నదని, కానీ ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారని, ఒకరు గల్లంతయ్యారని వివరించింది. ఇందులో పలువురు భారతీయులు కూడా ఉన్నారని పేర్కొంది. అంతర్జాతీయ పర్వతారోహకుల కన్నా భారతీయులే అధికంగా శిఖరాన్ని ఎక్కడానికి దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపింది. మృతుల సంఖ్యపై అనవసరంగా తప్పుడు ప్రచారం చేయవద్దని అంతర్జాతీయ మీడియాను నేపాల్ ప్రభుత్వం కోరింది.



# హాంకాంగ్ ప్రదర్శనలపై చైనా మండిపాటు

**బీజింగ్, జూన్ 13:** వివిధ కేసుల్లో నిందితులను చైనాకు అప్పగించాలని హాంకాంగ్ ప్రవేశపెట్టిన బిల్లుకు వ్యతిరేకంగా అక్కడ జరుగుతున్న ప్రజా నిరసనలను ఆ బిల్లుపై దాడిగా చైనా అభివర్ణించింది. చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గెంగ్ షుయాంగ్ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 'తాజా పరిస్థితులపై హాంకాంగ్ సీఈఓ కారీ లామ్, ఇతర నగర అధికారులు మాతో మాట్లాడారు. అక్కడ నిర్వహించిన ర్యాలీ శాంతిప్రదర్శన కాదు. ఒక ముఠా వ్యవస్థీకృతంగా చేసిన దాడి' అని చెప్పారు. 'హాంకాంగ్ శ్రేయస్సు, సుస్థిరతను తక్కువచేసేందుకు జరిగే ఏ ప్రయత్నమైనా ఆ నగర ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకం. ఈ అంశంలో చట్టానికి లోబడి హాంకాంగ్ ప్రభుత్వానికి మద్దతునిస్తాం' అని తెలిపారు. ఇదిలా ఉంటే హాంకాంగ్‌లో బుధవారం నాటి ప్రదర్శనలో చెలరేగిన హింసతో 79 మందికి గాయాలు కాగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. చైనాకు హాంకాంగ్‌ను అప్పగించాలని 1997లో నిర్ణయించినప్పటి నుంచి హాంకాంగ్‌లో నిరసన కొనసాగుతూనే ఉన్నది. వివాదాస్పద నిందితుల అప్పగింత బిల్లుకు వ్యతిరేకంగా రోడ్లపై బైఠాయించిన ఆందోళనకారులు ఇప్పటికీ వైదొలుగలేదు. ఇదిలా ఉంటే ఆదివారం మరో ప్రదర్శన నిర్వహించనున్నట్లు నిరసనకారులు తెలిపారు.



హాంకాంగ్‌లో పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగిస్తుండటంతో మాస్కులు ధరించి నిరసనలో పాల్గొన్న ఆందోళనకారులు



## 26 ఏళ్లలో 801 మంది పారిశుద్ధ్య కార్మికులు మృతి

**సిమ్లా:** దేశ వ్యాప్తంగా 1993 నుంచి సుమారు 801 మంది పారిశుద్ధ్య కార్మికులు మురుగు కాలువలు శుభ్రం చేస్తుండగా మృతిచెందినట్లు పారిశుద్ధ్య కార్మికుల జాతీయ కమిషన్ ఛైర్మన్ వాలిజిభాయ్ జాలా తెలిపారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ఆరు రోజుల పర్యటన చేపట్టిన ఆయన గురువారం ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీకే అగర్వాల్‌తో సమావేశమయ్యారు.

# నిర్మాణాత్మక చర్యలతోనే శాంతి

బెంగాల్ గవర్నర్ అఖిలపక్ష భేటీలో అంగీకారం

రాష్ట్రంలో శాంతిభద్రతలు విఫలం: బీజేపీ

పరిస్థితిని మరింత దెబ్బ తీసేందుకు బీజేపీ, టీఎంసీ కుట్ర: సీపీఎం

బీజేపీ ఆదేశాల మేరకే గవర్నర్ అఖిలపక్ష భేటీ: మమతాబెనర్జీ ఆరోపణ

**కోల్‌కతా, జూన్ 13:** రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పశ్చిమ బెంగాల్ గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠి గురువారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశం అభిప్రాయపడింది. అయితే దీనిపై సంయుక్త ప్రకటన వెలువడలేదు. రాష్ట్రంలో శాంతి, సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు రాజకీయ పార్టీలు నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలని గవర్నర్ త్రిపాఠి అభిప్రాయ పడ్డారని రాజ్‌భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజాతంత్ర సంస్థలను, విలువలు, హక్కులను కాపాడినప్పుడే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమని అఖిలపక్ష భేటీలో పాల్గొన్న నేతలు అభిప్రాయపడ్డారు. ఎవరూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దని, మీడియా సానుకూలంగా వ్యవహరించినప్పుడే శాంతియుత వాతావరణం నెలకొంటుందని నేతలు చెప్పారని రాజ్‌భవన్ ప్రకటన పేర్కొంది. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తరపున సమావేశానికి హాజరైన రాష్ట్ర మంత్రి పార్థ చటర్జీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై తమ పార్టీ నాయకత్వంతో సంప్రదించాల్సి తమ వైఖరి తెలియజేస్తామని చెప్పినట్లు తెలుస్తున్నది. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయ్‌ప్రకాశ్ మజుందార్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా దెబ్బ తిన్నదన్నారు. సీపీఎం నేత మహమ్మద్ సలీం మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతియుత వాతావరణాన్ని మరింత దెబ్బతీసేందుకు బీజేపీ, టీఎంసీ ప్రయత్నిస్తున్నాయన్నారు. అంతకుముందు సీఎం మమతా బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో హింస పేరుతో బీజేపీకి లబ్ధి చేకూర్చేందుకే గవర్నర్ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారని ఆరోపించారు. 'వారు (గవర్నర్) బీజేపీ అధికార ప్రతినిధి. ఆయనను అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని బీజేపీ కోరింది. అందువల్లే ఆయన ఈ భేటీ ఏర్పాటు చేశారు. మీరు గవర్నర్, నాది ఎన్నికైన ప్రభుత్వం. శాంతిభద్రతల అంశం రాష్ట్రం అంశం. ఇది మీ అంశం కాదు' అని మమతా బెనర్జీ చెప్పారు.

**ఆరోగ్య మంత్రిగా మమత రాజీనామాకు విపక్షాల పట్టు**

దవాఖానల్లో తమకు రక్షణ కల్పించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మె మూడో రోజుకు చేరింది. కోల్‌కతాలోని ఎన్‌ఆర్‌ఎస్ మెడికల్ కాలేజీ దవాఖానలో సోమవారం రాత్రి మరణించిన రోగి కుటుంబ సభ్యులు చేసిన దాడిలో ఒక జూనియర్ డాక్టర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తమకు రక్షణ కల్పించాలని జూనియర్ డాక్టర్లు సమ్మెకు దిగడంతో రాష్ట్ర వ్యాప్తంగా వైద్య సేవలు స్తంభించాయి. కోల్‌కతాలోని రాష్ట్ర ప్రభుత్వ ఎస్‌ఎస్‌కేఎం దవాఖానను గురువారం మధ్యాహ్నం సీఎం మమతా బెనర్జీ సందర్శించారు. మధ్యాహ్నం రెండు గంటల్లోపు విధులకు హాజరు కాకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. జూనియర్ డాక్టర్లకు మమతా బెనర్జీ హెచ్చరికలు జారీ చేయడం పట్ల విపక్షాలు మండిపడ్డాయి. వైద్యారోగ్యశాఖ మంత్రిత్వ బాధ్యతలను ఆమె వదులుకోవాలని డిమాండ్ చేశాయి. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జేపీ మజుందార్ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి బదులు సీఎం మమత విపక్షాలపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సుజన్ చక్రవర్తి మాట్లాడుతూ జూనియర్ డాక్టర్ల సమస్య పరిష్కారంపై సీఎంకు ఆసక్తి లేదని ఆరోపించారు.



గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠి నిర్వహించిన అఖిలపక్ష భేటీలో పాల్గొన్న అధికార, విపక్ష నేతలు


**JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY HYDERABAD**
Kukatpally, Hyderabad - 500 085, Telangana State, India

**CONVENTIONAL TENDER BOX NOTICE**

| Sl. No. | NIT No. & Date | Details of Lease |
| --- | --- | --- |
| 1. | JNTUH/ED/MBD/2456/ 2019-20 Dt: 14.06.2019. | (1) Running of Hostel mess for Boys Hostel (2) Running of Hostel mess for Girls Hostel at JNTUH, College of Engineering, Sulthanpur (V), Pulkal (M), Sangareddy, District. |

Further details available on www.jntuhces.ac.in or www.jntuh.ac.in Sd/- REGISTRAR


# అశ్రు నయనాల మధ్య దార్వేశ్ అంత్యక్రియలు

- యూపీ బార్ కౌన్సిల్ అధ్యక్షురాలి హత్యపై నిరసనల వెల్లువ

**లక్నో:** సహచర న్యాయవాది చేతిలో హత్యకు గురైన ఉత్తరప్రదేశ్ బార్ కౌన్సిల్ (న్యాయవాదుల సంఘం) అధ్యక్షురాలు దార్వేశ్ సింగ్ యాదవ్ అంత్యక్రియలు గురువారం ఆమె స్వగ్రామం చాంద్‌పూర్‌లో నిర్వహించారు. రాష్ట్ర న్యాయశాఖ మంత్రి బ్రిజేశ్ పట్నాయక్ తోపాటు పెద్ద సంఖ్యలో న్యాయవాదులు, ప్రజలు అంత్యక్రియలకు హాజరయ్యారు. మూడ్రోజుల కిందటే బార్ కౌన్సిల్ అధ్యక్షురాలిగా ఎన్నికైన దార్వేశ్ సింగ్ బుధవారం ఆగ్రా సివిల్ కోర్టులో ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమానికి హాజరుకాగా, సహచర న్యాయవాది అయిన మనీశ్ శర్మ ఆమెపై అకస్మాత్తుగా కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. అనంతరం తానూ కాల్చుకుని ఆత్మహత్యకు యత్నించాడు. కోర్టు పరిసరాల్లోనే ఈ ఘటన జరిగిన నేపథ్యంలో కోర్టుల్లో భద్రతను మరింత పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

**'హత్యపై విచారణ జరిపించాలి'**

దార్వేశ్‌సింగ్ హత్యపై విచారణ జరిపించాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ యాదవ అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్, ప్రధానకార్యదర్శి ఓంప్రకాశ్‌యాదవ్ కోరారు.

# వ్యాధిని గుర్తించడంలో గందరగోళం

- ఇప్పటికీ 45 మంది చిన్నారులు చనిపోయినా కొరవడిన స్పష్టత
- బీహార్ ప్రభుత్వంపై విమర్శలు కురిపిస్తున్న వైద్య నిపుణులు

**పాట్నా:** బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో గత మూడు వారాల్లో 45 మంది చిన్న పిల్లలు మరణించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా దేని వల్ల పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారన్న విషయాన్ని కచ్చితంగా తెలుసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం గందరగోళానికి గురవుతున్నదని వైద్య నిపుణులు చెబుతున్నారు. పిల్లల జబ్బు లక్షణాలను బట్టి వారు ఏ వ్యాధితో బాధపడుతున్నారు.. దేనివల్ల చనిపోతున్నారు.. అన్న విషయాన్ని ప్రభుత్వం ఇప్పటికీ గుర్తించలేకపోతున్నదని విమర్శిస్తున్నారు. మెదడువాపు వ్యాధి లక్షణాలతో బాలలు మరణిస్తున్నప్పటికీ అధికారులు ఆ విషయాన్ని అంగీకరించేందుకు నిరాకరిస్తున్నారని, హైపోగ్లైసీమియా అనే వ్యాధి వల్లనే మరణిస్తున్నారని చెబుతున్నారని పేర్కొంటున్నారు.


తెలంగాణ ప్రభుత్వము
పంచాయతీ రాజ్ శాఖ, నిజామాబాద్
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**

**NIT No.62 to 123/2019-20** తేది: 10-06-2019

PR రీజియన్, నిజామాబాద్‌లో మహిళా భవనాలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం మొదలగు పనులు (62) చేపట్టుట కొరకు దిగువ సంతకందారుచే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుతున్నవి. **మొత్తం ECV:** రూ.1677.00 లక్షలు, టెండరు షెడ్యూళ్ళను 13-06-2019న ఉ. 10.30 గంటల నుండి 20-06-2019న మ.3.00 గంటల వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ సైట్ నుండి అప్‌లోడ్ చేయవచ్చును. ఫోన్ నెం. 08462-239502. తదుపరి వివరాల కొరకు **www.tender.telangana.gov.in** దర్శించండి:

సం/- రీజినల్ ఆఫీసర్, PR రీజియన్, నిజామాబాద్

DIPR R.O.No. 297 DP/CL/Advt/1/2019-20 తేది: 13-06-2019

తెలంగాణ ప్రభుత్వము
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ, నిజామాబాద్
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన**

**NIT No. 45,50,52,55,58,76,78,79,83,87-89,100, 101,106-108,110,113,116-118/2018-19/ 3వ & 2వ పిలుపులు.** PH డివిజన్, నిజామాబాద్‌లో సిసి డ్రైయిన్‌లు, రోడ్ల నిర్మాణం, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, సిసి రోడ్లు వేయుట మొదలగు అభివృద్ధి పనులు చేపట్టుట కొరకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుతున్నవి. మొత్తం ECV: రూ.3,11,83,569/-, బిడ్ దాఖలు ప్రారంభ, ముగింపు తేది: 13-06-2019న సాయంత్రం 5 గంటల నుండి 20-06-2019న ఉదయం 11.30 గంటల వరకు. తదుపరి వివరాల కొరకు **www.tender.telangana.gov.in** దర్శించండి:

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, P.H. డివిజన్, నిజామాబాద్

DIPR R.O.No. 300 DP/CL/Advt/1/2019-20 తేది: 13-06-2019

తెలంగాణ ప్రభుత్వము
గిరిజన సంక్షేమం, 5వ అంతస్తు, డిఎస్ఎస్ భవన్, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్
**సవరణ**

**నం. SE/TW/HYD/86 నుండి 93/2019-20 తేది: 20-05-2019 & నం. SE/TW/HYD/94 నుండి 99/2019-20, తేది: 22-05-2019 గల టెండరు ప్రకటనలకు సవరణ.**

**పని పేరు:** నల్గొండ మరియు రంగారెడ్డి జిల్లాల నందు బాలురు మరియు బాలికల కొరకు, గిరిజన భవనాలు మొదలగు వాటి కొరకు TW రెసిడెన్షియల్ స్కూల్స్, పోస్ట్‌మెట్రిక్ హాస్టల్స్ యొక్క నిర్మాణం. ECV మొత్తం: రూ. 2005.00 లక్షలు. బిడ్ దాఖలు ప్రారంభం మరియు ముగింపు తేది: 15-06-2019న సాయంత్రం 5 గంటల నుండి 01-07-2019 మధ్యాహ్నం 3 గంటల వరకు. సాంకేతిక బిడ్ తెరచు తేది: 01-07-2019న సాయంత్రం 4 గంటలకు, వాణిజ్య బిడ్ తెరచు తేది: 03-07-2019న సాయంత్రం 5 గంటలకు. ఫోన్ నెం. 040-23315950, మెయిల్ ఐడి: setwhyd13@gmail.com. తదుపరి వివరాలు https://tender.telangana.gov.in/నుండి పొందవచ్చును.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, గిరిజన సంక్షేమం, హైదరాబాద్

DIPR R.O.No. 298 DP/CL/Advt/1/2019-20 తేది: 13-06-2019

**తెలంగాణా ప్రభుత్వం**
**నీటి పారుదల శాఖ మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ**

ఖమ్మం జిల్లా, నీటిపారుదల శాఖ సర్కిల్ పరిధిలో మిషన్ కాకతీయ -IV లో చెర్వుల మరమ్మత్తు పనులు - ఇ- ప్రొక్యూర్మెంట్ నోటీస్ సంఖ్య 01/2019-20, Dt: 10.06.2019 ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్లు **ది.13.06.2019 సా.5.00** గంటల నుండి **ది. 20.06.2019 సా.4.00** గంటల వరకు లభించును. **ది. 20.06.2019 సా.04.00** గంటల వరకు స్వీకరించబడును.
గమనిక : మిగతా వివరాలకు ఇ- ప్రొక్యూర్మెంట్ మార్కెట్ ప్లేస్ వెబ్‌సైట్‌లో చూడగలరు.

సం/- **కే.ధర్మ,** బి.టెక్
పర్యవేక్షక ఇంజనీర్, ఐ.అండ్ సిఎడిడి.,
నీటి పారుదల విభాగము, ఖమ్మం, సెల్ : 9177306243

తెలంగాణ ప్రభుత్వము
అటవీ శాఖ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
**టెండరు ప్రకటన**

**Rc. No. 123/2019/D1** తేది: 10-06-2019

2019-20 కాల వ్యవధిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వివిధ డివిజన్లలో పని చేయుటకు కాంట్రాక్చువల్ సర్వీసులు/అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన దిగువ సంఖ్య (సుమారుగా) గల సిబ్బంది యొక్క సరఫరా కొరకు జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం ద్వారా ఆమోదం పొందిన లేదా నమోదు చేసుకున్న వ్యక్తుల యొక్క రిజిస్టర్డ్ ఏజెన్సీల నుండి సీల్డు టెండర్లు కోరబడుతున్నవి. 1) బేస్ క్యాంప్ వాచర్స్, 2) స్ట్రైక్ ఫోర్స్ వాచర్స్, 3) చెక్ పోస్ట్ వాచర్స్, 4) డ్రైవర్లు, 5) డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్స్, 6) డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 7) టెక్నికల్ అసిస్టెంట్లు. మొత్తం ఉద్యోగాల సంఖ్య (223), డి.డి. ద్వారా రూ. 500/-లు యొక్క చెల్లింపుపై తేది: 14-06-2019న ఉదయం 10.30 గంటల నుండి తేది: 25-06-2019న మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యాలయం నుండి టెండరు షెడ్యూళ్ళు మరియు నిబంధనలను పొందవచ్చు. తేది: 25-06-2019న మధ్యాహ్నం 3 గంటల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడతాయి మరియు అదేరోజు సాయంత్రం 4 గంటలకు తెరువబడతాయి. తదుపరి వివరాలన్నీ దిగువ సంతకందారు నుండి పొందవచ్చు. సంప్ర: ఫోన్ నెం. 9849405993

సం/- జిల్లా అటవీ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

DIPR R.O.No. 292 DP/CL/Advt/1/2019-20 తేది: 13-06-2019

**పర్యవేక్షక ఇంజినీరు కార్యాలయం**
**తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ & వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్:: హైదరాబాద్**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన**

**Tender Notice No. SE/TSEWIDC/HYD/NIT/ 40 to 76/2019-20** తేది: 11-06-2019

తెలంగాణ రాష్ట్రంలో కమ్యూనిటీ హాళ్ళు, KGBV బిల్డింగులు, DIET బిల్డింగ్, మైనారిటీ పనులు, మోడల్ స్కూళ్ళు, TSWRS పనులు, విద్యుత్తు పనులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ZPHS పనులు వగైరా (36 పనులు) నిర్మించుటకు అర్హతగల కాంట్రాక్టర్లు అందరి నుండి టెండర్లు కోరడమైనది. అంచనా వ్యయము (రూ. 6.00 లక్షల నుండి 450.80 లక్షల వరకు) (1-వ పిలుపు, 2వ పిలుపు, 3వ పిలుపు మరియు 4-వ పిలుపు) ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలు మరియు స్వీకరణకు చివరి తేది: 28-06-2019, సా. 4.00గం. వరకు. గమనిక: స్టీలు మరియు సిమెంట్ కొరకు మాత్రమే G.O.M.S No.94, రవాణా, రోడ్డు మరియు భవనాలు (R.1) శాఖ, తేది: 16-04-08 ప్రకారంగా ధర సర్దుబాటు వర్తించును. పూర్తి వివరాలను https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చు లేదా పర్యవేక్షక ఇంజినీరు, TSEWIDC, 3వ బ్లాకు, 4వ అంతస్తు, రాజీవ్ విద్యామిషన్ భవనము, SCERT కాంపౌండు, E-గేటు ఎదురుగా, L.B. స్టేడియం, హైదరాబాద్ వద్ద స్వయంగా సంప్రదించవచ్చును. ఫోన్ నం. 23326692.

సం/- పర్యవేక్షక ఇంజినీరు, TSEWIDC, హైదరాబాద్

DIPR RO No.150-pp/CL/Advt/1/2019-20, Dt: 13/6/2019

**తెలంగాణ ప్రభుత్వం**
**తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (TREIRB)**
**డిగ్రీ కాలేజ్ లెక్చరర్ల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొరకు ప్రకటన**

DL ఉద్యోగాల కొరకు 2వ బ్యాచ్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ బుద్ధ భవన్, రాణిగంజ్ హైదరాబాద్ వద్ద 18-06-2019 నుండి ప్రారంభమవుతుందని తెలియజేయడమైనది. అభ్యర్థుల హాల్ టికెట్ నంబర్లు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొరకు తీసుకొనబడినవి మరియు సబ్జెక్ట్ వారీగా DLs సర్టిఫికెట్ వెరిఫికేషన్ తేదీలు పోర్టల్ **www.treirb.telangana.gov.in**లో లభిస్తాయి.
సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొరకు ఎవరైనా అభ్యర్థి హాజరు కాకపోతే, అతను/ఆమె తదుపరి ఎంపిక ప్రక్రియ కొరకు అన్ని హక్కులను కోల్పోతారు. వెరిఫికేషన్, సెంటర్ వివరాల కొరకు సెల్ నం. 8309436806పై క్యాంప్ ఇన్‌చార్జ్‌ను సంప్రదించండి.

సం/- చైర్మన్, TREIRB, హైదరాబాద్

DIPR R.O. No. 151-pp/CL/Advt/1/2019-20, Dt: 13-06-2019


'ఎమ్మెల్సీల సభ్యత్వం రద్దు'పై

# తీర్పు రిజర్వ్

అనర్హత కేసుల్లో ముగిసిన వాదనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎమ్మెల్సీలుగా తమపై అనర్హతవేటు వేయడాన్ని సవాల్ చేస్తూ ఎమ్మెల్సీలు భూపతిరెడ్డి, యాదవరెడ్డి, రాములు నాయక్ దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వ్ చేస్తున్నట్టు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం ప్రకటించింది. అంతకుముందు రాములునాయక్ అనర్హతపై అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) జే రాంచంద్రరావు వాదనలు వినిపించారు. టీఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వం ఉన్నదని రాములునాయక్ స్వయంగా అంగీకరించారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికయ్యేటప్పుడు సమర్పించిన అఫిడవిట్‌లో టీఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వం ఉన్నదని పేర్కొన్నారని తెలిపారు. గవర్నర్ కోటాలో నామినేట్ అయిన రాములునాయక్ ఎమ్మెల్సీగా ప్రమాణం చేసేటప్పుడు టీఆర్‌ఎస్ కండువా కప్పుకొన్నారని చెప్పిన ఏఏజీ.. ఆ చిత్రాలను ధర్మాసనానికి సమర్పించారు. 2001 నుంచి టీఆర్‌ఎస్ సభ్యుడిగా ఉన్న రాములునాయక్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా పనిచేశారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఢిల్లీకి వెళ్లి రాహుల్‌గాంధీని కలిశారని తెలిపారు. రాజ్యాంగంలోని షెడ్యూల్ 10 స్పీకర్ లేదా చైర్మన్‌కు దఖలుపర్చిన అధికారాల ప్రకారం చట్టసభకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్న చైర్మన్ తాను వ్యక్తిగతంగా నమ్మినదాని ప్రకారం నిర్ణయం తీసుకోవచ్చని చెప్పారు. మండలిలో టీఆర్‌ఎస్ విప్‌ల తరపున న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపించారు. మరోవైపు రాములునాయక్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ అనర్హతపై తమ వివరణ ఇవ్వడానికి తగిన సమయం ఇవ్వకుండా చైర్మన్ నిర్ణయం వెలువరించారని పేర్కొన్నారు.

# కొత్త జిల్లాలతో పరిపాలన సౌలభ్యం

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్
- మంత్రి కొప్పులతో కలిసి పెద్దపల్లి కలెక్టర్, జేసీ క్యాంపు కార్యాలయాల ప్రారంభం

**పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ/ కలెక్టరేట్ :** కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రజల చెంతకు పాలన తీసుకొచ్చామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం సమీపంలోని పెద్దకల్వల వద్ద నిర్మించిన కలెక్టర్, జేసీ క్యాంపు కార్యాలయాలను సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ఈటల గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ తెలంగాణలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని భావించిన సీఎం కేసీఆర్, 33 జిల్లాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కొత్త జిల్లాల్లో సకల హంగులతో కలెక్టరేట్ భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రజల వద్దకే పరిపాలన వచ్చిందన్నారు. ఆగస్టు లోగా కలెక్టరేట్ భవన సముదాయ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టరేట్ నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రులు ఈశ్వర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు, ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్, ఎమ్మెల్సీలు భాను ప్రసాద్ రావు, నారదాసు లక్ష్మణ్ రావు, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్ రెడ్డి, కలెక్టర్ శ్రీదేవసేన తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లి కలెక్టర్ క్యాంపు కార్యాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్

# కార్పొరేట్ కళతో సర్కారు దవాఖానలు

తెలంగాణలో ప్రభుత్వ వైద్యం కొత్త పుంతలు

రోగులకు మెరుగైన సౌకర్యాల కల్పన

ఐసీయూల్లో పెరుగుతున్న అత్యవసర సేవలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని సర్కారు దవాఖానలకు కార్పొరేట్ కళ సంతరించుకొన్నది. రోగులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడంతోపాటు అత్యవసర వైద్యసేవల విస్తరణలోనూ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. దవాఖానల్లోని వార్డులు, ఓపీ విభాగాలను సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు అత్యవసర వైద్యసేవలు అందించే ఐసీయూలను మెరుగుపర్చడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్యం అందుతున్నది. సర్కారు దవాఖానల్లో అధునాతన సౌకర్యాలతో కార్పొరేట్ తరహా వైద్యసేవలు అందిస్తున్నారు. దాంతో ప్రజల్లో ప్రభుత్వ దవాఖానల పట్ల విశ్వాసం పెరుగుతున్నది. అన్ని జిల్లా హాస్పిటల్స్‌లో నవజాత శిశువుల సంరక్షణ కోసం ప్రత్యేక యూనిట్లను ఏర్పాటుచేస్తూ చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడే చర్యలు చేపట్టారు. ఇందులోభాగంగా నీలోఫర్ దవాఖానలో ఏర్పాటుచేసిన ఇంటెన్సివ్‌కేర్ బ్లాక్‌ను దేశంలోనే నంబర్ వన్ విభాగంగా తీర్చిదిద్దారు. చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 22 ఎస్‌ఎన్‌సీయూలు, 61ఎన్‌బీఎస్‌యూ, 562 ఎన్‌బీసీసీలను ఏర్పాటుచేసింది. మరో 6 ఎస్‌ఎన్‌సీయూల నిర్మాణం పూర్తిచేసి త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నారు. ఎస్‌ఎన్‌సీయూ సిబ్బందికి ఎఫ్‌బీఎన్‌సీ శిక్షణ అందించి అంతర్జాతీయ ప్రమాణాలతో చిన్నారులకు వైద్యం, వైద్యశాలల్లో వసతులు కల్పించారు.

**అలంకరణ..ఆధునీకరణ**

సర్కారు దవాఖానలను ఆధునీకరించడంలో తెలంగాణ సర్కారు కొత్త విధానాన్ని అవలంబిస్తున్నది. మలక్‌పేట ఏరియా దవాఖానలోని వార్డులను అందంగా తీర్చిదిద్దారు. ప్రవేశద్వారం వద్ద బొమ్మల ఏర్పాటు, వివిధ రంగులతో అలంకరణ, విద్యుద్దీపాల ఏర్పాటు.. ఇలా కార్పొరేట్‌స్థాయిలో ఆకర్షించేలా తీర్చిదిద్దారు. అన్ని వార్డుల్లోనూ బెడ్ల ఏర్పాటు, ఇతర సామాగ్రి కూడా అందుబాటులో ఉంచారు. కింగ్ కోఠి లోని జిల్లా దవాఖానలో రూ.2 కోట్ల నిధులతో ఆధునీకరణ పనులు చేపట్టారు. ముఖద్వారం వద్దకు రాగానే కార్పొరేట్ దవాఖానలోకి వెళ్తున్నట్టుగా అనిపిస్తుంది. ఓపీలో కుర్చీల ఏర్పాటు, మందులు అందించేందుకు ప్రత్యేక కౌంటర్లు, అద్దాల ఏర్పాటు వంటి వాటితో కింగ్ కోఠి దవాఖానా అందరినీ ఆకర్షిస్తున్నది.

**మెరుగ్గా ఐసీయూ సేవలు**

అన్ని జిల్లా కేంద్ర దవాఖానల్లో ఐసీయూలను అధునాతన సౌకర్యాలతో ఏర్పాటుచేయడంతో అత్యవసర వైద్యసేవల కోసం జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే రోగుల సంఖ్య ఏటా తగ్గుతున్నది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర దవాఖాన ఐసీయూలో అధునాతన సౌకర్యాలు కల్పించడంతో పేద, మధ్యతరగతివారు అత్యవసర చికిత్స కోసం కార్పొరేట్ హాస్పిటల్స్ వైపు చూడాల్సిన అవసరం లేకుండా పోయింది. అదేవిధంగా అన్ని జిల్లా కేంద్ర దవాఖానలు కూడా అధునాతన పరికరాలతో కార్పొరేట్ ఆసుపత్రులను మరిపిస్తున్నాయి.

## భారత్‌కు సొంతంగా
# అంతరిక్ష కేంద్రం

- ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఇస్రో ప్రకటన
- గగన్‌యాన్ తర్వాత దృష్టి సారిస్తామన్న చైర్మన్ శివన్



**న్యూఢిల్లీ:** మనదేశానికి సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించనున్నట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సంచలన ప్రకటన చేసింది. గగన్‌యాన్ తర్వాత ఈ ప్రాజెక్టును చేపట్టనున్నది. గురువారం ఇస్రో చైర్మన్ కే శివన్ మీడియాతో మాట్లాడుతూ సంస్థ ప్రణాళికలు వివరించారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో భారత్ చేరబోదని స్పష్టంచేశారు. వచ్చే నెల 15న జరుపనున్న చంద్రయాన్-2 ప్రయోగంపైనే ప్రస్తుతం తమ దృష్టి మొత్తం కేంద్రీకృతమై ఉన్నదన్నారు. ఆ తర్వాత మొదటి మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'పై దృష్టిపెడుతామన్నారు. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు పూర్తిచేసుకోబోతున్న సందర్భంగా 2022లో గగన్‌యాన్ మిషన్‌ను చేపట్టనున్నారు. దీనికి కొనసాగింపుగా భారత్‌కు సొంతగా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించాలని నిర్ణయించినట్టు శివన్ వెల్లడించారు. గగన్‌యాన్ అనంతరం 5-7 ఏండ్లలో ఇది సాకారం కావొచ్చన్నారు. స్పేస్ స్టేషన్ చిన్నగా ఓ మాడ్యూల్ రూపంలో ఉంటుందని, ఇందులో మైక్రోగ్రావిటీపై పరిశోధనలు జరుపుతామన్నారు. ఎంత వ్యయం అవుతుందో ఇంకా అంచనా వేయలేదని చెప్పారు. వచ్చే 2-3 ఏండ్లలో శుక్రుడిపైకి ఉపగ్రహాన్ని పంపనున్నట్లు తెలిపారు.



## అంతరిక్ష ప్రయోగ వేదిక ఐఎస్ఎస్

**విశ్వంపై పరిశోధనలకు అంతరిక్షంలో స్పేస్ స్టేషన్ల నిర్మాణం ఏండ్ల తరబడి సాగుతున్నది. ఇప్పటివరకు 9 స్పేస్‌స్టేషన్లు నిర్మించారు. వాటిలో 8 విఫలం కాగా.. 9వదైన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) విజయవంతంగా కొనసాగుతున్నది. దీనిని అమెరికా, రష్యా సంయుక్తంగా నిర్మించాయి. ఐఎస్ఎస్ ఇటీవలే 20 ఏండ్లు పూర్తిచేసుకున్నది. ఇది అంతరిక్షంలోని ప్రయోగశాల. విశ్వంలో ప్రయోగాలకు వేదిక. రోదసిని గమనించే ఒక అబ్జర్వేటరీ. భవిష్యత్‌లో చంద్రుడితోపాటు అంగారకుడిపైకి చేపట్టే మానవ సహిత అంతరిక్ష యాత్రలకు స్పేస్ స్టేషన్ తొలి మజిలీగా, తాత్కాలిక విశ్రాంతి స్థలమవుతుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.**

### 20 ఏండ్లుగా సేవలు..

ఐఎస్ఎస్ 20 ఏండ్లుగా సేవలు అందిస్తున్నది. 1998 నవంబర్ 20న రష్యాలోని బైకనూర్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి దీన్ని విశ్వంలోకి పంపారు. మొదట్లో 41 అడుగుల పొడవైన మాడ్యూల్(చిన్న గది) రూపంలో ఉన్న దీన్ని ఇప్పటి రూపం లోకి తేవడానికి పదేండ్లలో 30 అంతరిక్ష యాత్రలు జరిపారు. ప్రసుతం దీని పొడవు 72.8 మీటర్లు. వెడల్పు 108.5 మీటర్లు. ఎత్తు 20 మీటర్లు. బరువు దాదాపు 454 టన్నులు.



### రోజుకు 16 ప్రదక్షిణలు

భూమికి 278 నుండి 460 కి.మీ.ల ఎత్తులోని కక్ష్యలో ఐఎస్ఎస్ తిరుగుతున్నది. సగటున గంటకు 27,743 కి.మీ.ల వేగంతో భూమి చుట్టూ పరిభ్రమిస్తున్నది. 90 నిమిషాలకు ఒక పరిభ్రమణం చొప్పున రోజుకు దాదాపు 16 సార్లు భూమిని చుట్టివస్తున్నది. ఈ ఏడాది మే చివరి నాటికి ఇప్పటివరకు మొత్తం 116,178 ప్రదక్షిణలు పూర్తిచేసింది.

### ఆరుగురు నివసించొచ్చు

ఐఎస్ఎస్‌లో వ్యోమగాములు నివసించడం 2000 నవంబర్‌లో ప్రారంభమైంది. ఇందులో అయిదు పడకగదులు ఉన్నాయి. ఆరుగురు వ్యోమగాములు నివసించేలా సదుపాయాలను కల్పించారు. ప్రస్తుతం ఆరుగురు వ్యోమగాములు నివసిస్తున్నారు.

### రోదసి ప్రయోగశాల



ఐఎస్ఎస్ ఒక అంతరిక్ష ప్రయోగశాల వంటిది. ఇక్కడ విశ్వంపై పరిశోధనలతోపాటు జీవ శాస్త్రం, శరీరధర్మశాస్త్రం, భౌతికశాస్త్రం వంటి అనేక విభాగాలు, వాతావరణానికి సంబంధించిన అనేక అంశాలపై పరిశోధనలు నిర్వహిస్తున్నారు. భూవాతావరణంతోపాటు విశ్వాన్ని నిరంతరం గమనిస్తూ ఉండవచ్చు.



### 15 దేశాలకు భాగస్వామ్యం

ఐఎస్ఎస్‌లో మొత్తం 15 దేశాలకు భాగస్వామ్యం ఉన్నది. ఐదు అంతరిక్ష పరిశోధన సంస్థలు దీనిని నిర్వహిస్తున్నాయి. అమెరికా 'నాసా'తోపాటు రష్యా రొస్కాస్మోస్, జపాన్‌కు చెందిన జాక్సా, యూరప్‌కు చెందిన ఈఎస్ఏ, కెనడాకు చెందిన సీఎస్ఏ దీనిని నిర్వహిస్తున్నాయి.

### 2030తో ముగింపు

షెడ్యూల్ ప్రకారం ఐఎస్ఎస్ జీవితకాలం 2030తో ముగియనున్నది. భూమి నుంచి వస్తువులు, పరికరాల సరఫరాను 2025తో నిలిపివేయనున్నారు. ఐఎస్ఎస్‌పై పెట్టుబడి పెట్టడాన్ని 2024లో నిలిపివేస్తామని రష్యా, 2025లో నిలిపివేస్తామని అమెరికా ప్రకటించాయి.

# ఆ 13 మంది మరణించారు

## ఏఎన్-32 విమానం ప్రమాదంలో అందరూ మృత్యువాత



**న్యూఢిల్లీ, జూన్ 13:** భారత వాయుసేన విమానం ఏఎన్-32లో ప్రయాణించిన మొత్తం 13 మంది మరణించారు. వారి మృతదేహాలను గాలింపు సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల అసోంలోని జోర్హాట్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌లోని మెచుకాకు ఈ విమానం బయలుదేరగా గాలిలోకి ఎగిరిన అర్ధగంటకే గల్లంతయ్యింది. దీంతో దీని ఆచూకీని కనుగొనడానికి వాయుసేన యుద్ధ విమానాలు, సైనికులు రంగంలోకి దిగి దాదాపు వారం రోజుల తర్వాత విమానం శకలాలలను అరుణాచల్‌ప్రదేశ్‌లో గుర్తించారు. విమానం కూలిన ప్రదేశానికి గురువారం చేరుకున్న వాయుసేన సిబ్బందికి విమానంలో ప్రయాణించిన ఒక్కరూ కూడా కనిపించలేదు. దీంతో విమానంలో ప్రయాణించిన మొత్తం 13 మంది మరణించారని భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ప్రకటించింది. 'ఈ నెల 3న జరిగిన ఏఎన్-32 విమానం ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 13 మందికి నివాళులర్పిస్తున్నాం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాం. కష్టసమయంలో వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటాం' అని ఐఏఎఫ్ పేర్కొంది. మరణించిన వారిలో వింగ్ కమాండర్ జీఎం చార్లెస్, స్క్వాడ్రన్ నాయకుడు హెచ్ వినోద్, విమానం లెఫ్టినెంట్లు ఎల్ఆర్ థాప, ఎంకే గార్గ్, సార్జెంట్ అనూప్‌కుమార్, కార్పొరల్ షిరిన్, ల్యాండింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ మ్యాన్ ఎస్కే సింగ్, పంకజ్, రాజేశ్‌కుమార్, పుతాలి తదితరులు ఉన్నట్లు తెలిపింది.

## ఇజ్రాయెల్‌కు అనుకూలంగా
# భారత్ ఓటు

### మోదీకి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కృతజ్ఞతలు

**జెరూసలేం:** ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక మండలి (ఈసీవోఎస్వోసీ)లో పాలస్తీనా గ్రూప్‌కు కన్సల్టేటివ్ హోదా కల్పించరాదన్న తమ వాదనకు మద్దతుగా భారత్ ఓటేసినందుకు భారత్ ప్రధాని మోదీకి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమెన్ నెతన్యాహు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల ఆరో తేదీన 'ఈసీవోఎస్వోసీ'లో పాలస్తీనా స్వచ్ఛంద సంస్థ 'షాహిద్'కు పరిశీలక హోదా కల్పించరాదని ఇజ్రాయెల్ ప్రవేశపెట్టిన తీర్మానానికి భారత్ అనుకూలంగా ఓటేసింది. పాలస్తీనా ఉగ్రవాద సంస్థ హమస్‌తో తన సంబంధాలను 'షాహిద్' బహిర్గతం చేయడం లేదని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఐరాసలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా భారత్ ఓటేయడం ఇదే మొదటిసారి.

# మోదీ హైతో.. ముమ్‌కిన్ హై

### బీజేపీ ఎన్నికల నినాదాన్ని ఉటంకించిన అమెరికా విదేశాంగ మంత్రి



**వాషింగ్టన్:** మోదీ మరోసారి భారత ప్రధానిగా అధికారం చేపట్టిన నేపథ్యంలో భారత్ అమెరికా వ్యూహాత్మక సంబంధాలు బలోపేతం అవుతాయని అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో ఆశాభావం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో 'మోదీ హైతో ముమ్‌కిన్ హై'(మోదీ ఉంటేనే.. సాధ్యం అవుతుంది) అన్న బీజేపీ నినాదాన్ని ఆయన ఉటంకించారు. 'అమెరికా భారత వ్యాపార మండలి' ఆధ్వర్యంలో బుధవారం వాషింగ్టన్‌లో జరిగిన ఇండియా ఐడియాస్ సమిట్‌లో పాంపియో ప్రసంగిస్తూ పై వ్యాఖ్య చేశారు. ఈ నెల 24 నుంచి 30 వరకు తన భారత్, శ్రీలంక, జపాన్, దక్షిణ కొరియా దేశాల పర్యటన గురించి ప్రస్తావించారు. భారత్ పర్యటనలో ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో సమావేశమవుతానన్నారు. తమ అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలో రక్షణ సహకారాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని నిర్ణయించామని తెలిపారు. అందుకే ఉగ్రవాదానికి మద్దతిస్తున్న పాకిస్థాన్‌పై కఠిన వైఖరి అవలంబిస్తున్నామని స్పష్టం చేశారు. రక్షణ ఉత్పత్తుల కోసం రష్యా, చమురు కోసం ఇరాన్, వెనెజులపై తమ స్నేహ దేశమైన భారత్ ఆధారపడకూడదని పరోక్షంగా సూచించారు.

# గుజరాత్‌కు తప్పిన ముప్పు

## దిశ మార్చుకున్న తుఫాన్.. ఒమన్‌వైపు పయనం

### గుజరాత్ తీరప్రాంతాలకు భారీ వర్ష సూచన
### రాష్ట్రంలో కొనసాగుతున్న హై అలర్ట్

**అహ్మదాబాద్/న్యూఢిల్లీ, జూన్ 13:** గుజరాత్‌కు 'వాయు'గండం తప్పింది. వాయు తుఫాన్ దిశను మార్చుకుని ఆ రాష్ట్ర తీరం నుంచి ఒమన్‌వైపు కదులుతున్నట్లు అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ తీర ప్రాంతాలకు పెనుగాలులు, భారీ వర్షాల నుంచి ముప్పు పొంచి ఉందని చెప్పారు. తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే తీర ప్రాంతాల నుంచి 3 లక్షల మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మాట్లాడుతూ.. 'భారత వాతావరణ విభాగం(ఐఎండీ) బులెటిన్ ప్రకారం.. వాయు తుఫాన్ దిశను మార్చుకుని ఒమన్ దిశగా కదులుతున్నది. అయినప్పటికీ వచ్చే 24 గంటలపాటు హై అలర్ట్ కొనసాగుతుంది' అని తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా సౌరాష్ట్రలోని తీర ప్రాంత జిల్లాలతోపాటు కచ్‌లో శుక్రవారం కూడా పాఠశాలలను మూసివేయనున్నట్లు చెప్పారు.

**తుఫాన్‌పై ప్రధాని ఆరా**

తీర ప్రాంతాల్లో డజను తాలూకాల్లో గురువారం ఉదయం నుంచి ఒక ఇంచుకుపైగా వర్షపాతం నమోదైందని గుజరాత్ ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొనేందుకు కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌కు చేరుకున్న వెంటనే ప్రధాని మోదీ తుఫాన్ పరిస్థితిపై ఆరా తీసినట్లు అందులో పేర్కొంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రూపానీతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపింది. '900 కి.మీ మేర తుఫాన్ విస్తరించి ఉంది. ఇప్పటికీ ప్రమాదం పొంచి ఉంది. తీర ప్రాంతాలపై పెనుగాలుల ప్రభావం ఉండనుంది. తుఫాన్ ప్రభావం ముఖ్యం.. తీరం దాటడం కాదు. వచ్చే 48 గంటలపాటు రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తంగా ఉంటుంది' అని రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పంకజ్ కుమార్ తెలిపారు. తీరప్రాంతాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించామని, 9వ నంబర్ ప్రమాద హెచ్చరిక సంకేతాలను ఎగురవేయాలని అన్ని పోర్టులను కోరామని ఆయన చెప్పారు. తుఫాన్ ప్రభావంతో పలు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాగా, పెనుగాలులు, భారీ వర్షాల ధాటికి పోర్‌బందర్‌లోని 150 ఏండ్ల నాటి భటేశ్వర్ మహదేవ్ ఆలయం కూలిపోయింది.

**రంగంలోకి సహాయక బృందాలు**

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం సిబ్బంది గుజరాత్‌కు చేరుకున్నారు. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్డీఆర్ఎఫ్)కు చెందిన 33 బృందాలను, తొమ్మిది రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలను 10 జిల్లాలకు పంపించామని అధికారులు తెలిపారు. ఒక్కో ఎన్డీఆర్ఎఫ్ బృందంలో 90-100 మంది సిబ్బంది ఉన్నట్టు చెప్పారు. వీరితోపాటు సైన్యం నుంచి 11 బృందాలు (ఒక్కో యూనిట్‌లో 70 మంది చొప్పున), రెండు కంపెనీల బీఎస్సెఫ్ జవాన్లు, 14 కంపెనీల స్టేట్ రిజర్వ్ పోలీస్, 300 కమెండోలను ప్రభావిత ప్రాంతాలకు పంపినట్టు పేర్కొన్నారు. తుఫాన్ నేపథ్యంలో అన్ని ఓడరేవులు, తీర ప్రాంతానికి సమీపంలోని విమానాశ్రయాలను మూసివేస్తున్నట్లు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అలాగే రైల్వే కూడా 86 రైళ్లను రద్దు చేయగా, 37 రైళ్లను పాక్షికంగా రద్దు చేసింది. తుఫాన్ దిశను మార్చుకున్నప్పటికీ ముందు జాగ్రత్త చర్యగా రైళ్లను రద్దు చేసినట్లు పశ్చిమరైల్వే తెలిపింది.





తుఫాన్ నేపథ్యంలో గుజరాత్‌లోని వెరావల్ పోర్టులో నిలిపి ఉంచిన బోట్లు

### అప్రమత్తమైన అధికార యంత్రాంగం

తుఫాన్‌పై గురువారం సాయంత్రం గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ సమీక్ష నిర్వహించారు. తుఫాన్ గండం తప్పినప్పటికీ, తీరప్రాంతాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాన్ కొంత సమయం పాటు ఉత్తర వాయవ్య దిశగా పయనించి, అనంతరం వాయవ్య దిశగా సౌరాష్ట్ర తీరం గుండా పయనించే అవకాశం ఉందని అంతకుముందు ఐఎండీ తెలిపింది. గిర్ సోమ్‌నాథ్, డయ్యూ, జునాగఢ్, పోర్‌బందర్, ద్వారక ప్రాంతాలపై తుఫాన్ ప్రభావం ఉంటుందని పేర్కొంది. రానున్న 12 గంటల పాటు 110 కి.మీ వేగంతో పెనుగాలులు వీస్తాయని వివరించింది. 'తుఫాన్ దిశను మార్చుకుని తీరం నుంచి దూరంగా కదులుతున్నప్పటికీ, పెనుగాలులు, భారీ వర్షాల రూపంలో ముప్పు పొంచి ఉన్నది. ప్రస్తుతానికి మేము ఎలాంటి ముప్పు లేదని ప్రకటించడం లేదు. శుక్రవారం ఉదయం వరకు మా చర్యలు కొనసాగుతాయి' అని గుజరాత్ ప్రధాన కార్యదర్శి జేఎన్ సింగ్ తెలిపారు.

# టార్గెట్ కేరళ, బెంగాల్

### పార్టీ ఆఫీస్ బేరర్ల భేటీలో బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా వెల్లడి

**న్యూఢిల్లీ:** కేరళ, పశ్చిమ బెంగాల్‌లలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసినప్పుడే పార్టీ అత్యున్నత శిఖరాలకు చేరినట్లవుతుందని బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా అన్నారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించినా పార్టీ ఇంకా శిఖరాగ్రానికి చేరుకోలేదన్నారు. నూతన ప్రాంతాలకు విస్తరించడంతోపాటు మరిన్ని వర్గాల ప్రజల మనస్సుల్లో చోటు సంపాదించుకునేందుకు పార్టీ కృషి చేయాలన్నారు. గురువారం అమిత్‌షా పార్టీ జాతీయ ఆఫీస్ బేరర్లు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. పార్టీ సభ్యత్వాన్ని మరో 20 శాతం పెంపొందించాలని లక్ష్యంగా నిర్దేశించారు. బీజేపీ వ్యవస్థాపకుడు శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా వచ్చేనెల ఆరో తేదీ నుంచి సభ్యత్వ డ్రైవ్ చేపట్టనున్నట్లు బీజేపీ ప్రధాన కార్యదర్శి భూపేందర్ యాదవ్ మీడియాకు తెలిపారు. ఇదిలా ఉంటే పార్టీ సంస్థాగత ఎన్నికలు ముగిసే వరకు బీజేపీ అధ్యక్షుడిగా అమిత్‌షా కొనసాగుతారని సమాచారం. బీజేపీ సంస్థాగత ఎన్నికలు పూర్తి కావడానికి కొన్ని నెలలు పట్టే అవకాశం ఉన్నది. ప్రధానంగా హర్యానా, జార్ఖండ్, మహారాష్ట్ర రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరిగే నాటికి బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ముగిసే అవకాశం ఉన్నట్లు సమాచారం.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అమిత్ షా

# నెలకు 100తో రైతు పింఛన్ పథకం

- దేశ వ్యాప్తంగా అవగాహన కల్పించండి
- రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర మంత్రి తోమర్ పిలుపు
- వ్యవసాయశాఖ మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి రైతు పింఛన్ పథకం కింద నెలకు రూ.100 రైతులు తమ వంతుగా జమచేయాల్సి ఉంటుందని, దీంతో వారికి 60 ఏండ్ల నుంచి నెలకు కనీసం రూ.3000 పింఛన్ అందుతుందని కేంద్రం స్పష్టం చేసింది. ఎల్ఐసీ నిర్వహించే ఈ పింఛన్ ఫండ్‌లో కేంద్రం కూడా రూ.100 తనవంతుగా జమ చేస్తుందన్నది. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన తొలి క్యాబినెట్ సమావేశంలో రైతుల కోసం ప్రత్యేక పింఛన్ పథకానికి ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ పథకం కింద తొలి మూడేండ్లలో 5 కోట్ల మంది రైతులకు లబ్ధిచేకూర్చేందుకు ప్రభుత్వంపై ఏడాదికి రూ.10,774 కోట్ల భారం పడనుంది. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ గురువారం అన్ని రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ పథకం కోసం 18 నుంచి 40 ఏండ్ల మధ్య వయస్కులైన రైతుల వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ పథకం పట్ల రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు.

**పీఎం కిసాన్ పథకం నమోదును వేగవంతం చేయండి**

మరోవైపు ప్రధాన మంత్రి కిసాన్ పథకం నమోదును వేగవంతం చేయాలని కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ అన్ని రాష్ట్రాల వ్యవసాయ మంత్రులను కోరారు. మూడు విడుతల్లో రూ.2000 చొప్పున ఏడాదికి రూ.6000 సకాలంలో రైతులకు చెల్లించేందుకు అర్హులైన వారి వివరాలను నిర్దేశిత సమయంలో పంపాలన్నారు. ఏప్రిల్-జూలై మధ్య రూ.2000 నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. తొలి విడుత 3.3 కోట్ల మంది రైతులు, రెండో విడుతలో 2.7 కోట్ల మంది రైతులకు నగదు చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద ఏడాదికి రూ.87,000 కోట్ల వ్యయం కానున్నదని నరేంద్ర సింగ్ చెప్పారు. రైతు రుణ కార్డు పథకం కింద వంద రోజుల్లో కోటి మంది రైతులు నమోదయ్యేలా గ్రామస్థాయిలో ప్రచారం చేసి అవగాహన కల్పించాలని రాష్ట్రాలకు సూచించారు. పాడిపారిశ్రమ, చేపల పెంపకందారులకూ రైతు రుణ కార్డు పథకం సౌకర్యం కల్పించిన సంగతి తెలిసిందే.

# జిన్‌పింగ్‌తో మోదీ భేటీ

### భారత్, చైనా ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు
### ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలు బలోపేతం చేసుకోవాలని నిర్ణయం
### రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ సమావేశం
### ఎస్సీవో సదస్సు సందర్భంగా మోదీ బిజీబిజీ

**బిష్కెక్:** కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) సదస్సు సందర్భంగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని నరేంద్రమోదీ గురువారం సమావేశమయ్యారు. జిన్‌పింగ్‌తో భేటీ అత్యంత ఫలప్రదంగా సాగిందని ప్రధాని వెల్లడించారు. ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలు బలోపేతం చేసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. మోదీ రెండోసారి ప్రధానిగా ఎన్నికైన తర్వాత ఇరువురు నేతలు భేటీ కావడం ఇదే మొదటిసారి. ఎన్నికల్లో ఘన విజయం సాధించడంపై మోదీకి ఈ సందర్భంగా జిన్‌పింగ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందుకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ నెల 15న 66వ పడిలోకి అడుగుపెడుతున్న జిన్‌పింగ్‌కు భారత ప్రజల తరపున జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. 'ఉహాన్‌లో మన సమావేశం తర్వాత, ఇరు దేశాల మధ్య సంబంధాల్లో వేగం, స్థిరత్వం పెరిగింది. వ్యూహాత్మక సంబంధాల్లో గణనీయ పురోగతి చోటుచేసుకుంది. పరస్పర ప్రయోజనాలు, ఆందోళనలపై సున్నితంగా వ్యవహరించడం జరుగుతున్నది' అని ప్రధాని మోదీ జిన్‌పింగ్‌తో వ్యాఖ్యానించారు. 2017లో డోక్లాం వివాదం కారణంగా ఇరుదేశాల మధ్య క్షీణించిన సంబంధాలను ఉహాన్ సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు సమావేశమై తిరిగి వాటిని గాడినపెట్టారు.

**అమెరికాకు వ్యతిరేకంగా కూటమికి చైనా యత్నం**

టారిఫ్‌ను ఆయుధంగా చేసుకుని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ఏకపక్ష వాణిజ్య విధానాలకు వ్యతిరేకంగా యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని జిన్‌పింగ్ లేవనెత్తే అవకాశం ఉందని భేటీకి ముందు చైనా సంకేతాలిచ్చింది. ఏడాదికాలంగా అమెరికా, చైనా మధ్య వాణిజ్యం విషయంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. భారత్‌కు కల్పిస్తున్న వాణిజ్య ప్రాధాన్య హోదాను (జీఎస్పీని) అమెరికా ఉపసంహరించుకున్న నేపథ్యంలో ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా భారత్ కూడా కలిసి వచ్చే అవకాశం ఉందని చైనా భావిస్తున్నది .

### పుతిన్‌తో సమావేశమైన మోదీ



పుతిన్‌తో ప్రధాని మోదీ

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని మోదీ గురువారం సమావేశమయ్యారు. భేటీ అద్భుతంగా సాగిందని, ఇరు దేశాల వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు అన్ని అంశాలపై సమీక్ష నిర్వహించినట్లు మోదీ తెలిపారు. రక్షణ, శక్తి (ఎనర్జీ) రంగాలపై ప్రధానంగా చర్చలు జరిగినట్లు విదేశాంగ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ వెల్లడించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేథీలో ఏకే-203 రైఫిళ్ల తయారీ యూనిట్ ఏర్పాటుకు సహకరించినందుకు పుతిన్‌కు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. సెప్టెంబర్ మొదట్లో రష్యాలో జరిగే ఈస్టర్న్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని పుతిన్ ఆహ్వానించగా, అందుకు ప్రధాని సమ్మతించారు.



ఎస్సీవో సదస్సు సందర్భంగా జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ

### ఉగ్రవాదంపై పాక్ నిర్దిష్ట చర్యలు చేపట్టాలి

ఉగ్రవాదంపై పాకిస్థాన్ నిర్దిష్ట చర్యలు చేపడితేనే శాంతి చర్చలకు ఆస్కారముంటుందని ప్రధాని మోదీ.. జిన్‌పింగ్‌కు స్పష్టం చేశారు. పాకిస్థాన్ కేంద్రంగా సాగుతున్న సీమాంతర ఉగ్రవాదంపై ఇరువురు నేతల భేటీలో స్వల్ప చర్చ జరిగినట్లు భారత విదేశాంగ కార్యదర్శి విజయ్ గోఖలే తెలిపారు. పాక్‌తో శాంతిపూర్వక సంబంధాలను భారత్ కోరుకుంటున్నదని ఆయన చెప్పారు. పాకిస్థాన్‌తో సంబంధాలు మెరుగుపరుచుకునేందుకు తాను ప్రయత్నించినప్పటికీ, ఆ ప్రయత్నాలు అన్నీ పట్టాలు తప్పాయని జిన్‌పింగ్‌తో మోదీ చెప్పినట్లు గోఖలే తెలిపారు. 'ఉగ్రవాద రహిత వాతావరణాన్ని పాకిస్థాన్ కల్పించాల్సి ఉంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. శాంతి చర్చలు కొనసాగించేందుకు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పాక్ నిర్దిష్ట చర్యలు చేపట్టాలి' అని మోదీ జిన్‌పింగ్‌తో పేర్కొన్నారని గోఖలే చెప్పారు. ఎస్సీవో సదస్సు సందర్భంగా పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌తోనూ జిన్‌పింగ్ భేటీ కానున్నారు.

## అసాంజే అప్పగింతకు బ్రిటన్ అంగీకారం!

**లాహోర్:** వికీలీక్స్ సహ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజేను అమెరికాకు అప్పగించేందుకు బ్రిటన్ అంగీకరించింది. చట్టానికి విరుద్ధంగా దేశ సైనిక రహస్యాలను బట్టబయలు చేసిన అసాంజేను తమకు అప్పగించాలని అమెరికా చేసిన విజ్ఞప్తి మేరకు అప్పగింత ఆదేశాలపై తాను సంతకం చేశానని బ్రిటన్ హోంమంత్రి సాజిద్‌జావిద్ గురువారం వెల్లడించారు. ప్రభుత్వపరంగా తాము ఈ నిర్ణయం తీసుకున్నా.. దీనికి న్యాయస్థానం ఆమోదం తప్పనిసరన్నారు. దీనిపై శుక్రవారం కోర్టులో విచారణ జరుగుతున్నట్టు చెప్పారు.

## మోదీ హయాంలో రికార్డు స్థాయిలో నిరుద్యోగం

### ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విమర్శ



**హైదరాబాద్:** మోదీ ప్రభుత్వంపై ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవై సీ విరుచుకుపడ్డారు. మోదీ పాలనలో నిరుద్యోగం రికార్డు స్థాయిలో పెరిగిపోతున్నదని గు రువారం ట్వీట్ చేశారు. ద్రవ్యోల్బణం 7 నెలల గరిష్ఠానికి చేరడంతో వాహన పరిశ్రమలు ఉత్పత్తిని తాత్కాలికంగా తగ్గించాయన్నారు. దాదాపు దేశంలోని సగం భూభాగం కరువుతో అల్లాడుతున్నదని, గ్రామీణ ఆదాయం రోజురోజుకు తగ్గిపోతున్నా సెన్సెక్స్ 40వేలకు చేరుకున్నదని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్' అని చెబుతుంటారని, కానీ ప్రస్తుత పరిస్థితితో'కిస్‌కా సాత్.. కిస్‌కా వికాస్' అనే ప్రశ్న ఉద్భవిస్తున్నదన్నారు.

## ఈఎస్ఐ చెల్లింపు వాటా రేటు తగ్గింపు

మూడోపేజీ తరువాయి...

చెల్లిస్తున్న 6.5% వాటా రేటును తాజాగా 4 శాతానికి తగ్గించింది. విడివిడిగా చూస్తే ఉద్యోగి చెల్లించే వాటా 1.75% నుంచి 0.75 శాతానికి, అలాగే యాజమాన్యం చెల్లించే వాటా 4.75% నుంచి 3.25 శాతానికి కేంద్రం తగ్గించినట్లయ్యింది. తద్వారా 3.6 కోట్ల మంది ఉద్యోగులతోపాటు 12.85 లక్షల మంది యజమానులు లబ్ధిపొందనున్నారు. అలాగే వాటా రేటు తగ్గింపుతో యాజమాన్యలకు ఏటా సుమారు రూ.5 వేల కోట్లు ఆదా కానుంది. ఉద్యోగి, యాజమాన్య వాటా రేటు తగ్గింపు జులై 1 నుంచి అమలులోకి రానుంది. ఈ తగ్గింపుతో ఉద్యోగులకు అత్యంత చౌకగా ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని, అలాగే యాజమాన్యాలూ మరింత మంది ఉద్యోగులను ఈ పథకం కింద చేర్చే అవకాశముందని కేంద్రం యోచిస్తున్నది. తద్వారా మరింత మంది ప్రజలకు ఆరోగ్య భద్రత కలుగుతుందని భావిస్తున్నది. 2017 జనవరి 1 నుంచి ఈఎస్ఐసీ వర్తించే ఆదాయ పరిమితిని రూ.15 వేల నుంచి రూ.21వేలకు పెంచిన సంగతి తెలిసిందే.

నమస్తే తెలంగాణ
ఆట
క్రికెట్ సమరం WORLD CUP
కరీంనగర్ | WWW.NTNEWS.COM | శుక్రవారం 14 జూన్ 2019 | 10

## పాయింట్ల పట్టిక

| స్థానం | జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే. | ర.రే | పా |
|---|---|---|---|---|---|---|---|
| 1. | న్యూజిలాండ్ | 4 | 3 | 0 | 1 | +2.16 | 7 |
| 2. | ఆస్ట్రేలియా | 4 | 3 | 1 | 0 | +0.57 | 6 |
| 3. | భారత్ | 3 | 2 | 0 | 1 | +0.53 | 5 |
| 4. | ఇంగ్లండ్ | 3 | 2 | 1 | 0 | +1.30 | 4 |
| 5. | శ్రీలంక | 4 | 1 | 1 | 2 | -1.51 | 4 |
| 6. | వెస్టిండీస్ | 3 | 1 | 1 | 1 | +2.05 | 3 |
| 7. | బంగ్లాదేశ్ | 4 | 1 | 2 | 1 | -0.71 | 3 |
| 8. | పాకిస్థాన్ | 4 | 1 | 2 | 1 | -1.79 | 3 |
| 9. | దక్షిణాఫ్రికా | 4 | 0 | 3 | 1 | -0.95 | 1 |
| 10. | అఫ్ఘనిస్థాన్ | 3 | 0 | 3 | 0 | -1.49 | 0 |

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, ర.రే - నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు,

వరల్డ్ కప్‌లో నేడు | ఇంగ్లండ్ X వెస్టిండీస్ - 3 గం. | స్టార్ స్పోర్ట్స్‌లో

అత్యధిక పరుగులు **260** షకీబ్ (బంగ్లాదేశ్)

అత్యధిక వికెట్లు **10** ఆమిర్ (పాకిస్థాన్)



# లెజెండ్ లీ వీడ్కోలు

- బ్యాడ్మింటన్ నుంచి రిటైర్మెంట్
- 19 ఏండ్ల కెరీర్‌కు ముగింపు

**దాదాపు రెండు దశాబ్దాలు సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో ఉత్థాన పతనాలు చూశాడు. ఎన్నో అపూర్వ విజయాలు.. మరెన్నో ఎదురుదెబ్బలు తిన్నాడు. బ్యాడ్మింటన్‌లో ఓ దిగ్గజంగా వెలుగొందాడు. యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా... కెరటంలా ఎలా ఎగిసిపడొచ్చనే దానికి నిదర్శనంగా నిలిచాడు. చివరికి క్యాన్సర్ వ్యాధికి గురై ఆట నుంచే తప్పుకున్నాడు. బ్యాడ్మింటన్‌లో ఓ సువర్ణ శకానికి ఫుల్ స్టాప్ పెట్టాడు. ఒలింపిక్స్ స్వర్ణాన్ని సాధించి పెట్టాలన్న కలను తీర్చుకోకుండానే అనన్య సామాన్యమైన పోరాటాన్ని చాలించాడు. ఆ లెంజడరీ ఆటగాడే మలేషియాకు చెందిన లీ చాంగ్ వీ. క్యాన్సర్ చికిత్స కారణంగా ఫిట్‌నెస్ సాధించలేక ఆటకు వీడ్కోలు పలుకుతున్నట్టు కన్నీటి పర్యంతమవుతూ ప్రకటించాడు.**

**పుత్రజయ(మలేషియా):** 19 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో అద్భుత విజయాలు సాధించి... 348 వారాల పాటు బ్యాడ్మింటన్‌లో నంబర్‌వన్ ర్యాంకులో కొనసాగిన మలేషియా దిగ్గజ ఆటగాడు 39 ఏండ్ల లీ చాంగ్ వీ ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. అద్భుత కెరీర్‌ను ముగిస్తున్నట్టు బరువెక్కిన హృదయంతో గురువారం వెల్లడించాడు. నాసికా క్యాన్సర్‌కు గురికావడంతో తైవాన్‌లో చాంగ్ వీ గతేడాది చికిత్స తీసుకున్నాడు. అప్పటి నుంచి సరైన ప్రాక్టీస్ చేయలేక వెనుకబడ్డాడు. చివరికి ఆట నుంచి వైదొలుగుతూ నిర్ణయం తీసుకున్నాడు. ఈ మేరకు గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో లీ భావోద్వేగంగా మాట్లాడాడు. 'నాకు ఇంకా ఆడాలనే ఉంది. కానీ ఏప్రిల్ నుంచి సరైన సన్నాహకాలు చేయడం లేదు. టోక్యో ఒలింపిక్స్ తర్వాత రిటైరవ్వాలని అనుకున్నా. కానీ అనారోగ్య కారణాల వల్ల ముందుగానే వైదొలగాల్సి వచ్చింది' అని చెప్పాడు. ఇక నుంచి కుటుంబంతో సమయాన్ని గడిపేందుకే ప్రాధాన్యమిస్తానని చెప్పాడు. 2012 నుంచి తన భార్యతో హనీమూన్‌కు వెళ్లాలనుకుంటూ వాయిదా వేస్తున్నానని, ఇప్పుడు వెళతానని చెప్పాడు.

**705 విజయాలు**

2000 సంవత్సరంలో బ్యాడ్మింటన్‌లో అరంగేట్రం చేసిన లీ చాంగ్ వీ.. కెరీర్‌లో మొత్తం 705 మ్యాచ్‌ల్లో విజయం సాధించాడు. ఐదు కామన్‌వెల్త్ స్వర్ణాలు, నాలుగు ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టైటిళ్లు, 47 సూపర్ సిరీస్ విజయాలు సహా మొత్తం 69 టైటిళ్లను కైవసం చేసుకున్నాడు. అద్భుతమైన ఫుట్‌వర్క్, క్విక్ డిఫెన్స్, బలమైన షాట్లు, డీప్ స్మాష్‌లతో ప్రత్యర్థులకు చెమటలు పట్టించడంలో తనకు తానే సాటి అని నిరూపించుకున్నాడు.



**రిటైరవ్వాలన్న నా నిర్ణయం చాలా భారమైనది. బ్యాడ్మింటన్ అంటే నాకు ఎనలేని ప్రేమ. కానీ ఈ ఆట చాలా డిమాండ్ చేస్తుంది. 19 ఏండ్లుగా మద్దతు తెలిపిన మలేషియన్లకు కృతజ్ఞతలు**
**- కన్నీటితో లీ చాంగ్ వీ**

### కలగానే ఒలింపిక్ స్వర్ణం

కెరీర్‌లో ఎన్నో విజయాలను సొంతం చేసుకున్న లీ చాంగ్ వీకి ఒలింపిక్ స్వర్ణం మాత్రం కలగానే మిగిలింది. 2008, 2012, 2016 ఒలింపిక్స్‌లో బ్యాడ్మింటన్ ఫైనల్‌కు చేరినా స్వర్ణం దక్కలేదు. మూడు సార్లూ చివరి మెట్టులో తడబడి రజత పతకాలతోనే సరిపుచ్చుకున్నాడు. 2008, 2012లో జరిగిన ఫైనల్స్‌లో చైనాకు చెందిన లిన్ డాన్ చేతిలో, 2016లో అదే దేశానికి చెందిన చెన్ లాంగ్ చేతిలో లీ ఓడిపోయాడు. అలాగే ఒక్కసారి కూడా ప్రపంచ చాంపియన్ షిప్‌లో స్వర్ణం గెలుచుకోకపోవడం ఈ బ్యాడ్మింటన్ దిగ్గజం జీవితంలో పెద్దలోటు. 2005, 2011, 2013, 2015 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పోటీ పడిన లీ చాంగ్ వీ మూడు రజతాలు, ఓ కాంస్య పతకాన్ని సాధించాడు.

**వివాదంలో..:** 2014 ప్రపంచ చాంపియన్‌షిప్ తర్వాత లీ చాంగ్ వీ వివాదంలో చిక్కుకున్నాడు. నిషేధిత ఉత్ప్రేరకాలు వాడాడని తేలడంతో ప్రపంచ నంబర్‌వన్‌గా ఉన్న సమయంలోనే కొన్నాళ్ల పాటు ఆటకు దూరమయ్యాడు. స్టెమ్ కణాల చికిత్స కోసం ఆ ఉత్ప్రేరకాన్ని వాడానని లీ ఇచ్చిన వివరణకు బ్యాడ్మింటన్ అధికారవర్గాలు సంతృప్తి చెందడంతో మళ్లీ 2015లో రాకెట్ పట్టాడు. మరోసారి నంబర్‌వన్ స్థానానికి చేరుకున్నాడు.




# వదలని వాన

## భారీ వర్షంతో భారత్, కివీస్ మ్యాచ్ రద్దు ▪ ఇరు జట్లకు చెరో పాయింట్

**విశ్వ సమరాన్ని వరుణుడు నీడలా వెంటాడుతున్నాడు. వర్షం దెబ్బకు ఒక్క బంతి పడకుండానే భారత్- న్యూజిలాండ్ మ్యాచ్ రద్దైంది. ఇప్పటికే మూడు మ్యాచ్‌లను తుడిచిపెట్టిన వరుణుడు.. సవాళ్లను అధిగమించేందుకు సిద్ధమైన టీమ్ఇండియాను వదల్లేదు. టాస్ వేసేందుకు కూడా సాధ్యపడకుండా ముంచెత్తడంతో చేసేదేమిలేక ఇరుజట్లకు చెరో పాయింట్ పంచి పెట్టారు. గత ప్రపంచకప్‌లకు భిన్నంగా ఈసారి ఆటకంటే వాతావరణమే ప్రభావం చూపిస్తుండడం గమనార్హం.**

**నాటింగ్‌హమ్:**

ప్రతిష్ఠాత్మక ప్రపంచకప్‌ను వరణుడు వదిలేలాలేడు. ఇప్పటికే వర్షం కారణంగా మూడు మ్యాచ్‌లు తుడిచిపెట్టుకుపోగా. తాజాగా టీమిండియా మ్యాచ్ కూడా ఈ జాబితాలో చేరింది. గురువారం ఇక్కడి ట్రెంట్‌బ్రిడ్జ్ పిచ్‌పై న్యూజిలాండ్, భారత్ మధ్య జరగాల్సిన మ్యాచ్ టాస్ కూడా పడకుండానే రద్దైంది. ఎడతెరిపి లేని వర్షం కారణంగా పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన మ్యాచ్ చివరకు వర్షం ఎంతకూ తగ్గకపోవడంతో పూర్తిగా రద్దైంది. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్ లభించింది. నాలుగు మ్యాచ్‌లు ఆడిన న్యూజిలాండ్ 7 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలోనే కొనసాగుతుండగా.. మూడు మ్యాచ్‌ల్లో 5 పాయింట్లతో భారత్ మూడో స్థానానికి చేరింది.

**వరుణదేవా కరుణించవా..**

దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాపై విజయాలతో జోరు మీదున్న టీమ్ఇండియాకు వరుణ దేవుడు బ్రేక్ వేశాడు. దాయాది పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు ముందు ఆల్‌రౌండర్లతో నిండి ఉన్న న్యూజిలాండ్‌ను పడగొట్టి ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుందామంటే అది సాధ్యపడకుండా అడ్డుపడ్డాడు. గాయంతో దూరమైన ఓపెనర్ శిఖర్ ధవన్ స్థానంలో రాహుల్ ఎలా ఆడుతాడో.. నాలుగో స్థానంలో ఎవరిని బరిలోకి దించుతారో.. షమీకి ఈ మ్యాచ్‌లోనైనా చాన్స్ వస్తుందో.. ఇలాంటి సవాలక్ష ఊహలపై నీళ్లు చల్లాడు. మధ్యమధ్యలో కాస్త తెరిపినిస్తూ ఆశలు రేకెత్తించినా.. కవర్స్ తొలగిద్దామనే లోపే మళ్లీ ముంచెత్తుతూ దోబూచులాడుతుండటంతో ఇక చేసేదేమిలేక నిర్వాహకులు ఆటను రద్దు చేయాల్సి వచ్చింది. నాలుగేండ్లకోసారి వచ్చే విశ్వసమరం కోసం కండ్లు కాయలు కాచేలా ఎదురుచూసే వీరాభిమానులకు ఇలాంటి ఫలితాలు తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయి.

**ఆసక్తి సన్నగిల్లుతున్నది..**

ఇది వరకు మెగాటోర్నీ ఆరంభమైతుందంటే చాలు.. ఎక్కడి లేని సందడి ఉండేది. కానీ ఈసారి అందుకు భిన్నంగా.. వాతావరణం కీలకంగా మారుతున్నది. దీంతో టోర్నీపై ఆసక్తి తగ్గే అవకాశాలు ఉన్నాయి. 'అంతర్జాతీయ ఈవెంట్స్‌పై శ్రద్ధ చూపేవారంతా ఇప్పుడు ఒకే అంశం గురించి చర్చించుకుంటున్నారు. కోట్లాది మందిని తమవైపు ఆకర్షిస్తున్న ఆ అంశం మరేదో కాదు. ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న క్రికెట్ ప్రపంచకప్పే'అని ఓవైపు అమెరికా సెక్రెటరీ మైక్ పాంపియో.. క్రికెట్ ఫీవర్ ఏ రేంజ్‌లో ఉందో అంతర్జాతీయ వేదికలపై చాటిచెప్తుంటే.. మరోవైపు వాతావరణం మాత్రం మ్యాచ్‌లకు ప్రతిబంధకంగా మారింది. ఇదే వేదికపై గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ మాట్లాడుతూ.. 'నా అంచనా ప్రకారం.. భారత్, ఇంగ్లండ్ వరల్డ్ కప్ ఫైనల్లో తలపడతాయి. నా వరకైతే టీమ్ ఇండియా మూడోసారి కప్పు గెలువాలని బలంగా కోరుకుంటున్నా. అదే జరిగితే చాలా ఆనందిస్తా. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లు కూడా ప్రమాదకరమే'అని అన్నారు. ఇంత భారీ బజ్ ఏర్పడ్డ మెగాటోర్నీ ఇలా వర్షాల కారణంగా కళ తప్పడం కలవరపెడుతున్న అంశం.




### సోషల్ మీడియాలో జోకులు.

ఇక సామాజిక మాధ్యమాల్లోనైతే.. ప్రపంచకప్‌పై కుప్పలు తెప్పలుగా జోకులు పేలుతున్నాయి. వరల్డ్ కప్ బదులు రెయిన్ కప్ అనే పేరు పెడితే బాగుండేదని ఒకరంటే.. మ్యాచ్‌లన్ని రద్దు చేసి టోర్నీని కట్‌చేసి అందరికి సమానంగా పంచాలని మరొకరు సెటైర్లు వేస్తున్నారు. న్యూజిలాండ్ నాలుగు మ్యాచ్‌లు ఆడి 7 పాయింట్లతో ఉంటే.. వర్షం 4 మ్యాచ్‌ల్లో 8 పాయింట్లతో అగ్రస్థానానికి చేరిందని ఛలోక్తులు విసురుతున్నారు. వీటిని జోకులు అనేకన్నా వాస్తవ పరిస్థితులకు నిలువుటద్దాలు అనడమే సబబేమో. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ప్రపంచకప్ ప్రారంభమై రెండు వారాలు కాక ముందే 4 మ్యాచ్‌లు వర్షార్పణమయ్యాయి.

### మా పరిస్థితేంటి..

ప్రతిష్ఠాత్మక ప్రపంచకప్‌ను ప్రత్యక్షంగా వీక్షించాలని వేలాది మంది ఇంగ్లండ్‌లో అడుగుపెట్టారు. ఇప్పుడు వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తాహతుకు మించి ఖర్చుపెట్టి మ్యాచ్‌లు చూడాలని భావించి వస్తే.. వరుణుడు వారి ఆశలపై నీళ్లు గుమ్మరించాడు. తాజాగా భారత్ మ్యాచ్ రద్దైన అనంతరం ఓ అభిమాని మాట్లాడుతూ.. 'నేను భారత్ మ్యాచ్ చూసేందుకు సింగపూర్ నుంచి వచ్చా. 800 పౌండ్లు (సుమారు రూ. 70 వేలు) వెచ్చించి టికెట్ కొనుగోలు చేశా. అదంతా వృథా అయినట్లే. పాకిస్థాన్‌తో మ్యాచ్ టికెట్లు మొత్తం అమ్ముడుపోయాయి. బ్లాక్ మార్కెట్‌లో ఆ మ్యాచ్ టికెట్ దాదాపు రూ. 2 లక్షలు పలుకుతున్నది. నా దగ్గర అంత డబ్బులేదు. ఇప్పుడు నేనేం చేయను?'అని తనగోడు వెల్లబోసుకున్నాడు. ఐసీసీ నిబంధనల ప్రకారం ఒక్క బంతి కూడా పడకుండా మ్యాచ్ రద్దైతే టికెట్ డబ్బులు వాపస్ వస్తాయి. కానీ మ్యాచ్ చూడడానికి వచ్చిన వారిలో అధిక శాతం మంది టికెట్లు థర్డ్‌పార్టీ వద్ద నుంచి కొనుగోలు చేసినవారే కావడంతో వారికి దీంతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీనికితోడు ఇంగ్లండ్‌లో హోటళ్ల చార్జీలు, ప్రయాణ ఖర్చులు అదనపు భారాన్ని మిగులుస్తున్నాయి. ప్రసార హక్కులు పొందిన సంస్థలకు ఇన్సూరెన్స్ రూపంలో భద్రత ఉంటుంది కానీ అభిమానులకు ఆ అవకాశం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



**ఇది చాలా సున్నితమైన నిర్ణయం. ఔట్‌ఫీల్డ్ అనుకూలంగా లేనప్పుడు మనం మాత్రం ఏం చేయగలం. చిత్తడి మైదానంలో ఫీల్డర్లకు గాయాలయ్యే అవకాశాలెక్కువ. దానికన్నా ఆట రద్దు కావడమే మంచిది. తదుపరి మ్యాచ్ గురించి ఇప్పుడే ఏం మాట్లాడదల్చుకోలేదు. బరిలో దిగాక గేమ్‌ప్లాన్‌ను అమలు చేయడమే మా లక్ష్యం. శిఖర్ గాయం త్వరగా నయం కావాలని కోరుకుంటున్నా. టోర్నీ మలి సగంలో అతడు అందుబాటులో ఉండే అవకాశాలున్నాయి. అతడు జట్టుతో చేరాలని మేము కోరుకుంటున్నాం.**
**- విరాట్ కోహ్లీ, భారత కెప్టెన్.**



**గత నాలుగు రోజులుగా ఇక్కడ సూర్యుడే కనిపించలేదు. అందుకే ఈ నిర్ణయం మమ్మల్ని ఆశ్చర్యపర్చలేదు. దీంతో టోర్నీ మధ్యలో మాకు సుదీర్ఘ విరామం దొరికింది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌కు ముందు రీఫ్రెష్ అయ్యేందుకు ఈ సమయాన్ని వినియోగించుకుంటాం.**
**- కేన్ విలియమ్సన్, న్యూజిలాండ్ కెప్టెన్**



# ఇంగ్లండ్, విండీస్ అమీతుమీ

### నేడు ఇరు జట్ల మధ్య పోరు



మోర్గాన్



హోల్డర్

| ప్రపంచ కప్‌లో.. | |
|---|---|
| ఆడిన మ్యాచ్‌లు | 6 |
| ఇంగ్లండ్ గెలిచినవి | 5 |
| వెస్టిండీస్ గెలిచినవి | 1 |

**సౌతాంప్టన్:** ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన వన్డే సిరీస్‌లో హోరాహోరీగా తలపడి.. పరుగుల వరద పారించిన ఇంగ్లండ్-వెస్టిండీస్ జట్లు ప్రపంచకప్‌లో భాగంగా శుక్రవారం తలపడనున్నాయి. భీకరమైన విండీస్ పేస్‌కు.. బలమైన ఇంగ్లిష్ బ్యాటింగ్‌కు మధ్య రోస్‌బౌల్ స్టేడియం వేదికగా పోరు జరుగనుంది. రసవత్తరంగా సాగే ఈ మ్యాచ్‌లో గెలుపు ఎవరిదన్నది ఆసక్తికరంగా మారింది.

**గాడిలో పడిన ఇంగ్లండ్..**

పాక్ చేతిలో అనూహ్య ఓటమి తర్వాత ఇంగ్లండ్ ఒక్కసారిగా బంగ్లాదేశ్‌పై జూలు విదిల్చింది. మొదట బ్యాటింగ్ చేసి 386 పరుగుల భారీ స్కోరు చేయడంతో పాటు బంగ్లాను 280కే ఆలౌట్ చేసింది. రాయ్ ఏకంగా 153 పరుగులు చేశాడు. బంగ్లాపై ప్రదర్శనను విండీస్‌పై పునరావృతం చేయాలని ఇంగ్లండ్ భావిస్తున్నది. 3 మ్యాచ్‌ల్లోనూ 300కు పైగా స్కోర్లు నమోదు చేసిన ఇంగ్లండ్ పేసర్లతో పటిష్ఠంగా ఉన్న విండీస్ బౌలర్లను ఎలా ఎదుర్కొంటుందో చూడాలి.

**విండీస్‌కు బౌలింగ్‌కు పరీక్షే..**

ప్రపంచకప్‌లో అంచనాలకు మించి రాణిస్తున్న వెస్టిండీస్ పేసర్లకు ఇంగ్లండ్‌తో మ్యాచ్ పరీక్షే. మొదటి నుంచి దూకుడుగా ఆడే ఓపెనర్లు.. సంయమనంతో మ్యాచ్‌ను నడిపించే మిడిల్ఆర్డర్.. విధ్వంసం సృష్టించగలిగే లోయర్‌ఆర్డర్ ఉన్న ఇంగ్లిష్ జట్టును కట్టడి చేయడం సవాలే. టోర్నీలో రెండు మ్యాచ్‌ల్లోనూ విండీస్ పేసర్లు సమిష్టిగా రాణించి ప్రత్యర్థి జట్టును ఆలౌట్ చేశారు. బ్యాటింగ్‌లో బిగ్ హిట్టర్లు గేల్, హోప్, పూరన్, హిట్మైర్‌లు కీలకం కానున్నారు. గాయంతో బాధ పడుతున్న రసెల్ కూడా జట్టులో ఉంటే రెండు విభాగాలకు మరింత బలం చేకూరుతుంది.

**వరుణుడి ఆటంకం తప్పదా**

ఈ మ్యాచ్‌కు కూడా వరుణుడు ఆటంకం కలిగించే అవకాశం ఉంది. ఇప్పటికే టోర్నీలో నాలుగు మ్యాచ్‌లు రద్దుకాగా... ఈ పోరు జరిగే సౌతాంప్టన్‌లోనూ గురువారం భారీ వర్షం పడింది. దీంతో విండీస్ ప్లేయర్లు ఇండోర్‌లోనే ప్రాక్టీస్ చేశారు.

# ప్రపంచకప్ నా చేతుల్లో ఉండాలి



హార్దిక్

**నాటింగ్‌హామ్:** ప్రపంచకప్‌లో ఎలాంటి ఒత్తిళ్లు లేవని, జట్టు గెలువాలన్నదే కోట్లాది మంది భారతీయుల కోరిక అని ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అన్నాడు. ముచ్చటగా మూడోసారి తమ కలల కప్‌ను ముద్దాడాలనుకుంటున్న టీమ్ఇండియా టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన సంగతి తెలిసిందే. అంచనాలకు తగ్గట్లు కోహ్లీసేన వరుస విజయాలతో దూసుకెళుతున్నది. ఈ నేపథ్యంలో ఐసీసీ పోస్ట్ చేసిన వీడియోలో హార్దిక్ పలు అంశాలను పంచుకున్నాడు. 'జూలై 14న ప్రపంచ కప్ నా చేతుల్లో ఉండాలని కోరుకుంటాను. నా ప్లాన్ చాలా సింపుల్.. వరల్డ్‌కప్ గెలువాలన్నదే తపన. భారత్ అంటే నాకు అన్నీ. మూడున్నర ఏండ్లుగా మెగాటోర్నీ కోసం సిద్ధమవుతున్నా. ఇప్పుడు సమయమొచ్చింది. నా జీవితం లో ఇప్పటివరకు ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నాను. కానీ వాటితో కుంగిపోవాలనుకోవడంలేదు. చాలా కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నాను. అవును 2011 ప్రపంచ కప్ భారత్ గెలిచినప్పుడు అర్ధరాత్రి పూట దోస్తులతో కలిసి వీధుల్లో సంబురాలు చేసుకున్నాం. అంత మంది రోడ్లపైకి వచ్చి పండుగలా సంబురాలు చేసుకున్నారు. ఏదో ఒక రోజు టీమ్ఇండియాకు ఆడాలనుకున్నాను. సరి గ్గా ఎనిమిదేండ్ల తర్వాత ప్రపంచకప్ ఆడే భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాను' అని హార్దిక్ అన్నాడు.

# వారెవ్వా.. వార్నర్

**టాంటన్:**

ఆస్ట్రేలియా విధ్వంసక ఓపెనర్ డేవిడ్ వార్నర్ మైదానంలో తన షాట్లతో పాటు.. గ్రౌండ్ బయట ప్రవర్తనతోనూ అభిమానుల మనసులు గెలుచుకుంటున్నాడు. ప్రపంచకప్‌లో భాగంగా పాకిస్థాన్‌పై ఆసీస్ విజయం సాధించిన అనంతరం తనకు లభించిన మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును వార్నర్ ఓ అభిమానికి బహుకరించాడు. మ్యాచ్ అనంతరం అభిమానులకు ఆటోగ్రాఫ్‌లు ఇస్తున్న వార్నర్ ఆస్ట్రేలియా జెర్సీ వేసుకొని తనకోసం ఎదురుచూస్తున్న ఓ చిన్నారి వద్దకు వెళ్లి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని బహుమతిగా ఇచ్చేశాడు. 'మేము మా (ఆస్ట్రేలియా) జెండా ఊపుతున్నాం. అది గుర్తించిన వార్నర్ మా వద్దకు వచ్చి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఇచ్చి వెళ్లాడు'అని బాలుడు సంతోషంగా అన్నాడు. ఈ వీడియోను ఐసీసీ అధికారిక ట్విట్టర్‌లో పెట్టింది.





**అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో రజత, కాంస్య పతకాలు సాధించిన ప్రవీణ్‌కుమార్‌ను గురువారం అభినందిస్తున్న సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, ప్రేమ్‌రాజ్ తదితరులు**

# ఫైనల్లో భారత రికర్వ్ జట్టు

**డెన్‌బాచ్(నెదర్లాండ్స్):** ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత రికర్వ్ జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇప్పటికే టోక్యో (2020) ఒలింపిక్స్ బెర్తు దక్కించుకున్న భారత ఆర్చర్లు..2005 తర్వాత ఇన్నాళ్లకు మెగాటోర్నీలో ఫైనల్‌కు చేరుకున్నారు. ఆదివారం జరిగే ఫైనల్లో భారత ఆర్చరీ త్రయం తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్, ప్రవీణ్ జాదవ్..చైనా జట్టుతో తలపడుతుంది. మరోవైపు మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంటులో వెన్నెం జ్యోతి సురేఖ, ముస్కా న్ కిరార్, రాజ్ కౌర్ త్రయం..శనివారం కాంస్య పతక పోరులో టర్కీ జట్టుతో తలపడుతుంది.

# ఫీల్డింగ్ మెరుగవ్వాలి



**టాంటన్:** టీమ్ ఇండియాతో పోరుకు ముందు తమ జట్టు ఫీల్డింగ్ ప్రమాణాలు పెంచుకోవాల్సిన అవసరం ఉందని పాకిస్థాన్ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ పేర్కొన్నాడు. పేలవ ఫీల్డింగ్ కారణంగా ఆసీస్ చేతిలో ఓటమిపాలైన పాక్.. కీలక పోరుకు ముందు తప్పులు సరిదిద్దుకోవాలని భావిస్తున్నది. 'ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో మేం చాలా తప్పులు చేశాం. అన్ని విభాగాల్లోనూ విఫలమయ్యాం. ముఖ్యంగా మా ఫీల్డింగ్ పట్ల చాలా అసంతృప్తిగా ఉన్నా. భారత్‌తో మ్యాచ్‌కు ముందు దీనిపై దృష్టిసారించి మెరుగవ్వాల్సిన అవసరం ఉంది' అని సర్ఫరాజ్ తెలిపాడు. బుధవారం ఆసీస్‌తో పోరులో పాకిస్థాన్ 41 పరుగుల తేడాతో ఓడిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఆసీస్ ఓపెనర్లు ఫించ్, వార్నర్‌కు పాక్ ఫీల్డర్లు పలు మార్లు జీవనదానాలు ఇచ్చారు. దీన్ని సద్వినియోగం చేసుకున్న ఈ జంట భారీ స్కోరు చేసింది. మ్యాచ్ ఓడినా.. పేసర్ మహ్మద్ ఆమిర్ ఆటతీరు ఆకట్టుకుందని సర్ఫరాజ్ అన్నాడు. 'ఈ మ్యాచ్‌లో ఏదైనా సానుకూల అంశం ఉందంటే. అది ఆమిర్ బౌలింగే. అతడు ప్రపంచ స్థాయి బౌలర్' అని చెప్పుకొచ్చాడు.

# ఆ మ్యాచ్‌ను స్ఫూర్తిగా తీసుకోండి



**నాటింగ్‌హామ్:** భారత్‌తో మ్యాచ్ జరుగనున్న నేపథ్యంలో పాకిస్థాన్ జట్టుకు ఆ దేశ మాజీ కెప్టెన్ వకార్ యూనిస్ సలహాలిచ్చాడు. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో టీమ్ఇండియాపై గెలుపును స్ఫూర్తిగా తీసుకొని ఈ మ్యాచ్‌లో చెలరేగాలని సూచించాడు. త్వరగా వికెట్లు తీసి భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టాలని ఐసీసీ కోసం గురువారం రాసిన కాలమ్‌లో సూచించాడు. 'టోర్నీలో చివరి వరకు ఉండాలనుకుంటే పాక్ అత్యుత్తమ ఆటను ప్రదర్శించాల్సిందే. భారత్‌తో పాకిస్థాన్ ఎప్పుడు ఆడినా అది పెద్ద మ్యాచే. ప్రపంచకప్ టోర్నీల్లో గత రికార్డుల గురించి కాకుండా... 2017 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో టీమ్ఇండియాను ఓడించిన విషయాన్ని పాక్ గుర్తు తెచ్చుకోవాలి. భారత్‌తో మ్యాచ్‌లో పాక్ తొలి పది ఓవర్లలో వికెట్లు తీయడం కీలకం' అని వకార్ యూనిస్ అన్నాడు. ఆస్ట్రేలియాతో ఓడినప్పటికీ ఆ మ్యాచ్‌లో పాక్ ప్రదర్శన బాగానే ఉందని, ముఖ్యంగా మహ్మద్ ఆమిర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడని ప్రశంసించాడు.

## బీడీఎల్‌కు రూ.1,188 కోట్ల ఆర్డర్

నావికాదళం నుంచి లభించిన కాంట్రాక్టు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) మరో భారీ కాంట్రాక్టును దక్కించుకున్నది. భారత నావికాదళం నుంచి రూ.1,187.82 కోట్ల ఆర్డర్ లభించినట్లు కంపెనీ గురువారం పేర్కొంది. అధిక బరువు గల టార్పెడోలను (నావికాదళం ప్రయోగించే క్షిపణులు) సరఫరా చేసేందుకు ఈ ఒప్పందం కుదిరినట్లు బీడీఎల్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఒప్పందం పత్రంపై బీడీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) ఎన్‌పీ దివాకర్, రక్షణ శాఖ జాయింట్ సెక్రెటరీ, అక్విజేషన్ మేనేజర్ నిధి చిబ్బెర్ సంతకాలు చేశారు. వచ్చే 42 నెలల పాటు ఈ ఒప్పందం అమలులో ఉంటుందని, ఒప్పందంలో పేర్కొన్న టార్పెడోలని డీఆర్‌డీవో సహకారంతో బీడీఎల్ విశాఖ పట్నం యూనిట్‌లో తయారు చేయడం జరుగుతుందని తెలిపింది. అధిక బరువు గల టార్పెడో లేదా వరుణాస్త్రను నీటి అడుగు భాగంలో నుంచి ప్రయోగిస్తారు. అత్యాధునిక సాంకేతికతను వినియోగించి అనుకున్న లక్ష్యాన్ని ఛేధించడానికి వీటిని వినియోగించనున్నారు.

# డిఫాల్టర్ల ఆస్తుల్ని అమ్మేద్దాం

### బకాయిల వసూళ్లకు బ్యాంక్ యూనియన్ల సూచన
### బడ్జెట్‌కు ముందు కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్‌కు లేఖ

**ముంబై, జూన్ 13:** ఇక బ్యాంకులు రుణ ఎగవేతదారుల వ్యక్తిగత ఆస్తులను అమ్మివేసి తమ బకాయిలను వసూలు చేసుకోనున్నాయి. బ్యాంక్ యూనియన్ల సూచనకు కేంద్ర ప్రభుత్వం ఊ కొడితే ఇది ఆచరణలోకి రావడం ఇంకెంతో కాలం పట్టదు. దేశీయ బ్యాంకింగ్ రంగాన్ని ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉనికినే మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) ప్రశ్నార్థకం చేస్తున్న నేపథ్యంలో బ్యాంకింగ్ చట్టాలు, నిబంధనలను కఠినతరం చేయాల్సిన అవసరం ఉందని బ్యాంక్ యూనియన్లు అభిప్రాయపడుతున్నాయి. ముందస్తు బడ్జెట్ చర్చల్లో భాగంగా అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ) కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఓ లేఖ రాసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను వచ్చే నెల 5న లోక్‌సభలో సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగానే రుణ బకాయిల వసూలుకు ప్రభావవంతమైన చట్టాలు కావాలని, డిఫాల్టైన సంస్థల డైరెక్టర్ల వ్యక్తిగత ఆస్తులను జప్తు చేసేలా నిబంధనలను సవరించాలని ఏఐబీఈఏ సదరు లేఖలో కోరింది. మరిన్ని అధికారాలతో ఫాస్ట్-ట్రాక్ కోర్టుల్ని ఏర్పాటు చేయాలనీ సూచించింది. అలాగే రుణ పునర్వ్యవస్థీకరణ కంపెనీలను మూసేయాలని డిమాండ్ చేసింది. అంతేగాక ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్ట్సీ కోడ్ (ఐబీసీ)తో డిఫాల్టర్లకే మేలు జరుగుతున్నదని, బ్యాంకులు బలవంతంగా తమ రుణ మొత్తాలను భారీగా తగ్గించుకోవాల్సి వస్తున్నదని మంత్రికి ఈ సందర్భంగా ఏఐబీఈఏ తెలిపింది. ఏడాది లోపలే రుణాలు మొండి బకాయిలుగా మారితే వాటి మంజూరుతో ప్రమేయమున్న బ్యాంకుల ఎండీ, సీఈవో, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఇతర సీనియర్ ఉన్నతాధికారుల్లో జవాబుదారీతనాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలన్నది. ఉద్దేశపూర్వక రుణ ఎగవేతల్ని నేరాలుగా ప్రకటించాలని, కోటి రూపాయలకుపైగా ఎగ్గొట్టినవారి జాబితాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఆర్నెళ్లకోసారి విడుదల చేయాలని సూచించింది. ప్రైవేట్ రంగ బ్యాంకులకు లైసెన్సుల జారీని అపేయాలని కూడా ఆర్బీఐకి ఏఐబీఈఏ సలహా ఇచ్చింది.

### ఎఫ్‌డీఐ పరిమితిని పెంచాలి

బీమా రంగంలో, మల్టీ-బ్రాండ్ రిటైల్ ట్రేడింగ్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కున్న పరిమితిని పెంచాల్సిన అవసరం ఉందని వ్యాపార, పారిశ్రామిక సంఘం ఫిక్కీ అభిప్రాయపడింది. గురువారం ముందస్తు బడ్జెట్ చర్చల్లో భాగంగా 'ఫుడ్ రిటైల్‌లో 100 శాతం ఎఫ్‌డీఐ తరహాలోనే మల్టీ-బ్రాండ్ రిటైల్‌లో ఎఫ్‌డీఐ పరిమితిని పెంచాలి. బీమా రంగంలోనూ 49 శాతం నుంచి 74 శాతానికి పెరుగాలి' అని సూచించింది. విదేశీ మదుపరుల్లో విశ్వాసాన్ని పెంపొందించే నిర్ణయాలను తీసుకోవాలని కోరింది.




ముందస్తు బడ్జెట్ సంప్రదింపుల్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు

### ఎగుమతులకు ఊతమివ్వండి

ఎగుమతులకు ఊతమిచ్చేలా తయారీ రంగాన్ని ప్రోత్సహించాలని, నగదు కొరతను తీర్చాలని భారతీయ వాణిజ్య ప్రోత్సాహక మండలి (టీపీసీఐ) సీతారామన్‌ను కోరింది. వ్యవసాయ ఎగుమతులపై దృష్టి పెట్టాలని, ఆహార శుద్ధి రంగానికీ ప్రాధాన్యత నివ్వాలని సూచించినట్లు టీపీసీఐ చైర్మన్ మోహిత్ సింగ్లా ఓ ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ పన్నును తగ్గించాలని, అన్ని రంగాలకూ దాని ప్రయోజనాలను వర్తింపజేయాలని సలహా ఇచ్చారు. దీనివల్ల దేశంలోకి ఎఫ్‌డీఐ రాక పెరుగుతుందన్న ఆశాభావాన్ని వెలిబుచ్చారు.

### రిటైల్ ఇన్వెస్టర్ల కోసం..

కార్పొరేట్ బాండ్లలో రిటైల్ ఇన్వెస్టర్లకు పన్ను ప్రోత్సాహకాలను పొడిగించాలని సీతారామన్‌ను ఫైనాన్షియల్ మార్కెటీర్లు కోరారు. టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్లలోనూ పెట్టుబడుల కోసం అదనంగా మరిన్ని పన్ను మినహాయింపులను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ముందస్తు బడ్జెట్ సంప్రదింపుల్లో భాగంగా బ్యాంకులు తదితర ఫైనాన్షియల్, క్యాపిటల్ మార్కెట్ల సంస్థలు పలు సలహాలు, సూచనలు చేశాయి. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రంగంలో ఆర్థిక రంగ అభివృద్ధి మండలి (ఎఫ్‌ఎస్‌డీసీ) పాత్ర పెంపు, ఎన్‌బీఎఫ్‌సీల కోసం ఓ లిక్విడిటీ విండో సృష్టి వంటి వాటిని సూచించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్‌ఎంఈ)ల బలోపేతానికి, ఆర్థిక వ్యవస్థ పునరుత్తేజానికి మా వంతు సలహాలు, సూచనలు ఇచ్చామని సమావేశం అనంతరం విలేఖరులతో ఎస్‌బీఐ చైర్మన్ రజ్నీశ్ కుమార్ చెప్పారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ థాకూర్, ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శులు, ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్లు, సెబీ డైరెక్టర్లు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## రానంటే..రాను..

### బోర్డు పదవి కోసం ప్రయత్నించడం లేదు
### స్పష్టం చేసిన యెస్ బ్యాంక్ మాజీ చీఫ్ రాణా కపూర్




**ముంబై, జూన్ 13:** యెస్ బ్యాంక్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాణా కపూర్ మళ్లీ బోర్డులోకి చేరుతున్నట్లు వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. ఆయన స్థానంలో నియమితులైన రవ్‌నీత్ గిల్‌పై నమ్మకాన్ని వ్యక్తంచేశారు కపూర్. ఆయన సారథ్యంపై రిజర్వు బ్యాంకు ఆందోళన వ్యక్తం చేయడం, ముఖ్యంగా పాలనలో అస్తవ్యస్థంగా ఉండటం, రుణాల జారీలోనూ ఇష్టం వచ్చినట్లు వ్యవహరించినట్లు ఆరోపణలు వ్యక్తమయ్యాయి. మార్చి 1న పదవీ బాధ్యతలు స్వీకరించిన గిల్..బ్యాంకును ఆర్థికంగా బలోపేతం చేయడానికి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. గడిచిన త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.1,500 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. 'తిరిగి బ్యాంక్ బోర్డులోకి చేరాలని పలు మీడియా నివేదికలు సూచిస్తున్నాయి..కానీ దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను' అని ట్విట్ చేశారు కపూర్. ప్రస్తుతం బ్యాంకులో ఆయనకు 9 శాతం వాటా ఉన్నది. బుధవారం జరిగిన బ్యాంక్ ఏజీఎం సమావేశంలో రాణా కపూర్‌కు 19 మంది మద్దతు పలికారు. బ్యాంకులో జరుగుతున్న పరిణామాలపై పలువురు పెట్టుబడిదారులు ఆందోళన వ్యక్తంచేశారు. మరోవైపు బ్యాంకుకు మరో ఇద్దరు డైరెక్టర్లు రాజీనామా చేయడంతో సంస్థలో ఏదో జరుగుతున్నదన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. కాగా, అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ కూడా బ్యాంక్ రేటింగ్‌ను తగ్గించింది. దీంతో స్టాక్ మార్కెట్లో బ్యాంక్ షేరు ధర మరో 10.10 శాతం పడిపోయి రూ.121.05 వద్ద ముగిసింది.

## ఫోర్బ్స్ కంపెనీల్లో ఆర్‌ఐఎల్‌సహా 57 భారతీయ సంస్థలు

### అగ్రస్థానంలో చైనా ఇండస్ట్రియల్, కమర్షియల్ బ్యాంక్

**న్యూఢిల్లీ, జూన్ 13:** ఫోర్బ్స్ గ్లోబల్ 2000 కంపెనీల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీసహా 57 భారతీయ సంస్థలకు చోటు దక్కింది. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్)కు 71వ స్థానం లభించడం గమనార్హం. అంతేగాక టాప్-200లో చోటు దక్కించుకున్న సంస్థ కూడా ఇదే. అయితే ఆయా రంగాలవారీగా చూసినట్లైతే అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ రంగంలో ఆర్‌ఐఎల్ 11వ స్థానాన్ని చేజిక్కించుకున్నది. రాయల్ డచ్ షెల్‌కు ప్రథమ స్థానం వచ్చింది. కాగా, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌కు ఓవరాల్‌గా 332వ స్థానం రాగా, విడిగా టాప్-10 కన్జ్యూమర్ ఫైనాన్స్ సంస్థల్లో ప్లేస్ పొందడం విశేషం. ఈ దేశీయ హౌసింగ్ ఫైనాన్స్ దిగ్గజం ఏడో ర్యాంక్ అందుకున్నది. ఈ రంగంలో అమెరికన్ ఎక్స్‌ప్రెస్ మొదటి స్థానంలో ఉన్నట్లు తాజా జాబితాలో ఫోర్బ్స్ మ్యాగజైన్ తెలిపింది. ఇక ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనా (ఐసీబీసీ) వరుసగా ఏడో ఏడాది అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం 61 దేశాలకు చెందిన సంస్థలు ఈ జాబితాలో ఉండగా, అమెరికాకు చెందినవే గరిష్ఠంగా 575 ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో చైనా (309), జపాన్ (223)లున్నాయి. టాప్-10లో ఐసీబీసీ తర్వాత వరుసగా జేపీ మోర్గాన్, చైనా కన్‌స్ట్రక్షన్ బ్యాంక్, అగ్రికల్చరల్ బ్యాంక్ ఆఫ్ చైనా, బ్యాంక్ ఆఫ్ అమెరికా, యాపిల్, పింగ్ అన్ ఇన్సూరెన్స్ గ్రూప్, బ్యాంక్ ఆఫ్ చైనా, రాయల్ డచ్ షెల్, వెల్స్ ఫార్గో ఉన్నాయి. టాప్-300లో భారత్ నుంచి రిలయన్స్‌తోపాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (209), ఓఎన్‌జీసీ (220), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (288)లు చోటు సంపాదించాయి. టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, ఎస్బీఐ, ఎన్టీపీసీలు టాప్-500లో ఉండగా, ఈ జాబితాలో ఉన్న మరికొన్ని భారతీయ సంస్థల్లో టాటా స్టీల్, కోల్ ఇండియా, కొటక్ మహీంద్రా బ్యాంక్, భారత్ పెట్రోలియం, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటర్స్, ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, విప్రో, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, పవర్‌గ్రిడ్, హిందాల్కో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, గెయిల్, పీఎన్‌బీ, గ్రాసిమ్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పవర్ ఫైనాన్స్, కెనరా బ్యాంక్‌లున్నాయి.




## కలిసి పనిచేస్తే కలదు లాభం

### గ్రూప్‌లోని సంస్థల మధ్య మరింత సహకారం కావాలి
### టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్

**ముంబై, జూన్ 13:** టాటా గ్రూప్‌లో కలిసి పనిచేస్తున్న సంస్థల్లో మెరుగైన ప్రదర్శన కనిపిస్తున్నదంటూ టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు. గురువారం ఇక్కడ దేశీయ ఐటీ రంగ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) వార్షిక సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థల మధ్య మరింత సహకారం అవసరమని, అప్పుడే ఇంకా మెరుగవుతామని అభిప్రాయపడ్డారు. 2017 ఫిబ్రవరిలో టాటా సన్స్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దగ్గర్నుంచి టాటా గ్రూప్‌లోని సంస్థల ఐకమత్యమే లక్ష్యంగా చంద్రశేఖరన్ ముందుకెళ్తున్నారు. 100 బిలియన్ డాలర్లకుపైగా విలువైన 100కుపైగా సంస్థలకు నాయకత్వం వహిస్తున్న ఆయన రక్షణ వంటి రంగాల్లో కలిసి పనిచేస్తేనే లాభాలుంటాయని చెప్పారు. ఇక సంస్థ బోర్డులో మహిళల ప్రాతినిధ్యం తగిన విధంగానే ఉందని, 4 లక్షలకుపైగా ఉన్న ఉద్యోగుల్లో 36 శాతంగా స్త్రీలున్నట్లు చంద్రశేఖరన్ తెలిపారు. కాగా, ఈ ఎన్నికల ఏడాది రాజకీయ పార్టీలకు విరాళంగా రూ.600 కోట్లను ఇచ్చామని, 2014తో పోల్చితే ఇది 20 రెట్లకుపైగా ఎక్కువని చెప్పారు. ఒక్క టీసీఎస్ ద్వారానే రూ.220 కోట్ల విరాళాలు వెళ్లాయని వాటాదారులకు వివరించారు.




#### కోటి జీతగాళ్లు వందపైనే

టీసీఎస్‌లో ఏటా కోటి రూపాయలకుపైగా జీతాలు తీసుకుంటున్నవారు 100 మందికి పైగానే ఉన్నారు. గత ఆర్థిక సంవత్సరం (2018-19) వీరి సంఖ్య 103కు చేరినట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. కాగా, ఇందులో దాదాపు 25 మందికిపైగా తమ కెరియర్‌ను టీసీఎస్‌లోనే ప్రారంభించినవారు కావడం గమనార్హం. వార్షిక జీతం కోటి రూపాయలకుపైగా ఉన్నవారిలో సీఈవో రాజేశ్ గోపీనాథన్, సీవోవో ఎన్‌జీ సుబ్రమణియన్‌లతోపాటు విదేశాల్లో పనిచేస్తున్న పలువురు ఉన్నతోద్యోగులున్నట్లు తెలుస్తున్నది. టీసీఎస్ లైఫ్ సైన్సెస్ అధిపతి దేబాశిష్ ఘోష్ రూ.4.7 కోట్లకుపైగా ఆర్జించగా, టెక్నాలజీ సర్వీసెస్ హెడ్ కృష్ణన్ రామానుజన్ రూ.4.1 కోట్లు, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ విభాగం అధిపతి కే కృతివాసన్ రూ.4.3 కోట్లు, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ కే అనంత్ కృష్ణన్ రూ.3.5 కోట్లకుపైగా పొందారు. రిటైల్, కన్జ్యూమర్ ప్రోడక్ట్స్ మాజీ అధిపతి ప్రతిక్ పాల్ రూ.4.3 కోట్లు అందుకున్నట్లు సమాచారం. ఇన్ఫోసిస్‌లో కోటి రూపాయలకుపైగా జీతాలు పొందుతున్నవారు 60 మందికిపైగా ఉన్నారు.

#### ఇంకింత జీతమివ్వాలి

సీనియర్ ఉద్యోగులకు మరింత జీతమివ్వాల్సిన అవసరం ఉందని చంద్రశేఖరన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించడం గమనార్హం. ఉద్యోగులకు ఇస్తున్న వేతనాలు ఎక్కువేమీ కాదన్న ఆయన పనిచేస్తున్నవారికి, సంస్థ ఉన్నతికి కృషి చేస్తున్నవారికి అధిక వేతనాలు ఇవ్వడంలో తప్పేమీ లేదన్నారు. సమావేశంలో పలువురు వాటాదారులు చాలామంది ఉద్యోగులకు ఏటా కోట్లలో జీతాలున్నాయని ప్రశ్నించడంతో చంద్రశేఖరన్ పైవిధంగా సమాధానమిచ్చారు. నిజానికి సంస్థ ఆదాయంలో 53 శాతం మాత్రమే సిబ్బంది వేతనాలకు వినియోగిస్తున్నామని తెలిపారు. టీసీఎస్ ఎండీ, సీఈవో రాజేశ్ గోపీనాథన్ మాట్లాడుతూ సంస్థ డిజిటల్ రెవిన్యూ ఏటా 50 శాతం పెరుగుతున్నదని, గత ఆర్థిక సంవత్సరం సంస్థ వార్షికాదాయం 20 బిలియన్ డాలర్లుగా ఉంటే.. 6 బిలియన్ డాలర్లకుపైగా డిజిటల్ రెవిన్యూనేనని చెప్పారు.

## ఐటీసీ చీఫ్ సంజీవ్ వేతనం రూ.6 కోట్లు

### 51 శాతం పెరిగిన జీతం



**న్యూఢిల్లీ, జూన్ 13:** పలు వ్యాపారాలు నిర్వహిస్తున్న దేశంలో అతిపెద్ద సంస్థల్లో ఒకటైన ఐటీసీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ పూరి గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రూ.6.16 కోట్ల వార్షిక వేతనాన్ని అందుకున్నారు. అంతక్రితం ఏడాది పొందిన రూ.4.06 కోట్లతో పోలిస్తే 51 శాతం పెరిగింది. 56 ఏండ్ల వయస్సు కలిగిన పూరి..ఇటీవల చైర్మన్‌గా పదొన్నతి పొందారు. కోల్‌కతా కేంద్రస్థానంగా పనిచేస్తున్న ఐటీసీ వ్యవస్థాపక చైర్మన్ వైసీ దేవేశ్వర్ ఇటీవల మరణించడంతో ఆ స్థానాన్ని పూరి భర్తీచేశారు. కోటి రూపాయల కంటే అధికంగా వేతనం అందుకుంటున్న ఉద్యోగులు 91 మంది ఉన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ విడుదల చేసిన వార్షిక నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. మరణించిన దేవేశ్వర్ గతేడాదికిగాను రూ.16.62 కోట్ల రెమ్యునరేషన్ అందుకున్నారు. 2021-22లో పూరికి చైర్మన్ పదవీ లభించాల్సి ఉండగా, అంతకుముందే వరించింది. ఫిబ్రవరి 5, 2017లో సీఈవోగా నియమితులైన పూరి..ఆ తర్వాతి క్రమంలో ఎండీగా పదొన్నతి పొందారు. గతేడాదికిగాను బేసిక్ వేతనం కింద పూరికి రూ.1.44 కోట్లు లభించగా, ప్రోత్సహకాల కింద రూ.40 లక్షలు, పనితీరు ఆధారంగా ఇచ్చే బోనస్ రూ.4.32 కోట్లు అందుకున్నారు. ఐటీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్ ఆనంద్ రూ.3.62 కోట్ల వేతనాన్ని పొందగా, మరో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఫైనాన్షియల్ అధికారి ఆర్ టాండన్ రూ.3.20 కోట్లు లభించాయి. 2017-18లో సంజీవ్ పూరి..బేసిక్ వేతనం కింద రూ.1.44 కోట్లు, ప్రోత్సహాకాల కింద రూ.33 లక్షలు, పనితీరు ఆధారంగా ఇచ్చే బోనస్ రూ.2.29 కోట్లు లభించాయి. అలాగే దేవేశ్వర్ రూ.29.85 కోట్లు అందుకున్నారు. మార్చి 31 నాటికి సంస్థలో 27,279 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరానికి రూ.45,784.39 కోట్ల ఆదాయంపై రూ.12,464.32 కోట్ల లాభాన్ని గడించింది.

## ఎఫ్‌డీఐల్లో భారత్ దూకుడు

### 2018లో 42 బిలియన్ డాలర్లు: ఐక్యరాజ్యసమితి

**ఐక్యరాజ్యసమితి, జూన్ 13:** విదేశీ పెట్టుబడులు ఆకట్టుకోవడంలో భారత్ దూసుకుపోతున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో దేశంలోకి 42 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. అంతక్రితం ఏడాది వచ్చినవాటితో పోలిస్తే ఆరు శాతం పెరిగాయని ఐక్యరాజ్యసమితి తాజాగా వెల్లడించింది. తయారీ, కమ్యూనికేషన్స్, ఆర్థిక సేవల రంగాలలోకి అధికంగా వచ్చాయని 'ది వరల్డ్ ఇన్వెస్ట్‌మెంట్ రిపోర్ట్ 2019' పేరుతో విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఎఫ్‌డీఐలను ఆకట్టుకోవడంలో అంతర్జాతీయ దేశాలు విఫలమవుతున్నాయి. వరుసగా మూడు సంవత్సరాలుగా తగ్గుతూ వచ్చిన ఎఫ్‌డీఐలు 2017-18లోనూ 13 శాతం తగ్గి 1.3 లక్షల కోట్ల డాలర్లకు పడిపోయాయి. అంతక్రితం ఏడాదిలో 1.5 లక్షల కోట్ల డాలర్లు వచ్చాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆసియా అత్యధికంగా 512 బిలియన్ డాలర్లను ఆకట్టుకున్నది. వీటిలో చైనా, హాంకాంగ్, సింగపూర్, ఇండోనేషియా, భారత్, టర్కీ దేశాలు ఉన్నాయి. అంతర్జాతీయంగా వచ్చిన ఎఫ్‌డీఐల్లో ఆసియా దేశాల వాటా 33 శాతం నుంచి 39 శాతానికి ఎగబాకాయని పేర్కొంది. 2017లో 23 బిలియన్ డాలర్ల స్థాయిలో జరిగిన విలీనాలు, ఒప్పందాలు..ఆ మరుసటి ఏడాదిలో 33 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. వీటిలో రిటైల్ ట్రేడ్‌లోకి 16 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా..ఈ-కామర్స్, టెలికమ్యునికేషన్స్‌లో 13 బిలియన్ డాలర్లు వచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా 5,400 ప్రత్యేక ఆర్థిక మండళ్లు ఏర్పాటవగా..వీటిలో ఆసియాలోనే 4 వేల ఏర్పాటయ్యాయి. చైనాలో 2,500 ఎకనామిక్ జోన్లు, ఫిలిప్పీన్స్‌లో 528, భారత్‌లో 373, టర్కీలో 102 ఉన్నాయి.




## ఎస్బీఐ హైదరాబాద్ సీజీఎంగా ఓం ప్రకాశ్

**హైదరాబాద్, జూన్ 13:** బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం)గా నియమితులైన ఓం ప్రకాశ్ మిశ్రా గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత బ్యాంక్ సీఎంజీగా పనిచేసిన స్వామినాథన్ పదోన్నతితో డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా హోదాలో ముంబైలోని కార్పొరేట్ సెంటర్‌కు బదిలీ అయ్యారు. 1987లో ప్రొబేషనరీ అధికారిగా ఎస్బీఐలో కేరియర్‌ను ప్రారంభించిన మిశ్రా..పలు సర్కిళ్లలో సీజీఎంగా విధులు నిర్వహించారు.



## ఇండియాబుల్స్‌కు ఊరట

### సుప్రీం కోర్టులో పిటిషన్ ఉపసంహరణ ▪ 12 శాతం పుంజుకున్న షేర్లు




**ముంబై, జూన్ 13:** ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఐహెచ్‌ఎఫ్‌ఎల్)కు గొప్ప ఊరట లభించింది. సంస్థ యాజమాన్యం ప్రజా నిధులను దుర్వినియోగం చేసిందని ఆరోపిస్తూ సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌ను సదరు పిటిషనర్ వెనుకకు తీసుకున్నారు. గురువారం పిటిషనర్ తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నట్లు ఓ ప్రకటనలో సంస్థ తెలియజేసింది. అభయ్ యాదవ్ అనే పాల వ్యాపారితోపాటు వికాస్ శేఖర్, కిన్‌స్లే పాండే అనే మరో ఇద్దరు కలిసి ఈ పిటిషన్‌ను వేశారు. వీరిలో బ్లాక్‌మెయిల్, దోపిడీ ఫిర్యాదుపై వికాస్‌ను ఈ నెల 8న ఢిల్లీ పోలీసులు అరెస్టు చేయగా, పాండే, అతని కుటుంబ సభ్యులపై వివిధ ఢిల్లీ కోర్టుల్లో అరడజనుకుపైగా కేసులున్నట్లు ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఇండియాబుల్స్ పీటీఐకి తెలిపింది. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలూ పాండేపై క్రిమినల్ కేసుల్ని పెట్టాయని వివరించింది. ఒకసారి ఆయుధాల చట్టం కింద కూడా అరెస్టైనట్లు పేర్కొన్నది. కాగా, పాండే ఈ కేసు న్యాయవాది కూడా కావడం గమనార్హం. ఇదిలావుంటే ఈ కేసు పూర్వాపరాలు, ఆరోపణలు, అభియోగాలపై తనకు ఏమీ తెలియదని యాదవ్ అన్నట్లు ఇండియాబుల్స్ ఓ ప్రకటనలో చెప్పింది. తన సంతకాలను దుర్వినియోగపరిచి పిటిషన్ దాఖలు చేశారని చెప్పాడంటూ వెల్లడించింది. కాగా, ఇండియాబుల్స్ రిజిస్ట్రార్ కార్వీ వివరాల ప్రకారం సంస్థలో యాదవ్‌కు నాలుగు షేర్లు, వికాస్‌కు రెండు షేర్లున్నాయి. ఈ ఏడాది మే 9న యాదవ్, గతేడాది డిసెంబర్ 14న వికాస్ ఈ షేర్లను కొనుగోలు చేశారు. నిధుల దుర్వినియోగం ఆరోపణలతో గత రెండు రోజుల్లో సంస్థ మార్కెట్ విలువ ఏకంగా రూ.7,000 కోట్లు పడిపోగా, ఈ పిటిషన్‌పై వెంటనే విచారణ జరుపాలంటూ సంస్థ సుప్రీం కోర్టుకు విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పిటిషన్ ఉపసంహరణ జరుగగా, గురువారం సంస్థ షేర్లు దాదాపు 12 శాతం పుంజుకున్నాయి. బీఎస్‌ఈలో రూ.694.30 వద్ద, ఎన్‌ఎస్‌ఈలో రూ.694.70 వద్ద ముగిశాయి.

## ఒడిదుడుకుల్లో స్టాక్ మార్కెట్లు

### మిశ్రమంగా ముగిసిన సూచీలు

**ముంబై, జూన్ 13:** స్టాక్ మార్కెట్లు తీవ్ర ఆటుపోటులకు గురయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలకు తోడు రూపాయి విలువ మరింత పతనమవడంతో మార్కెట్లో సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. ఫలితంగా ప్రారంభంలోనే 300 పాయింట్లకు పైగా పతనమైన బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ చివరకు స్వల్పంగా కోలుకున్నది. మార్కెట్ ముగిసే సమయానికి 15.45 పాయింట్లు నష్టపోయి 39,741.36 పాయింట్ల వద్ద స్థిరపడింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 7.85 పాయింట్లు బలపడి 11,914.05 వద్ద ముగిసింది. వరుసగా రెండోరోజు యెస్ బ్యాంక్ భారీ పతనాన్ని మూటగట్టుకున్నది. బ్యాంక్ రేటింగ్‌ను తగ్గిస్తున్నట్లు మూడీస్ ప్రకటించడంతో గురువారం కంపెనీ షేరు ధర 12.96 శాతం తగ్గి టాప్ లూజర్‌గా నిలిచింది. వీటితోపాటు ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఇన్ఫోసిస్, మారుతి, వేదాంత, హీరో మోటోకార్ప్, టాటా మోటర్స్, ఓఎన్‌జీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఐదు శాతం వరకు తగ్గాయి. మరోవైపు పవర్‌గ్రిడ్, మహీంద్రా, కోటక్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు తమ మార్కెట్ వాటాను రెండు శాతం వరకు పెంచుకున్నాయి. వాణిజ్యంపై అమెరికా-చైనా దేశాల మధ్య జరుగుతున్న చర్చల్లో ప్రతిష్ఠంభన నెలకొనడం, మరోవైపు ఇంధన ధరలు భగ్గుమనడం, అరబ్ దేశాల్లో యుద్ధ వాతావరణ పరిస్థితులు మదుపరుల్లో ఆందోళనను పెంచాయి. ఫలితంగా అమ్మకాలకు మొగ్గుచూపడంతో ప్రారంభంలో భారీగా పతనం చెందిందని మార్కెట్ విశ్లేషకులు వెల్లడించారు. పారిశ్రామిక ప్రగతి ఆరు నెలల గరిష్ఠ స్థాయి 3.4 శాతానికి చేరుకున్నప్పటికీ..ద్రవ్యోల్బణం ఏడు నెలల గరిష్ఠ స్థాయి 3.05 శాతానికి ఎగబాకడం మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. రంగాలవారీగా చూస్తే టెక్, వాహన, ఇంధనం, ఆరోగ్య రంగాల సూచీ ఒక్కశాతం వరకు పతనమవగా, రియల్టీ, విద్యుత్, ఆర్థిక, కన్జ్యూమర్ డ్యూరబుల్, యుటిలిటీ సూచీలు మాత్రం లాభాల్లో ముగిశాయి. అరబ్ దేశాల్లో నెలకొన్న పరిణామాలతో గ్లోబల్ మార్కెట్లో క్రూడాయిల్ ధర 3.54 శాతం బలపడి 62.09 డాలర్లకు ఎగబాకింది.




## తెలుగు రాష్ర్టాల్లో ఈడెల్‌వైస్ భారీ వృద్ధి

**హైదరాబాద్, జూన్ 13:** వెల్త్‌మేనేజ్‌మెంట్ సేవల సంస్థ ఈడెల్‌వైస్ తెలుగు రాష్ర్టాల్లో భారీ వృద్ధిని నమోదు చేసుకున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో వినియోగదారుల్లో 14 శాతం వృద్ధిని సాధించింది. సాంకేతికను వినియోగించుకోవడంతోపాటు పెట్టుబడులు, ట్రేడింగ్ ప్లాట్‌ఫాంలను వినియోగదారుల వ్యక్తిగత ఆసక్తులను తగిన రీతిలో అందించడం వల్లనే రెండంకెల వృద్ధి నమోదైందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. గడిచిన రెండేండ్లలో కంపెనీ ఆదాయంలో 63 శాతం పెరిగింది.

# ఏపీ స్పీకర్‌గా తమ్మినేని సీతారాం

ఏకగ్రీవంగా ఎన్నికైన సభాపతిని అభినందించిన ఎమ్మెల్యేలు

శాసనసభ నిర్ణయాలను న్యాయస్థానాలు సమీక్షించాల్సిన పరిస్థితి రాకూడదు: సీతారాం



ఏపీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతిగా శ్రీకాకుళం జిల్లా ఆముదాల వలస ఎమ్మెల్యే తమ్మినేని సీతారాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ ఎన్నికకు బుధవారం ఆయన ఒక్కరే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. గురువారం ఉదయం సభ ప్రారంభమైన తర్వాత ప్రొటెం స్పీకర్ శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సభాపతి ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు తదితరులు తమ్మినేనిని సభాపతిస్థానం వరకు తోడ్కొని వెళ్లగా.. ఆయన స్పీకర్ స్థానంలో ఆసీనులయ్యారు. స్పీకర్ ఎన్నికపై ధన్యవాదాల అంశంపై చర్చ అనంతరం తమ్మినేని మాట్లాడారు. సభాపతిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అధికార, ప్రతిపక్షసభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సభాగౌరవాన్ని కాపాడుకోవాలని, దీనికి అధికార, ప్రతిపక్ష సభ్యులు సహకరించాలన్నారు. శాసనసభ నిర్ణయాలను న్యాయస్థానాలు సమీక్షించాల్సిన పరిస్థితి ఏనాడూ రాకూడదని కోరుకుంటున్నానని చెప్పారు. సభ్యులంతా మంచి శాసనసభ వ్యవస్థ నిర్మాణానికి కృషి చేయాలని, దేశంలోనే ట్రెండ్‌సెట్టర్‌గా ఈ సభ నిలవాలని సభాపతి ఆకాంక్షించారు. శాసనసభ నిర్వహణకు రోజుకు రూ.6 లక్షలు ఖర్చవుతుందని, అందుకే సభా సమయాన్ని దుర్వినియోగం చేయొద్దని సూచించారు. త్వరలో సభ్యులందరికీ నిష్ణాతులతో శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. సభాపతి ప్రసంగం అనంతరం సభ శుక్రవారానికి వాయిదా పడింది.

## జగన్, చంద్రబాబు మధ్య

# మాటల యుద్ధం



గురువారం అసెంబ్లీలో మాట్లాడుతున్న ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

### ఫిరాయింపులపై నేతల మధ్య ఘాటు చర్చ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన రెండోరోజే అధికార, ప్రతిపక్ష సభ్యుల మ ధ్య మాటల యుద్ధం కొనసాగింది. నూతన సభాపతికి ధన్యవాదాలు తెలిపే అంశంపై చర్చ సందర్భంగా ఇరుపక్షాలు వ్యక్తిగత దూషణలకు దిగాయి. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబు పరస్పరం విమర్శలు చేసుకోవడంతో సభలో వేడి పెరిగింది. ఏపీ శాసనసభ స్పీకర్‌గా నియమితులైన సీతారాంకు ప్రభుత్వం తరపున, రాష్ట్ర ప్రజల తరపున సీఎం అభినందనలు తెలిపారు. సభలో సీఎం జగన్ మాట్లాడుతూ.. 'ఇదే శాసనసభలో విలువలు లేని రాజకీయాలు చూశాం. పార్టీ కండువాలు మార్పించి మంత్రి పదవులు ఇచ్చిన వైనాన్ని చూశాం. పార్టీ ఫిరాయింపుల నిషేధ చట్టాన్ని తుంగలోకి తొక్కి సభ ప్రతిష్ఠను ఎలా దిగజార్చారో చూశాం. చివరకు స్పీకర్‌పై అవిశ్వాసానికి ఉన్న నిబంధనను అప్పటికప్పుడు మార్చడం చూశాం. నేను కూడా అలాంటి అన్యాయమైన సంప్రదాయంపాటిస్తే మంచి ఎక్కడా బతకదు. ఎమ్మెల్యేలను కొనుగోలుచేసిన పార్టీకి అక్షరాలా 23 సీట్లే వచ్చాయి. ముగ్గురు ఎంపీలను కొనుగోలుచేస్తే అక్షరాలా మూడే మిగిలాయి. దేవుడు ఎంత గొప్పగా స్క్రిప్టు రాస్తా డో దీన్ని బట్టి అర్థమైంది. అన్యాయంచేస్తే శిక్ష ఎలా ఉంటుందో దేవుడు చూపించారు' అని అన్నారు.

**వైఎస్ పార్టీ మారలేదా?: చంద్రబాబు**

సీఎం జగన్ వ్యాఖ్యలపై చంద్రబాబు స్పం దించారు. తొలి ప్రసంగంలోనే జగన్ ఇలా మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. 'సీఎం ప్రసంగం ప్రతిపక్షాన్ని కించపరిచేలా ఉంది. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలి. 1978లో రెడ్డి కాంగ్రెస్ నుంచి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యే అయినప్పుడు పార్టీ మారలేదా? గెలిచిన నాలుగురోజుల్లోనే పార్టీ మారారు. అప్పట్లో భాట్టం శ్రీరామ్మూర్తిగారు మీకంటే ఎక్కువ ఘాటుగా విమర్శించారు.' అని వ్యాఖ్యానించారు.

**రెండోరోజే ఎందుకంత అసహనం: రోజా**

స్పీకర్ కుర్చీని అవమానించడం, దాన్ని దుర్వినియోగపరచడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని నగరి ఎమ్మెల్యే రోజా విమర్శించారు. తమ్మినేని సభాపతి అయినందుకు అచ్చెన్నాయుడికి సంతోషం కంటే కడుపుమంటే ఎక్కువగా ఉన్నట్టు ఆయన మాటల్లో కనబడుతున్నదని విమర్శించారు. ప్రతిపక్షంలో కూర్చున్న రెండోరోజుకే అంత అసహనం ఎందుకు? జగన్ ప్రతిఒక్కరినీ గౌరవిస్తూ సామాజిక న్యాయంచేస్తూ ముందుకెళ్తుంటే.. టీడీపీ నేతలు ప్రతిదాన్ని రాజకీయం చేయడమెందుకని ప్రశ్నించారు.

## గ్రామీణ యువతకు 'అపరెల్' శిక్షణ

ఏటీడీసీ డైరెక్టర్ రవికిశోర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అపరెల్ ట్రైనింగ్ అండ్ డిజైన్ సెంటర్ (ఏటీడీసీ) ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఏటీడీసీ డైరెక్టర్ రవికిశోర్ తెలిపారు. ఒక సంవత్సరం డిప్లొమా కోర్సులైన అపరెల్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ (ఏఎంటీ), ఫ్యాషన్ డిజైనింగ్ టెక్నాలజీ (ఎఫ్‌డీటీ) కోర్సులు చేయదలుచుకున్న విద్యార్థినులకు యూఎస్‌ఏకు చెందిన ప్రముఖ దుస్తుల బ్రాండ్ జీఏపీ సంస్థ సహకారంతో శిక్షణ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా 50 మంది విద్యార్థినులకు మెరిట్ కమ్ మీన్స్ ఫ్రీ-షిప్ ఇస్తారని తెలిపారు. గురువారం కవాడిగూడలోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) కార్యాలయంలో రవికిశోర్ మీడియాతో మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడినవర్గాలకు చెందిన అర్హులైన విద్యార్థినులను ప్రోత్సహించేందుకు జీఏపీ సంస్థ ఈ ఫ్రీ-షిప్‌ను ఇస్తుందని, ఆరునెలల శిక్షణ అనంతరం రూ.14 వేలు, అంతకుమించిన ప్రారంభవేతనంతో దేశంలోని రెడీమేడ్ గార్మెంట్ పరిశ్రమలో ప్లేస్‌మెంట్‌కు అవకాశం లభిస్తుందన్నారు. ఈ కోర్సును తెలంగాణ ప్రభుత్వ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ మార్కెటింగ్ మిషన్ (ఈజీఎంఎం) సహకారంతో భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధిశాఖ డీడీయూ- జీకేవై పథకంలో భాగంగా అమలు చేస్తున్నదని తెలిపారు. ప్రస్తుతం రెండో బ్యాచ్‌కు శిక్షణ ఇస్తున్నామని, మూడో బ్యాచ్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి శనివారం వరకు గడువు ఉందని చెప్పారు. మిగతా వివరాలకు 9611238944 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

• క్షీరాభిషేకం



విద్యా వలంటీర్లు గురువారం జనగామలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వం మరోసారి రెన్యువల్ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం విద్యా వలంటీర్ల సంఘం ఆధ్వర్యంలో జనగామలోని ఆర్టీసీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, విద్యా శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు.

– జనగామ, నమస్తే తెలంగాణ

## ట్రావెల్స్ బస్సు బోల్తాపడి మహిళ మృతి

- నలుగురికి గాయాలు
- సూర్యాపేట జిల్లా కోదాడ శివారులో ఘటన

**అనంతగిరి:** ముందు వెళ్తున్న డీసీఎంను ఢీకొట్టి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తాపడడంతో ఒకరు మృతిచెందగా, నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సూర్యాపేట జిల్లా కోదాడ శివారులో 65వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. 55 మందితో ఓ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి విజయనగరం బయలుదేరింది. కోదాడ దాటిన తర్వాత బర్రె అడ్డు రాగా తప్పించే క్రమంలో ముందు వెళ్తున్న డీసీఎంను ఢీకొట్టి బోల్తా పడింది. బస్సులో ఉన్న విజయనగరానికి చెందిన దుర్గమ్మ(62) మృతి చెందగా.. అదే ప్రాంతానికి చెందిన జయ, గణపతి, సూర్యకుమార్, రాజు తీవ్రంగా గాయపడ్డారు.

**కారు, ఆటోను ఢీకొట్టిన లారీ**

**హుజూరాబాద్‌టౌన్:** అతివేగంతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న కారు, ఆటోను ఢీకొట్టగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ శివారులోని ఎస్సారెస్పీ కాలువ సమీపంలో గురువారం జరిగింది. కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఎదురుగా వస్తున్న కారును, ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఎనిమిది మంది గాయపడ్డారు. కేశవపట్నం మండలం మెట్‌పల్లికి చెందిన వంతడ్పుల సంపత్, వంతడ్పుల సమ్మక్క, ఎరడపెల్లికి చెందిన మూసా రాములు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఐదుగురు స్వల్పంగా గాయపడగా.. 108, బ్లూకోట్స్ సిబ్బంది క్షతగాత్రులను హుజూరాబాద్ దవాఖానకు తరలించారు. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి.



సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లి శివారులో బోల్తా పడిన డీజిల్ ట్యాంక్

### డీజిల్ ట్యాంకర్ బోల్తా

**చివ్వెంల:** డీజిల్ ట్యాంకర్ బోల్తా పడటంతో అందులోని 5 వేల లీటర్ల డీజిల్ నేలపాలైన ఘటన గురువారం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లి శివారులో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కోదాడ నుంచి హైదరాబాద్‌కు డీజిల్ లోడుతో వెళ్తున్న ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. దాదాపు 5 వేల లీటర్ల డీజిల్ నేలపాలు కాగా కొద్దిమేర స్థానికులు ఎత్తుకెళ్లారు. ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డాడు.

## పోలవరంపై ఖర్చులను వెనక్కివ్వండి

కేంద్రానికి ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ** పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం చేసిన ఖర్చులను రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని వెనక్కి ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర జలవనరులశాఖ అధికారులు.. ఆర్థికశాఖ అనుమతి కోసం ఫైల్‌ను పంపారు. కేంద్ర ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి ఆమోదం తర్వాతే నిధుల విడుదలకు అవకాశం ఉన్నట్టు సమాచారం. ఆర్థికశాఖ అనుమతిస్తే ఆ ఫైల్‌ను జలవనరులశాఖ.. నాబార్డుకు పంపనున్నది. స్టాప్‌వర్క్ ఉత్తర్వులను శాశ్వతంగా నిలుపుదల చేసే అంశంపైనా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ దస్త్రం కేంద్ర అటవీ పర్యావరణశాఖ ఉన్నతాధికారుల పరిశీలనలో ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. నవ్యాంధ్ర ప్రజల జీవనాడి ప్రాజెక్టుగా ఉన్న పోలవరంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.5 వేల కోట్లు ఖర్చుచేసింది.

## ఆన్‌లైన్ అక్రెడిటేషన్ కార్డుల జారీపై శిక్షణ

హాజరైన వివిధ జిల్లాల డీపీఆర్వోలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జర్నలిస్టులకు కొత్తగా ఆన్‌లైన్ అక్రెడిటేషన్ కార్డుల జారీ సందర్భంగా పాటించాల్సిన నిబంధనలపై వివిధ జిల్లాల పౌరసంబంధాల అధికారుల (డీపీఆర్వో)కు రెండురోజుల శిక్షణ హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో గురువారం ప్రారంభమైంది. సమావేశంలో పౌరసంబంధాలశాఖ అదనపు డైరెక్టర్ నాగయ్య కాంబ్లే, జాయింట్ డైరెక్టర్ డీఎస్ జగన్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌ఏ హష్మీ, ఐటీశాఖ నుంచి శివ, అనిల్ పాల్గొన్నారు.










నమస్తే తెలంగాణ
/nt.zindagi
WWW. NTNEWS.COM
# జిందగీ
శుక్రవారం 14 జూన్ 2019



## పిల్లలు స్కూలుకు వెళ్తున్నారా?

**పాఠశాలలు ప్రారంభమయ్యాయి. పుస్తకాలు, స్కూలు బ్యాగులతో అంతటా సందడి నెలకొంది. పిల్లల్ని స్కూలుకు పంపించే క్రమంలో తల్లిదండ్రులు తప్పకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్న చిన్న పొరపాట్లు జరగకుండా చూసుకుంటే పిల్లల ఆరోగ్యం, చదువు బాగుంటుంది.**



- వర్షాకాలంలో కాలు బయట పెట్టాలంటే పిల్లలకు చాలా గమ్మత్తుగా ఉంటుంది. చలాకీగా ఉండే పిల్లలైతే స్కూల్ కారిడార్స్, కాంపౌండ్లలో ఎల్లప్పుడు పరిగెడుతూ ఉంటారు. ఇలాంటి సమయంలో జారిపడిపోకుండా వారికి మంచి గ్రిప్ ఉన్న షూలు వెయ్యాలి.
- ఈ వర్షాకాలంలో స్కూలుకు వెళ్లాక, ప్లే గ్రౌండ్‌లో ఇతర ప్రదేశాల్లో ఉన్నప్పుడు దోమలు కుట్టకుండా పిల్లలపై బట్టలపై నాలుగు చుక్కలు గుడ్ నైట్ ఫ్యాబ్రిక్ రోల్– ఆన్ వేయాలి.
- మంచి రెయిన్ కోట్, గొడుగు ఈ రెండింటిలో ఏ ఒక్కటి లేకుండా కూడా పిల్లల్ని బయటకు పంపవద్దు. గాలితో కూడుకున్న భారీ వర్షం కురిసేటప్పుడు మాత్రం గొడుగు కన్నా రెయిన్ కోట్ ఉపయోగించడం మంచిది.
- పిల్లల బట్టలను, టవల్స్‌ను పొడిగా ఉంచాలి. వాడిన బట్టలను, సాక్సులను ఎప్పటికప్పుడు ఉతికి ఆరేయాలి. టవల్‌ను పొడిగా ఉంచాలి.
- వర్షాకాలం ఆహారం తీసుకునే ముందు చేతులు కడుక్కునేలా ప్రోత్సహించాలి. హ్యాండ్ కర్చీఫ్ వెంట ఉంచాలి. ముక్కు, ముఖం తుడుచుకోవాల్సి వస్తే కచ్చితంగా కర్చీఫ్ వాడేలా చూడాలి.

# అచ్చు అమ్మలాగే..!

**సంతూర్ మమ్మీల్లాగా ఉండాలనుకునే పిల్లలు కోకొల్లలు.. మరి అమ్మలా చీర చుట్టి.. అమ్మలాగే పెద్ద పెద్ద గౌన్లు.. సంప్రదాయంగా ఓణీలు.. అచ్చు అమ్మలాగే తయారవ్వాలనుకునే అమ్మాయిలు బోలెడు.. ఇద్దరూ మ్యాచింగ్.. మ్యాచింగ్ అంటూ తిరుగాలని.. అన్ని చోట్లా అమ్మతో సమానంగా సందడి చేయాలనుకుంటున్నారు పిల్లలు.. అందుకే తల్లికూతుళ్ల ఫ్యాషన్ ఈ వారం మీ కోసం ప్రత్యేకంగా..**




**రితీషా సతీష్‌రెడ్డి**
ఈశా డిజైనర్ హౌస్
సుచిత్రా, హైదరాబాద్
ఫోన్ : 8500028855
https://www.facebook.com/eshadesignerworks/

**1** వెస్ట్రన్ లుక్ కోసం ఈ డ్రెస్ వేయాల్సిందే! ఇద్దరికీ సేమ్ ఫ్యాబ్రిక్స్‌ని ఉపయోగించాం. మల్టీ కలర్ నెట్ ఫ్యాబ్రిక్‌ని తీసుకొన్నాం. సిల్వర్ కలర్ రాసిల్క్ తీసుకొని పువ్వుల్లా కుట్టి రెండు గౌన్ల మీద అటాచ్ చేశాం. పైన మాత్రం తెల్లని సీక్వెన్స్ వర్క్ వచ్చిన ఫ్యాబ్రిక్‌ని ఎంచుకున్నాం. కాకపోతే అమ్మకు బటర్ ఫ్లై స్లీవ్స్ ఇచ్చాం. కూతురికి మాత్రం ఒక వైపు అది కూడా ఆరెంజ్ కలర్ నెట్‌తో లేయర్లుగా స్లీవ్ జతచేశాం. ఇక ఇద్దరికీ యెల్లో కలర్ సాఫ్ట్ నెట్‌ని దుపట్టాగా తీసుకున్నాం. అమ్మకు ప్రత్యేకంగా రాసిల్క్‌తో పువ్వుల డిజైన్‌లా మెషీన్ ఎంబ్రాయిడరీ చేసి ఈ చున్నీకి మధ్యలో అటాచ్ చేశాం. ఇక పాప విషయానికొస్తే.. ఆరెంజ్ కలర్ నెట్‌తో చిన్న పువ్వు కుట్టి చున్నీకి జత చేయడంతో సూపర్‌గా కనిపిస్తున్నది.

**2** కొద్దిగా కూడా వేరియేషన్ వద్దు అనుకునే వాళ్లకు ఇది పర్‌ఫెక్ట్ చాయిస్. పైగా సంప్రదాయంగా కూడా ఉంది. ఉప్పాడ పట్టుతో బ్లూ, గోల్డ్ కాంబినేషన్ వచ్చిన లెహంగాని తీసుకున్నాం. వీటికి గోల్డెన్ బార్డర్, పింక్ కలర్ రాసిల్క్‌తో చిన్న చిన్న ప్లీట్స్‌లాగా బార్డర్‌లని కుట్టడంతో బుట్టబొమ్మల్లాగా కనిపిస్తున్నారు. ఇద్దరికీ బ్లూ బెనారస్ మీద సీక్వెన్స్ వర్క్, పింక్ కలర్ స్లీవ్స్ కుట్టాం. కాకపోతే రెండు బ్లౌజ్ ప్యాటర్న్‌లను కొంచెం మార్చాం. ఇక పింక్ కలర్ బెనారస్ దుపట్టాలకి గోల్డెన్ జరీ వచ్చిన బార్డర్‌ని జత చేయడంతో మెరిసిపోతున్నది.

**3** పేస్టల్ బ్లూ, హాఫ్ వైట్ కాంబినేషన్‌లో సిల్క్ మెటీరియల్‌తో అమ్మకు చీర డిజైన్ చేశాం. పల్లూకి సీక్వెన్స్ బార్డర్‌లా కుట్టి, మల్టీ కలర్ టస్సెల్స్‌ని వేలాడదీశాం. దీంతో సూపర్‌గా కనిపిస్తున్నది. మల్టీ కలర్ పట్టు బ్లౌజ్‌కి బుగ్గ చేతులు మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. మల్టీ కలర్ ఫ్లోరల్ బెల్ట్ అదనపు ఆకర్షణ. పాప కోసం ఫ్రాక్‌గా సేమ్ ఫ్యాబ్రిక్స్‌ని ఉపయోగించాం. కింద వైపు చెక్స్ ఫ్యాబ్రిక్, పైన మల్టీకలర్ ఫ్యాబ్రిక్స్‌ని వాడాం. కాకపోతే పాప గౌనుకి పేస్టల్ బ్లూ కలర్. చమ్కీ వర్క్ వచ్చిన నెట్ ఫ్యాబ్రిక్‌ని తీసుకొని గౌన్ కింద భాగం, స్లీవ్స్‌కి అటాచ్ చేశాం. పెద్ద కాలర్, డ్రెస్ మీద వచ్చిన టస్సెల్స్ గౌను లుక్‌ని మార్చేశాయి.

**4** బాటిల్ గ్రీన్ కలర్ కుప్పాడం పట్టుతో ఇద్దరికీ లాంగ్ గౌన్లు కుట్టాం. దీనికి బార్డర్‌గా పెద్ద పింక్ బార్డర్‌ని జతచేశాం. అమ్మ డ్రెస్ హ్యాండ్స్ కోసం పింక్ నెట్‌ని వాడాం. దీని మీద అక్కడక్కడ ముత్యాలను ఇచ్చాం. నెక్ లైన్ దగ్గర నుంచి ఎడమ వైపు వచ్చేలా పట్టు ఫ్యాబ్రిక్‌తో ఒక లేయర్‌ని అటాచ్ చేశాం. గోల్డెన్ బెల్ట్ అదనపు ఆకర్షణ. నెట్ దుపట్టా మీద కూడా ముత్యాలు, బార్డర్‌కి గోల్డెన్ ట్యూబ్స్ ఇవ్వడంతో మెరిసిపోతున్నది. పాపకి నెక్ లైన్ నుంచి కింద నడుము వరకు నెట్‌ని వాడాం. పెద్ద బెల్ట్‌ని కూడా ఇచ్చాం. మధ్యలో సీక్వెన్స్‌తో వచ్చిన ఒక పువ్వును కుట్టాం. పట్టు ఫ్యాబ్రిక్‌తో 3/4 స్లీవ్స్ మరింత ముద్దుగా కనిపిస్తున్నాయి.

## గర్భిణులకు అండగా..!





**మెడికల్ కోర్సు చదివిన వారందరూ పట్టణాల్లో ఉండే దవాఖానాల్లో పనిచేయాలనే కోరుకుంటారు. వీరిలానే ఆమె కూడా అనుకుంటే ఆ గ్రామ గర్భిణులు ఏమయ్యేవారు. వారికి అండగా 'నేనున్నాన'ంటూ కదిలిందో అమ్మాయి.**

అది ఉత్తరాఖండ్‌లోని పౌరీ ఘర్వాల్ జిల్లా, పాతిసైన్ గ్రామంలో వైద్య శిబిరాలు సరిగా లేవు. ప్రసవ సమయంలో ప్రాణాలు పోగొట్టుకున్న గర్భిణులు అనేకం. 2013లో మెడికల్ ఆఫీసర్ ఇన్‌చార్జ్‌గా ఆర్తి బెహల్ పాతిసైన్‌ను నియమించారు. అప్పటికే హద్వానిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చేసింది. తదనంతరం ఐదేండ్లపాటు వైద్యసేవలు చేస్తానని బాండ్ పేపర్‌పై సంతకం చేసింది. తీరా చూస్తే అది కొండలోయల్లో ఉండే పాతిసైన్ ప్రాంతం. ఆర్తీ షాక్‌కు గురైంది. ఏది ఏమైనా అనుకొని ఆర్తీ డ్యూటీలో చేరింది. అక్కడ పరిస్థితుల్ని చక్కగా అవగాహనకు తెచ్చుకుంది. గ్రామంలోని గర్భిణులకు అప్పటి నుంచి దగ్గరుండి చికిత్స చేస్తున్నది. వైద్య శిబిరంలో గ్లౌవ్స్‌లు, సిరంజీలు, సెలైన్ బాటిల్స్ అన్నీ చిందరవందరగా పడి ఉన్న వాటిని తానే స్వయంగా తీసి హాస్పిటల్‌ను శుభ్రంగా ఉంచుతుంది. అక్కడుండే కొంతమంది డాక్టర్లు విరమణ తీసుకోవడంతో ప్రియాంక సైని, సంజయ్ బాంతియాల్ మరికొంతమంది నర్సులను ఉద్యోగంలో పెట్టుకున్నారు. వారితో అందరికీ వైద్యం అందేలా చేస్తుంటుంది. అక్కడుండే ప్రజలతో మాట్లాడి వారికి అవసరమయ్యే సదుపాయాలపై అవగాహన కలిగేలా పంచాయతీలో కూడా మాట్లాడింది ఆర్తి. ఇలా మూడేండ్లలో ఎక్కువ మంది డాక్టర్లు ఉండడంతో ఆర్తీ బాండింగ్‌ను కూడా రద్దు చేశారు. అయినా ఆమె వసతులు లేని ఆ కొండ ప్రాంతాల నుంచి వెళ్లాలనుకోలేదు. పోయినేడాది ప్రధాన వైద్య అధికారిని ఒప్పించి కొత్త విద్యుత్ సరఫరా, పైప్‌లైన్ల ఏర్పాటు చేయించింది. ఆర్తీ జీవితంలో ఇదో పెద్ద విజయం. 2013కు ముందు పదిమంది మహిళల్లో ఒకరు మాత్రమే తమ పూర్తి వైద్య సంరక్షణను అందుకున్నారు. 2018 నాటికి ఆ ప్రాంతంలో గర్భిణులందరికీ తమ వైద్య సంరక్షణ అందుతున్నది. అంతా ఆర్తి చొరవే అంటున్నారు అక్కడి గ్రామస్తులు.

## మీగడతో చర్మానికి మేలు



- రాత్రి పడుకునే ముందు ముఖానికి పాలమీగడ రాసుకుని, బాగా మర్దన చేయాలి. ఉదయం కడిగేసుకోవాలి. ఇలా కొన్ని రోజులు చేయడం వల్ల ముఖంపై చర్మం మృదువుగా ఆరోగ్యంగా కనిపిస్తుంది.
- రాత్రిళ్లు కొద్దిగా ఆలివ్ నూనెను రాసుకుని మర్దన చేస్తున్నా మర్నాటికి ముఖం తాజాగా, కోమలంగా కనిపిస్తుంది. కొందరికి నిద్రలేవగానే ముఖం ఉబ్బినట్లుగా ఉంటుంది. ఆ సమస్య తగ్గించుకోవాలంటే రాత్రి భోజనంలో ఉప్పు శాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలి.
- రాత్రి పడుకునే ముందు ముఖాన్ని శుభ్రం చేసుకోవడం తప్పనిసరి. ముఖ్యంగా ముఖానికి, కంటి భాగంలో ఏదయినా మేకప్ వేసుకుంటే దాన్ని తప్పనిసరిగా తొలగించుకోవాలి. తర్వాత కొద్దిగా మాయిశ్చరైజర్‌ను ముఖానికి రాసుకోవాలి. ముఖం కడుక్కున్న వెంటనే రాసుకోవడం వల్ల చర్మం అందంగా ఆరోగ్యంగా ఉంటుంది.
- బంగాళాదుంపలను సన్నని చక్రాల్లా తరిగి నీళ్లలో పదినిమిషాలు నానబెట్టండి. తర్వాత వాటిని ముద్దగా నూరి ముఖానికి, మెడకు రాయాలి. పదినిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేస్తే ముఖం, మెడ కాంతివంతమవుతాయి.

**అడుగండి చెబుతా**



**నేను లెక్చరర్‌ని. నా వయసు 36 ఏండ్లు. కొంతకాలంగా తీవ్రమైన తలనొప్పి వస్తున్నది. ఇల్లు.. ఉద్యోగం పని ఒత్తిళ్ల వల్ల ఇలా వస్తుందేమో అనుకున్నా. నొప్పి భరించలేక డాక్టర్‌ను సంప్రదించాను. సూచించిన మందులు వాడాను. అవి వాడినంత కాలం తగ్గినట్లే అనిపించింది. ఇప్పుడు అదే తీవ్రమైన తలనొప్పి మళ్లీ వస్తున్నది. నాకు ఆందోళనగా ఉంది. ఈ నొప్పి ఏంటి? ఎందుకు తగ్గడం లేదు? ఈ సమస్యకు పరిష్కారం ఏంటి? దయచేసి తెలుపగలరు.**

**- బి. సుధా మాధురి,** హబ్సిగూడ

## తలనొప్పి తగ్గేదెలా?

మీకెలాంటి ఆందోళనా అవసరం లేదు. తలనొప్పికి చాలా కారణాలు ఉంటాయి. ప్రధానంగా అధిక రక్తపోటు, మధుమేహం, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రక్తప్రసరణలో మార్పులు, మెదడులో కణుతులు లాంటి అనేక కారణాల వల్ల తలనొప్పి వస్తుంది. ఇక.. మీరనుకుంటున్నట్లు పని ఒత్తిడి వల్ల కూడా తలనొప్పి సమస్యలు వస్తాయి. అయితే మీకు ఈ నొప్పి రెండువైపుల వస్తుందా? ఒకవైపు మాత్రమేనా? రెండువైపులా అనేది స్పష్టంగా తెలియజేయలేదు. అలాగే తలనొప్పి వచ్చినప్పుడు తుమ్ములు రావడం, ముక్కు నుంచి నీరు కారడం వంటి లక్షణాలు ఉన్నాయా? ఒకసారి పరిశీలించండి. ఒకవేళ ఈ లక్షణాలు కూడా ఉంటే మీకు మైగ్రేన్ ఉన్నట్లు భావించవచ్చు. దీనిని పార్శ్వపు నొప్పి అంటారు. స్త్రీలలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. పని ఒత్తిడితో తలలోని రక్తనాళాలు ఒత్తిడికి గురికావడం వల్ల కూడా మైగ్రేన్ వస్తుంది. అధిక రక్తపోటు కూడా వస్తుంది. ఒకసారి వెంటనే బీపీ చెక్ చేయించుకోండి. బీపీ.. షుగర్ వల్లనే అయితే మందులతో తగ్గిపోతుంది. ఈ రెండు కారణాల వల్ల కాకపోతే మాత్రం చికిత్స తప్పనిసరి. న్యూరాలజీ స్పెషలిస్ట్‌కు చూపించుకోండి. బ్లడ్‌టెస్ట్, సీటీ స్కానింగ్ పరీక్షలు చేసి సమస్యకు కారణం ఏంటో నిర్ధారిస్తారు. జీవనశైలిలో ఆరోగ్యకరమైన మార్పులు చేసుకోవడం మాత్రం తప్పనిసరి. ఒత్తిళ్లు ఉంటే తగ్గించుకోవాలి.



**డాక్టర్ ఆర్ కిరణ్‌కుమార్**
సీనియర్ న్యూరో ఫిజీషియన్
యశోద హాస్పిటల్స్,
మలక్‌పేట

# పరమానంద ప్రాప్తికి మార్గం

తత్వబోధ



మనిషికి పరమానందం ఎప్పుడు సంప్రాప్తిస్తుంది? జన్మరాహిత్యమైన మోక్షం లభించినప్పుడా? ఆత్మ ఎప్పటికైనా పరమాత్మలో లీనమైనప్పుడా? నిజానికి అన్ని ఆనందాల్లోకెల్లా అత్యంత ఉత్కృష్టమైన మహదానందం మరొకటి ఉంటుందని ఆధ్యాత్మిక వేత్తలు అంటారు. అదే లోకకళ్యాణం. అందుకే, భారతీయ ధర్మశాస్త్రాలు 'సర్వేజనా స్సుఖినోభవంతు', 'లోకాస్సమస్తా స్సుఖినోభవంతు' అంటుంటాయి. దీని సాధనకే ప్రతి మనిషీ కట్టుబడాలి. ఇదే పరమానందంలోని ప్రధాన సూత్రం!

పరమాత్మ ఎల్లవేళలా ఆనంద స్వరూపుడే. అందుకే, ఆయనను 'ఆనందో బ్రహ్మ' అన్నాం. ఇదే స్వభావం అవిభాజ్యమైన జీవులందరికీ వర్తిస్తుంది. నిజానికి జీవులన్నింటి సహజ స్వభావం ఆనందంగా ఉండడమే. మానవుడు వ్యక్తిగతంగా తనకు మాత్రమే ఆనందం కలగాలని కోరుకోకూడదు. ప్రజలందరూ ఆనందంగా ఉండాలనే అభిలషించాలి. మనిషి చూడడానికి వ్యష్టిలా కనిపిస్తాడు. కానీ, అతడు సమిష్టి. అదే భారతీయాత్మ. ఇదే మన జీవన విధానం.

ఒక కుండ ఉందంటే, సృష్టిలో అది ఎంతో కొంత స్థలాన్ని ఆక్రమించినట్లే లెక్క. కానీ, దాన్ని పగులగొడితే ఏమవుతుంది? అందులోని ఖాళీ స్థలం ఈ అనంతాకాశంలో విలీనమవుతుంది. సరిగ్గా, ఇలాంటిదే దేవ-జీవ తత్వం కూడా. మనిషి దగ్గర ఎన్ని సంపదలున్నా, ఎన్నెన్ని పదవుల్ని అతను సంపాదించినా ఒంటరిగా జీవించడం చాలా కష్టం. కాబట్టే, భగవంతుడు మనిషితోపాటు పశువులు, పక్షులు, చెట్లు, చేమలు, నదీనదాలు వంటి ప్రకృతినంతా సృష్టించాడు. వివేచనాపరుడైన మానవుడు వీటన్నింటితో సమన్వయం సాధించాలి. అప్పుడే మనిషికి మనుగడ, అతని జన్మకు సార్థకత. కాబట్టే, సృష్టిలోని సమస్త జీవులూ ఆనందంగా ఉండాలని కోరుకోవాలనడం. ప్రేమపూర్వక హృదయంతో పలికే ఆనందామృత వచనాలు ఏవైనా వినేవారిని సన్మార్గంలో నడిపిస్తూ సానుకూల జీవనాన్ని ప్రసాదించేవే. అవి మనిషికీ, మనిషికీ మధ్య అంతరాన్ని తొలగించి, సామాజిక బంధాన్ని పరిపుష్టం చేస్తాయి. లోకంలోని వారందరూ సుఖంగా ఉండాలని, ఆరోగ్యభోగభాగ్యాలతో తులతూగాలని, దు:ఖాలకు దూరంగా జీవించాలన్నదే ఆ పరమాత్మ అభిలాష.

-డా|| పి.భాస్కరయోగి

---

మల్లాది వెంకట కృష్ణమూర్తి | తీర్థయాత్ర | 8



# నర్మద పరిక్రమ



## కర్మబంధంతోనే దైవానుగ్రహం!

(గత సంచిక తరువాయి)

'అప్పుడే అలా చూపించి ఉంటే 26 ఏండ్ల నా జీవితం లౌకికంగా వృథా కాక పోగా, నేను పలు దుష్కర్మలు అధికంగా చేసిన ఆ కాలంలో వాటిని చేసి ఉండేవాడిని కాదు కదా! తద్వారా వాటి పాపభారం నాపైన పడేది కాదు కదా?' అన్న ఆలోచనతో 'సాయిబాబా నాకు న్యాయం చేయలేదన్న' బాధ కాస్తా కోపంగా మారింది. పూర్వజన్మలో నాకు షిరిడీ సాయిబాబాతో భరద్వాజ మాస్టారుకు ఉన్నట్లుగా ఎలాంటి కర్మబంధం ఉండి ఉండదన్న సంగతి అప్పట్లో నాకు తెలీదు. క్రమంగా కర్మ సిద్ధాంతం మీద విపులమైన ఓ అవగాహన ఏర్పడ్డాక బాబాపైన నాలో ఉండిన ఆ కోపం చల్లారింది.

ఇంకొద్ది వెనక్కి వెళితే, ఇదే విధంగా 'మాతా అమృతానందమయి దగ్గరకు కూడా వెళ్లే గొప్ప అవకాశాన్ని కూడా నేను అప్పట్లో ఒకసారి కోల్పోయానని' అనేకసార్లు బాధపడ్డాను. 1969 డిసెంబర్‌లో నాకు కేరళలోని ఓ స్పిన్నింగ్ మిల్లులో అకౌంట్స్ సెక్షన్‌లో ఉద్యోగం వచ్చింది. కానీ, నా తల్లిదండ్రులు నేను అంత దూరం వెళ్లడానికి ఇష్టపడలేదు. మా నాన్నగారు నాకు హైదరాబాద్‌లోని పెంగ్విన్ టెక్స్‌టైల్స్ అనే మరో స్పిన్నింగ్ మిల్లులో ఉద్యోగం ఇప్పించారు. అప్పటికి సుధామణిగా అమ్మ (అమృతానందమయి) కేవలం కేరళకే పరిమితం, బయటి ప్రపంచానికి తెలీదు. నేను కేరళకు కనుక అప్పుడే వెళ్లి ఉంటే, అమ్మ గురించి విని ఆవిడను దర్శించి ఉండేవాడినని, అమ్మ భక్తికి ఆకర్షితుణ్ణయి ఆమె దగ్గరే స్థిరపడ్డ అనేకమంది సాధువులలో ఒకడినై, ఆధ్యాత్మిక సాధనను చేసుకుంటూండే వాడినని' తరచూ నాకు అనిపిస్తుంటుంది. ఐతే, ఇక్కడ కూడా అమ్మతో నాకు పూర్వజన్మ కర్మబంధం లేదు. ఉండి ఉంటే, నా జీవిత కథ మరోలా ఉండేది.

***

ఈ ఆలోచనల్లో నేను ఉండగానే మా బస్సు నాసిక్‌లోకి ప్రవేశించి ఓ చౌరస్తాలో ఆగింది. అక్కడి త్రయంబకేశ్వరుడికి, గోదావరి తల్లికి, ఆ ప్రాంతం గ్రామదేవతలకు మనసులోనే నమస్కరించాను. అక్కడ బస్సుకోసం వేచి వున్న ఓ ముసలావిడ, ఆవిడ పెద్ద కొడుకు, కోడలు, మరో యువకుడు బస్సు ఎక్కారు. బాగా వృద్ధురాలైన ఆవిడ మొహంలో మంచి తేజస్సు కనిపించింది. మగవాళ్లు ఇద్దరు చెవులకు రింగులతో చూడడానికి చిత్రంగా కనిపించారు. దేశాయ్ వాళ్లను పలకరించారు. మా ప్రయాణంలో జాయిన్ అయిన వారంతా కూడా శంకర్ మహరాజ్ భక్తులు.



త్రయంబకేశ్వర ఆలయం

**అక్కడి త్రయంబకేశ్వరుడికి, గోదావరి తల్లికి, ఆప్రాంతంగ్రామదేవతలకు మనసులోనే నమస్కరించాను. బస్సుకోసం వేచి వున్న ఓ ముసలావిడ, ఆవిడ పెద్ద కొడుకు, కోడలు, మరోయువకుడు బస్సు ఎక్కారు. బాగా వృద్ధురాలైన ఆవిడ మొహంలో మంచి తేజస్సు కనిపించింది.**

మధ్యాహ్నం పన్నెండు నలభైకి మా బస్సు రోడ్డు డివైడర్‌కు అవతలివైపున్న హనుమంతుడి ఆలయం ముందు ఆగింది. ముంబై నుంచి 235, నాసిక్ నుంచి 57 కి.మీ.వచ్చామని పక్కనే వున్న మైలురాయిని బట్టి తెలిసింది. మొదట పనివాళ్లు వెళ్లి ఆలయంలో నీటి వసతి ఉందో లేదో చూసి వచ్చారు. కొళాయిలు వున్నాయి, కానీ పూజారి లేడు. అక్కడ లంచ్ తీసుకోవడానికి మేమంతా దిగబోయే ముందు దేశాయ్ మా అందరినీ ఉద్దేశించి ప్రసంగించారు. ఆయనకు ఇలాంటి ప్రసంగాలు చేయడం ఇష్టం అని త్వరలోనే నేను గ్రహించాను. ఐతే, బస్సులో దాదాపు అందరికీ హిందీ వచ్చు. నాకు, వెంకటేశ్వరరావుకు మరాఠీ రాదని ఎన్నిసార్లు చెప్పినా, బహుశా స్వభాషాభిమానంతో మరాఠీలోనే చెప్పేవారు. 'హిందీ హిందీ' అని వెంకటేశ్వరరావు అరిచినా, మా ట్రిప్ అంతా ఆయన మరాఠీలోనే ప్రసంగించడం మానలేదు. నర్మదా యాత్రలో రెండోసారి పాల్గొనే మిసెస్ ఖాద్రి, మిసెస్ మర్లేకర్‌లను దేశాయ్ పరిచయం చేశారు. వాళ్లు రావడానికి కారణం నర్మదా మాతమీద భక్తి కన్నా, సిద్ధమాయి మీది భక్తితోనే అని చెప్పారు. ఇంతకీ ఎవరీ సిద్ధమాయి?

**మహాభక్తురాలు సిద్ధమాయి**

అమర్ కంటక్‌కు సుమారు 150 కి.మీ. దూరంలో, నేటి ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని మండ్ల జిల్లాలో, ఓ చిన్న గ్రామంలో ఒక ఆదివాసి కుటుంబంలో సిద్ధమాయి 60-70 ఏండ్ల క్రితం జన్మించింది. ఆమెకు దైవభక్తి అధికం. చిన్నప్పట్నించే అడవిలోకి వెళ్లి ధ్యానం చేసుకునేది. పెండ్లి చేసుకోవడానికి తిరస్కరించింది. అక్కకు కాకుండా చెల్లెండ్లకు వివాహం కాదని, చేసుకోమని తండ్రి ఎంత గట్టిగా చెప్పినా ఆమె వినలేదు. దాంతో 'ఇల్లు విడిచి వెళ్లిపొమ్మని' తండ్రి కోప్పడ్డాడు. 9వ తరగతి దాకా చదివిన సిద్ధమాయి తన 14వ ఏట ఇల్లు వదిలి వెళ్లిపోయింది. అప్పట్నించీ అడవిలోనే జీవిస్తున్నది. ఇప్పుడామెకు 70 ఏండ్లయినా ఉంటై. నర్మద నది పుట్టిన అమర్ కంటక్‌లో కపిలధార ప్రాంతంలోని అడవిలోనే ఆమె ఓ చిన్న గుడిసెలో ఉంటున్నది. దత్త భక్తులు సాధారణంగా 'మనుషుల్లో మహాత్ములు ఉంటారని' నమ్ముతారు.

మిసెస్ ఖాద్రి కూతురుకు చాలాకాలంగా పిల్లలు కలుగలేదు. క్రితం సారి యాత్రలో ఆవిడ తనకు మనవడ్ని ప్రసాదించమని సిద్ధమాయిని కోరితే ఏడాదిలోగా పుడతాడని దీవించింది. అన్నట్టే సంతానం కలగడంతో మరోసారి ఆమెను దర్శించుకోవడానికి ఆవిడ వచ్చింది. మిసెస్ మర్లేకర్ కోరిక కూడా ఏదో తీరడంతో మళ్లీ ఆమెను చూడటానికి వచ్చింది. దేశాయ్ మరికొన్ని ఇలాంటి ఉదాహరణలను మా అందరికీ చెప్పారు.

-సశేషం

---

# వేదమంత్రాల శక్తికి మూలం?

**'మంత్రాలకు చింతకాయలు రాలుతాయా?' అని ప్రశ్నించే వారు వేదమంత్రాల మహాబలానికి మూలం తెలుసుకోవాలి. వేదాల జ్ఞానసంపదనుబట్టే దాని గొప్పతనం అర్థమవుతుంది. సృష్టితో పాటు ఉద్భవించినట్టుగా భావిస్తున్న వేదవిజ్ఞాన సారాన్ని ఆనాటి మహర్షులే కనుక గ్రహించి మానవజాతికి అందించక పోయుంటే ఇవాళ భూమిపై ఈ కాస్త ధర్మమైనా నిలిచేది కాదని ఆధ్యాత్మిక వేత్తలు అంటారు. అప్పుడు మానవుల జీవితాలు తెరచాపల్లేని నావల్లా అగమ్యగోచరం, నిరర్థకమేకాక నిస్సారమయ్యేవనీ వారంటారు. వేదవాఙ్మయం ఎప్పుడు, ఎలా పుట్టిందనడానికి ఇప్పటికే కొన్ని భావనలు ప్రచారంలోకి వచ్చాయి. ఎవరికి వారు ఏదో ఒక ఆధారాన్నిబట్టి నిర్ధారిస్తున్నారు. శాస్త్రీయ మూలాధారమే అత్యంత ప్రామాణికమవుతుంది. న్యూఢిల్లీకి చెందిన రిటైర్డ్ సీనియర్ ప్రొఫెసర్ ఏవీ మొహరిర్ వెలిబుచ్చిన ఇటీవలి ప్రతిపాదన ఈ కోణంలో ఆలోచింప చేసేదిగా ఉంది. ప్రపంచంలోనే అతిప్రాచీనమైన ఆధ్యాత్మిక తత్వంగా అద్వైత సిద్ధాంతాన్ని పేర్కొంటూనే, వేదమంత్రాలు సృష్టి ఆరంభంలో విశ్వశక్తి ప్రేరణతోనే అత్యంత ప్రాకృతికంగా ఆవిర్భవించినట్లు ఆయన తెలిపారు.**

మీమాంస



**వేదాలు** అపౌరుషేయాలని (ఎవరూ రాయనివి) భారతీయ తత్వవేత్తలు ఏనాడో తేల్చారు. మన పౌరాణికాల ప్రకారం ప్రళయాలు-ప్రణవాలు (సృష్టి ఆరంభం) ఒక మహా కాలచక్రంలో భాగం. గత ప్రళయం తర్వాత కృతయుగంతో మొదలై త్రేతా, ద్వాపర, కలి యుగాల పిమ్మట మళ్లీ ప్రళయం సంభవిస్తుంది. ఈ కృతయుగ కాలం మొదట్లోనే శ్రీమహావిష్ణువు మత్స్యావతారం దాల్చి, వేదాలను ఎత్తుకెళ్లిన సోమకాసురుడు అనే రాక్షసుని వధించి వాటిని రక్షించాడు. కాబట్టి, అవి తొలియుగం నాటికే వున్నట్టుగా భావించాలి. హైందవ విశ్వాసం మేరకు కృత(సత్య) యుగంతో సృష్టి ప్రారంభమై ఇప్పటికీ అనేక లక్షల సంవత్సరాలు అయింది. వేదాల సృష్టికర్త బ్రహ్మదేవుడే అన్న పౌరాణిక కథా వాడుకలో ఉంది. వేద నాగరికత క్రీ.పూ.1200 సంవత్సరం నాటిదని కొందరు, కాదు క్రీ.పూ.4000 సంవత్సరాల కిందటిదని మరి కొందరు భావిస్తున్నారు. వేదకాలం విషయంలో భిన్నాభిప్రాయాలున్నప్పటికీ అత్యధిక హైందవులు ఇవి అనాదిగా ఉన్నవేనని విశ్వసిస్తున్నారు.

ప్రత్యేకించి ఎవరూ రాసినవి కాకపోయినా, లభ్యమవుతున్న సాహిత్య, చారిత్రకాది ఆధారాల మేరకు సంస్కృత భాషలోనే వేదవాఙ్మయమంతా గ్రంథస్తం అయిందన్నది స్పష్టం. అసలు, ఈ దేవభాష (సంస్కృతం)లోకి వేదాలు ఎలా రూపాంతరం చెందాయి? ఎవరూ రాయకపోతే వీటికి అక్షరరూపు ఎలా సిద్ధించింది? అన్న ప్రశ్నలకు రిటైర్డ్ ప్రొఫెసర్ ఏవీ మొహరిర్ విపులమైన అభిప్రాయాన్నే వ్యక్తంచేశారు. కిందటేడాది (2018) అక్టోబర్ 1-7 మధ్య వెలువడిన 'యూనివర్సిటీ న్యూస్' పత్రిక సంచికలో ప్రచురితమైన ఆయన పరిశోధనాత్మక వ్యాసం (సైన్స్, స్పిరిచువాలిటీ అండ్ గాడ్: యాన్ అటెంప్టెడ్ సింథసెస్) ఈ విషయాన్ని సమగ్రంగా చర్చించింది. న్యూఢిల్లీలోని ఐఏఆర్ఐ (ఇండియన్ అగ్రికల్చరల్ రీసర్చి ఇన్‌స్టిట్యూట్)కు చెందిన 'డివిజన్ ఆఫ్ అగ్రికల్చరల్ ఫిజిక్స్'కు అధిపతిగా, డీన్‌గా పనిచేసి ఆయన రిటైరయ్యారు. వేదాలు అనాదిగా ఉన్నవన్న సనాతన వాదుల అభిప్రాయాన్ని ఏకీభవించే రీతిలోనే ఆయన అభిప్రాయం ఉండడం గమనార్హం.

సృష్టి ఆవిర్భావం నాటి మహాశక్తి నుంచి వెలువడిన ప్రకంపనలు, శబ్దాలు, హల్లులు, అచ్చులు, పదాలు, లయలు, మోతలు, చలనాలు వంటివన్నీ భూమండలం వరకూ దిగి వచ్చి, సంస్కృత భాషలోకి రూపాంతరం చెందినట్లు మొహరిర్ అంటున్నారు. తత్ ఫలితంగానే ఎంతో శక్తివంతమైన వేదమంత్రాలు ఉద్భవించాయని, అలా అపౌరుషేయంగా అందిన ఈ వాఙ్మయాన్నే అప్పటి మహర్షులు గ్రహించారని ఆయన వివరించారు. సంస్కృత భాష గురించి కూడా మొహరిర్ ఆశ్చర్యకరమైన విషయాన్నే వెల్లడించారు. వివిధ ప్రకంపనలు, శక్తుల పౌన:పున్యాల (తరచుదనం) సమ్మేళనంతోనే ఈ భాష ఆవిర్భవించినట్లు ఆయన పేర్కొన్నారు. అత్యంత సంక్లిష్టమైన పదబంధాలు, శబ్దాలు, స్వరాలు, రాగాల సహితంగా రూపొందిన ఈ అద్భుత భాష నాటినుంచీ మానవుల ద్వారా వెల్లడవుతున్నట్టు ఆయన తేల్చారు. మరి, నరులకు ఈ శక్తి ఎలా సమకూరింది? అన్న దానికీ ఆయన సమాధానం చెప్పారు. మానవ చేతనత్వం విశ్వాత్మ (Cosmic Universal Consciousness) శక్తితో కలిసి స్వరసమ్మేళనం (unison) పొందిన ఫలితమే ఇదని ఆయనన్నారు.

సంస్కృత భాష పుట్టిందే వేదాల కోసమేనేమో. దీని గొప్పతనాన్ని మొహరిర్ మరింత విపులంగా తెలిపారు. ఈ భాషలోని ప్రతీ అక్షరం ఒక ప్రత్యేకమైన తరంగ దైర్ఘ్యాన్ని కలిగి ఉంటుందని, వివిధ అక్షరాలన్నీ ఒక్కచోట సమ్మిళితమై, సంయోగమై ఒక కట్టగా, ఓ పెద్ద గుంపుగా కూడి గుణాత్మక శక్తిని పలు పౌన:పున్యాలుగా విడుదల చేస్తాయని ఆయన అంటున్నారు. ఈ రకంగా స్వాభావికంగానే మానవులపై సంస్కృత భాష పెద్ద ఎత్తున ప్రభావం చూపినట్లు ఆయన అన్నారు. 'సంస్కృతం' అనగానే అదేదో పండిత భాష అన్న అభిప్రాయం చాలామందిలో ఏర్పడింది. కానీ, మొహరిర్ దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తూ సంస్కృత భాషకు చెందిన 'ఆత్మ చేతన' ప్రతి మనిషిలోనూ నిబిడీకృతమై ఉన్నట్టు చెబుతున్నారు. ఈ భాషా లక్షణాలు, స్పందనలు సహజసిద్ధంగానే అందరిలోనూ అంతర శక్తి (under current) గా పనిచేస్తున్నట్లు ఆయన నిర్ధారించారు. కులం, మతం, వర్గం, భాష, ప్రాంతం, విశ్వాసం, నమ్మకం, భౌగోళికత వంటి వాటన్నింటికీ అతీతంగా ప్రపంచ మానవులందరిపైనా ఈ భాష ఇదే రకమైన ప్రభావాన్ని కలిగిస్తుందన్నది ఆయన అభిప్రాయం.

అందుకే, అత్యంత శాస్త్రోక్తంగా వేదమంత్రాలు (సంస్కృత భాషలోనివి) చదువుతున్నప్పుడు తీవ్రస్థాయి ఆధ్యాత్మిక ప్రకంపనలు ఉద్భవించడం మనం చూస్తుంటాం. నిజానికి వేదమంత్రాలను పూర్తి స్వరరాగ ఛందోబద్ధంగా పఠించే నిష్ణాతులైన వేద పండితులు ఈ కాలంలో చాలా తక్కువ. వాతావరణాన్ని స్పందింపజేసేలా, పరిసర వ్యక్తుల్లో ప్రకంపనలు పుట్టించే రీతిలో అనూహ్య స్థాయిలో వేదమంత్రాల పఠనం ప్రస్తుత కాలానికి అసాధారణమే. అప్పుడు గాలికి సైతం చలనం వస్తుందని ఆధ్యాత్మిక వేత్తలు అంటారు. గోదావరి వంటి నదీనదాల ప్రవాహ శబ్దాల (ఘోష)ను సైతం వేద మంత్రాల ప్రకంపనలతో పోలుస్తారు. మొత్తంగా సృష్టికి మూలమే 'ఓం'కారమనే (ప్రణవనాదం) 'అత్యద్భుత విశ్వ ప్రకంపన' సర్వమతాలకు అతీతంగా మన్ననలను అందుకొంటున్నది. ఇంతటి తేజోవంతమైన మంత్రోచ్చారణలకు ఉండే శక్తి సామర్థ్యాలు సామాన్యులకు అర్థం కావన్నది వారి అభిప్రాయం. ఋషుల కాలం వరకూ అక్కర్లేదు, త్రిమతాచార్యులు, ఆ తర్వాతి వారి కాలం వరకూ కూడా వేదమంత్రాలతో అద్భుతాల (ఎండిపోయిన పొలాలను పచ్చ బరచడం వంటివి)ను సృష్టించిన సందర్భాలు చరిత్రకు తెలుసు. హోమ గుండంలో నిప్పు రాజేయకుండానే మంత్రాలతో అగ్నిహోత్రాన్ని పుట్టించిన అంకురిత దీక్షాపరులను కండ్లారా చూసిన వారు ఇప్పటికీ వున్నారు.

విశ్వవ్యాప్తంగా మానవులందరినీ ఆధ్యాత్మిక పరంగా ప్రభావితం చేయగలదు కాబట్టే, సంస్కృతాన్ని మొహరిర్ ఆసియా, యూరోపియన్ భాషలన్నింటికీ 'మాతృభాష'గా అభివర్ణించారు. మానవాళికి చెందిన అన్ని వర్గాలు, జాతుల (నాగరికులు, అనాగరికులు, అక్షరాస్యులు, నిరక్షరాస్యులు) నడుమ ఇదొక 'వాస్తవిక సర్వసాధారణ బంధం' (common thread) వంటిదని ఆయన అన్నారు. ఇందులోని సౌందర్య గుణం, కవితాత్మక పద్యపాదాలు, కరుణ రసాత్మక రచనా సంవిధానం, మనసుకు ప్రశాంతతను చేకూర్చే సంగీతరస ధ్వని, ప్రేమ-భక్తి, ఉద్వేగాలు, దయార్ద్రత వంటివన్నీ విశ్వజనీనంగా కనిపించడానికి కారణమిదేనని మొహరిర్ అంటారు. ఈ దృష్ట్యా వేదాలు మనకు అందించే జ్ఞానం, వివేకంతో కూడిన శక్తి ఎవరో పనికట్టుకొని ఇచ్చిందో, రచించిందో, సంకలన పరిచిందో ఎంతమాత్రం కాదన్నది ఆయన నిర్ధారణ.

**దోర్బల బాలశేఖరశర్మ**

### సైద్ధాంతిక వాస్తవం కూడా!



'వేదాలు సృష్టి జనితం' అన్న ప్రతిపాదనలోని సత్యం పలు ప్రముఖ సమీకరణలు, సిద్ధాంతాల ద్వారా కూడా అవగాహనకు వస్తున్నదని ఏవీ మొహరిర్ తెలిపారు. నోబెల్ బహుమతి గ్రహీత, ఆస్ట్రియన్ భౌతిక శాస్త్రవేత్త ఎర్విన్ స్క్రోడింగర్ తరంగ పనితనానికి చెందిన సమీకరణ, 'రాయల్ సొసైటీ ఫెలో' అవార్డు గ్రహీత, సుప్రసిద్ధ భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ గణితశాస్త్ర సమీకరణలు, కోప్లే మెడల్ గ్రహీత, జర్మనీ రసాయనిక శాస్త్రవేత్త ఆగస్ట్ కెక్యూల్ ప్రతిపాదించిన బెంజీన్ (పెట్రోలియం, బొగ్గులలో వుండే రంగులేని అస్థిర ద్రవపదార్థం) నిర్మాణ బదిలీ సిద్ధాంతం, నోబెల్ బహుమతి గ్రహీత, జర్మనీ భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ సుప్రసిద్ధ సాధారణ సాపేక్షికతా సిద్ధాంతం వంటి వాటితోపాటు ఇటువంటి మరిన్ని అధ్యయనాల సారం ఈ అభిప్రాయాన్ని రహస్యంగానైనా ఉటంకిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో సైద్ధాంతిక ప్రామాణికత నెలకొనవలసి ఉంది. ఇందుకు మరిన్ని లోతైన పరిశోధనలు అవసరం.

---

జీవన వేదం

## సూర్యోదయ వేళ శోభాయమానం



**ఎవరైనా** సరే సూర్యోదయానికి ముందే నిద్ర లేవాలి. సూర్యోదయ వేళలో ఎవరైతే భగవత్ ప్రార్థనలు చేస్తారో వారు భాగ్యవంతులవుతారు. స్త్రీలలో ఎవరైతే పొద్దున్నే ఉషోదయానికి ముందే నిద్ర లేచి సత్కర్మలు, సదాచారాలు, మంచి నడవడికతో దైవ చింతనను కలిగి ఉంటారో వారిండ్లలో లక్ష్మీదేవి తాండవం చేస్తుంది. ఇలా ప్రాత:కాలంలో నిద్ర లేచిన వారికి శ్రవణాది శక్తులూ ఇనుమడిస్తాయి. వారు అందరి హృదయాలను చూరగొంటారు. పక్షులు అన్నీ ప్రియమైన పలుకులు వినిపిస్తాయి. లోకమంతా వ్యాపించిన ప్రాత:కాల ఉషస్సు చైతన్యవంతమైన శోభను పంచుతుంది. అది మానవుల జీవన స్థితిగతులను అద్భుతంగా ప్రకాశింపజేస్తుంది.

- సామవేదం

మంచిమాట



మానవ శరీరం ఒక విస్తరి వంటిది. భోజనం చేసిన తర్వాత దానిని తీసి పారేస్తాం. అంతేకానీ, దాచుకోలేం కదా. అలాగే, మన శరీరం కూడా అంతే.

- శ్రీ రమణమహర్షి

పద్యస్తుతి

## త్రిశక్తియుత సౌవర్ణ తెలంగాణ!



**కోటి** రతనాల వీణ నాడు
నేడది మాణిక్య వీణ
మాగాణుల ధాన్యవీణ
సుక్షేత్ర సునాద సువర్ణ వీణ
రాజశ్యామల వరద వీణ

ఆనంద పారవశ్యంతో
పంటపొలాలు కన్న
ధాన్య శిశువులు చేస్తున్న
కేరింత ధ్వనుల వినడానికి
ఉత్సహిస్తున్న నిరుపేదల
మూడు వైపుల ముగ్గురుగా
రక్షిస్తున్న ఓ జ్ఞాన సరస్వతీ!
జోగులాంబా! భద్రకాళీ!
ఆశీర్వదిస్తూ బ్రతుకమ్మలుగా
పూజల నొందండి!
ధర్మపురి నృసింహా, యాదాద్రి
నారసింహా, మట్టపల్లి నరసింహ
లక్ష్మీసమేతులై ఈ మా
సౌవర్ణ తెలంగాణ పవిత్రభూమిని
మిత్రహితులై శత్రుసంహారులై
కాపాడండి.

సేవకుడు నాటుతున్న
ధర్మబీజాంకురాలను
యుష్మదనుగ్రహ వృష్టితో
మొలిపించండి!



- ముదిగొండ వీరభద్రయ్య
సెల్: 92462 76573

---

## సుడోకు

డైలీ సుడోకు 62 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 4 | 1 | 8 | 3 | 2 | 7 | 5 | 9 |
| 7 | 3 | 8 | 6 | 9 | 5 | 2 | 4 | 1 |
| 9 | 2 | 5 | 7 | 1 | 4 | 8 | 6 | 3 |
| 5 | 9 | 7 | 2 | 8 | 3 | 4 | 1 | 6 |
| 1 | 8 | 4 | 9 | 5 | 6 | 3 | 2 | 7 |
| 3 | 6 | 2 | 1 | 4 | 7 | 9 | 8 | 5 |
| 4 | 1 | 6 | 3 | 7 | 8 | 5 | 9 | 2 |
| 2 | 5 | 3 | 4 | 6 | 9 | 1 | 7 | 8 |
| 8 | 7 | 9 | 5 | 2 | 1 | 6 | 3 | 4 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -63

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 3 | | | | 5 | | | 2 |
| | | 2 | | 6 | | | 8 | |
| | 9 | | | | | | | 7 |
| | | 9 | | 7 | 6 | 5 | | |
| | 5 | | 9 | | 8 | | 1 | |
| | | 1 | 5 | 4 | | 6 | | |
| 9 | | | | | | | 4 | |
| | 6 | | | 8 | | 2 | | |
| 7 | | | 3 | | | | 9 | |

## ట్వీట్

అనసూయ@anusuyakhasba





నటించి ప్రేమను పొంది, నువ్వేంటో, నీ నిజాయితీ ఏంటో తెలిశాక అసహ్యించబడటం కన్నా.. ముందే నువ్వేంటో తెలియజేయడం మంచిది.



అనసూయను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

850,983

## కామన్‌మ్యాన్ వాయిస్

క్రికెట్ మ్యాచ్ మీద కూడా ఇంట్రెస్ట్ రావట్లేదు. ఏపీ అసెంబ్లీ సమావేశాలు చూస్తుంటే. మొదటిరోజే ఏమన్నా ఉందా అసలు.
-Aryan Krishna

మన మీద మనం నమ్మకం కోల్పోయినప్పుడు, భయం వెన్నంటి వేటాడుతున్నప్పుడు ఇతరులను వావి, వరుసలు పెట్టి పిలవడం నేర్చుకుంటారంటా!
-Vijaya Bhandaru

ఘోర పరాజయం తర్వాత అసెంబ్లీలో అడుగుపెట్టి చంద్రబాబు పలికిన మొట్టమొదటి మాట 'విభజన తర్వాత'.
-Sathya Prasad Peddapally

## వైరల్ వీడియో



**ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సాహో టీజర్.. రానే వచ్చింది. యాక్షన్ థ్రిల్లర్‌గా వస్తున్న సినిమాకు సంబంధించిన ఈ టీజర్ యూట్యూబ్‌లో విడుదలైన గంటల్లోనే మిలియన్ వ్యూస్ దాటింది.**

SAAHO TEASER | Prabhas, Shraddha Kapoor, Neil Nitin Mukesh | Bhushan Kumar | Sujeeth | Vamsi Pramod
Total views : 480,629+
Published on Jun 12, 2019

III.
నమస్తే తెలంగాణ
విహారం
[ కరీంనగర్ ]
శుక్రవారం 14 జూన్ 2019

కొన్ని దేశాలు పర్యాటకుల దగ్గర ఫీజు వసూలు చేస్తున్నాయి. ఒక్కో దేశం ఒక్కో విధంగా పర్యాటక చార్జీలను పెట్టాయి. ఇప్పుడు కొత్తగా భూటాన్ ఆ లిస్టులోకి చేరింది.

# ఇక నుంచి.. డబ్బులు చెల్లించి!



భూటాన్ మన పక్క దేశం. పర్యాటక పరంగా అభివృద్ధి చెందుతూ ఆకర్షిస్తున్నది. ఈ మధ్య కాలంలో ప్రపంచదేశాల నుంచి వస్తున్న పర్యాటకులు అక్కడ సందడి చేస్తున్నారు. మొన్నటి వరకు పర్యాటకులను ఉచితంగా అనుమతించిన భూటాన్ ప్రభుత్వం ఇప్పటి నుంచి డబ్బులు చెల్లించాలనే కొత్త రూల్‌ను ప్రవేశపెట్టింది. భూటాన్ ప్రభుత్వం ఫోర్త్ పే కమిషన్ ఈ సిఫారసును పెట్టింది. భారతదేశం, బంగ్లాదేశ్, మాల్దీవుల నుంచి వచ్చే పర్యాటకులకు కనీస రుసుము చెల్లించాలని అక్కడి ప్రభుత్వం యోచిస్తున్నది. ఇప్పటికే అంతర్జాతీయ పర్యాటకులకు 250 డాలర్ల ఫీజును వసూలు చేస్తున్నది. ఇక నుంచి భారతదేశం, బంగ్లాదేశ్, మాల్దీవుల నుంచి వచ్చే పర్యాటకులకు 500 రూపాయలను ఫీజు రూపంలో తీసుకోవాలని అనుకుంటున్నది.

చూడాల్సిన ప్రదేశం

## పిల్లలకు పంచతంత్ర పార్కు




ఒక థీమ్ పార్క్. అందులో కేవలం చిన్నారులకు సంబంధించిన కంటెంట్. హైదరాబాద్‌లో ప్రారంభమైన పిల్లల పంచతంత్ర పార్కు సందర్శకులతో కళకళలాడుతున్నది.

చిన్నారులకు ఆటలన్నా, పాటలన్నా ప్రాణం. అందుకే చందమామ రావే.. జాబిల్లి రావే అంటూ తినిపిస్తేనే తింటారు. ఏ అంశాన్నైనా పాటగానో, ఆటగానో చేసి చెప్తే తొందరగా మనసుకు ఎక్కించుకుంటారు. అడవిలో సింహం గురించి చెప్పాలన్నా, నీటిలో మొసలి గురించి చెప్పాలన్నా వాళ్లకు కథలుగానే చెప్పాలి. అందుకే పిల్లల కోసం హైదరాబాద్ గచ్చిబౌలి జర్నలిస్ట్ కాలనీలో పంచతంత్ర పార్కు ప్రారంభించారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ పార్కులో పంచతంత్ర కథలు వినొచ్చు. చూడొచ్చు. జీవిత ధర్మాలను, నీతి సూత్రాలను, లౌక్యాన్ని, తెలివితేటలను ఈ పంచతంత్ర కథలు తెలియజేస్తాయి. నలభై అయిదు లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ పార్కులో పెద్ద పెద్ద బొమ్మలు, వాటి పక్కన బోర్డుపై కథ, పక్కన ఉన్న స్పీకర్ స్విచ్ ఆన్ చేస్తే ఆడియో రూపంలో కూడా కథ వస్తుంది. అడవిలాంటి వాతావరణాన్ని సృష్టించి పిల్లలకు పూర్తిగా అర్థమయ్యేరీతిలో ఈ థీమ్ పార్క్‌ను రూపొందించారు. చుట్టూ కాంపౌండ్ గోడలపై కథలను బొమ్మలుగా వేశారు.

## పర్యాటకం కోసం పెండ్లిళ్లు!



పర్యాటకులుగా వెళ్లి అక్కడి అమ్మాయిని పెళ్లి చేసుకొని నగరమంతా తిరిగి చక్కర్లు కొట్టి ఒక్కరోజులోనే విడాకులు ఇచ్చి వచ్చేయొచ్చు. ఇదెక్కడ అనుకుంటున్నారా?

అమ్‌స్టర్‌డమ్ పట్టణానికి మీరు పర్యాటకుడిగా వెళ్తే అక్కడి అమ్మాయిని పెళ్లాడి నగరాన్నంతా జల్లెడ పట్టి హనీమూన్ చేసి విడాకులు ఇచ్చేయొచ్చు. ఒక్కరోజు కోసం పెళ్లి చేసుకునే వింత సంస్కృతి ఇక్కడ ఉన్నది. డచ్ రాజధాని నగరం అయిన అమ్‌స్టర్‌డమ్‌లో ఈ సంస్కృతి వల్ల వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగి చాలా నష్టం జరుగుతుందని అక్కడి వాళ్లు మండిపడుతున్నారు. ఈ దశాబ్దకాలంలో 19మిలియన్ల నుంచి 29 మిలియన్లకు అక్కడి జనాభా పెరిగింది. పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. దీన్ని ప్రోత్సహించకూడదని మే నెలలో ఆపేయాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. కానీ ఎలాంటి మార్పు లేదు. తాత్కాలిక పెళ్లిళ్లకోసం నగరానికి వచ్చే పర్యాటకులకు ప్రదేశాలను చూపించి పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రారంభించారు. పర్యాటకుల సంఖ్య పెరిగితే వచ్చే ఆదాయంతో నగరాన్ని మరింత అందంగా ముస్తాబు చేయొచ్చని అంటున్నారు.

ఏ దేశానికి వెళ్లినా, ఏ రాష్ట్రానికి వెళ్లినా ముందుగా అక్కడ చూడాల్సిన స్థలాలతో పాటు తినాల్సిన ఆహారం గురించి కూడా చర్చిస్తాం. ఒక్కో దగ్గర ఒక్కో రకమైన ఆహారం లభిస్తుంది. ఏ ఆహారమైనా అక్కడి వాతావరణ పరిస్థితులు, భౌగోళిక మార్పులతో ముడిపడి ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా స్పైసీ ఫుడ్ దొరికే దేశాల జాబితా ఇది.



# ఒక్కోదేశం.. స్పైసీ ఆహారం

ఎప్పుడైనా ఈ దేశాలకు వెళ్తే అక్కడ దొరికే స్పైసీ ఫుడ్‌ని ఎంజాయ్ చేయడానికి ట్రై చేయండి. అన్నట్టు, మితిమీరి కారం తినడం కూడా మంచిది కాదు. మసాల దినుసులు, కారంతో కూడుకున్న ఆహారం తినడం సులువు కాదన్న విషయం భోజనప్రియులకు బాగా తెలుసు.

### జమైకా

మాంచి మంచింగ్ స్పైసీ ఫుడ్ తినాలనుకుంటే జమైకాకు జంప్ అవండి. అక్కడ దొరికే జర్క్ చికెన్‌ని ట్రై చేయండి. వివిధ రకాల చేపలు వాటితో చేసే భిన్నమైన ఆహారాలు ఇక్కడి ప్రత్యేకత. ఈ దేశంలో మేకతో చేయబడిన హాటెస్ట్ వంటకాలు ఇంకెక్కడా దొరకవు. ఈ వంటకాలలో ప్రత్యేకమైన సువాసన, రుచిని అందించే స్కాచ్ బొన్నెట్ పెప్పర్‌ని ఉపయోగిస్తారు.

### మలేషియా

చైనీస్, భారతీయ వంటకాల మిశ్రమమే మలేషియా ఆహారం. మన దగ్గర దొరికే అన్ని వంటకాలు ఇక్కడ కూడా దొరుకుతాయి. కాబట్టి మీరు ఇక్కడ కూడా ఎన్నో అద్భుతమైన ఆహారాలను రుచి చూడొచ్చు.

### చైనా

భారతదేశంలో ఇప్పుడు నడుస్తున్న ఫుడ్ ట్రెండ్ మొత్తం చైనాదే. చైనీస్ ఫాస్ట్‌ఫుడ్ అయినా, మ్యాగీ న్యూడిల్స్ అయినా నిమిషాల్లో సిద్ధమయ్యే పాస్తా అయినా ఇలా అన్నీ అద్భుతం అనిపించే ఆహారాలు అక్కడే లభ్యమవుతాయి. చైనాలో నిజమైన స్పైసెస్‌ని ఎంజాయ్ చేయాలనుకుంటే దక్షిణ పశ్చిమ భాగాన్ని సందర్శించాలి. అక్కడ దొరికే ఎండిన మిరపకాయలు, సిజువాన్ పెప్పర్ కార్న్‌తో తయారు చేసే ఆహారాన్ని ట్రై చేయండి.

### కొరియా

అద్భుతమైన స్పైసీ ఫుడ్ తినాలనుకునే వాళ్లు కచ్చితంగా సందర్శించాల్సిన ప్రదేశం కొరియా. ఇక్కడ 'ఫైర్ – చికెన్' దొరుకుతుంది. దాన్ని మాత్రం అస్సలు మిస్సవ్వొద్దు. ఈ వంటకంలో కారాన్ని వేర్వేరు స్థాయిల్లో కలుపుతారు. మీరు చేయవలసిందల్లా మీరు ఏ స్థాయిలో కారానికి సౌకర్యంగా ఫీల్ అవుతారో ఆ స్థాయిని కోరుకుంటే చాలు. మంచి ఆహారాన్ని, నాన్ వెజ్‌ను ఎక్కువ ఇష్టపడే వాళ్లు వెళ్లాల్సిన దేశం.

### మెక్సికో

దీని పేరు మీద మసాలాల కంపెనీలు పెట్టారు. మిరపకాయలు లేని మెక్సికో ఆహారం అసంపూర్ణమనే చెప్పాలి. ఇక్కడ వంటకాలు ఇంట్లో పెరిగే రకరకాల మిరపకాయలతో తయారుచేస్తారు. మామూలు కారం కంటే ఎక్కువ ఘాటు ఉండే మెక్సికో మిర్చిలతో చేసిన వంటకాలను ఒక్కసారైన రుచిచూడాలి. ఆ దేశంలో దొరికే కొన్ని రకాల స్పైసీ ఫుడ్స్ తినాలంటే నిజంగా గట్స్ ఉండాలి.

### థాయిలాండ్

మసాజ్ అనగానే గుర్తొచ్చేది థాయ్‌లాండ్. ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొంది లక్షల మంది పర్యాటకులకు విజ్ఞానాన్ని, వినోదాన్ని పంచుతున్నది. అక్కడ స్పైసీ ఫుడ్స్ దొరికే ఎన్నో స్ట్రీట్ ఫుడ్ స్టాల్స్ ఉంటాయి. అక్కడి ఆహారంలో ఎన్నో సుగంధ మూలికలను, సుగంధాలను ఉపయోగిస్తారు. వీటి కారణంగానే ఇక్కడి వంటకాలు ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందాయి. అక్కడ స్థానిక ఎర్ర మిరపకాయలతో వండే చేపలు, మటన్, చికెన్ కూరలను రుచి చేస్తే మరిచిపోలేరు.

## సరికొత్త సముద్రమార్గం..



ప్రధాని మోదీ మాల్దీవులకు వెళ్లినప్పుడు అక్కడి నుంచి ఒక శుభవార్తను పట్టుకొచ్చారు. అదే సరికొత్త సముద్రమార్గ ఒప్పందం. ఇది ఇరు దేశాలకు లాభం చేకూర్చనున్నది. భారత ప్రధాని నరేంద్రమోదీ, మాల్దీవుల ప్రధాని ఇబ్రహీం మహ్మద్ చర్చల అనంతరం ఈ ఒప్పందం కుదిరింది. ఫెర్రీ కమ్ కార్గో సర్వీస్‌లలో ప్రయాణికులను కూడా తీసుకెళ్లాలని నిర్ణయించారు. పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు ఈ ఒప్పందం లాభపడుతుందని భావిస్తున్నారు. కేరళలోని కొచ్చి నుంచి ప్రారంభమయ్యే ఫెర్రీస్ మాల్దీవుల రాజధాని నగరం మాలే మీదుగా అక్కడికి చేరుకుంటుంది. 700 కిలోమీటర్ల సముద్రం మార్గం ఇది.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## నర్సింగ్ ఆఫీసర్లు

**బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (నిమ్‌హాన్స్) ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- పోస్టు పేరు: నర్సింగ్ ఆఫీసర్
- **మొత్తం ఖాళీలు:** 99 (జనరల్-45, ఈడబ్ల్యూఎస్-9, ఓబీసీ-21, ఎస్సీ-11, ఎస్టీ-5)
- **అర్హత:** ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు ఏ గ్రేడ్ నర్సుగా రిజిస్టరైనవారు/ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులైనవారు అర్హులు. బ్యాచిలర్ డిగ్రీ లేని అభ్యర్థులకు సంబంధిత రంగంలో రెండేండ్ల అనుభవం ఉండాలి.
- జూనియర్ సెక్రటేరియల్ అసిస్టెంట్ (జేఎస్‌ఏ)-24 ఖాళీలు (జనరల్ -14, ఈడబ్ల్యూఎస్-2, ఓబీసీ-3, ఎస్సీ-3, ఎస్టీ-2)
- **అర్హత:** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- **వయస్సు:** జేఎస్‌ఏకు 27 ఏండ్లు, నర్సింగ్ ఆఫీసర్‌కు 35 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** నర్సింగ్ ఆఫీసర్‌కు రూ. 44,900/-జేఎస్‌ఏకు రూ. 19,900/-
- **ఎంపిక:** ఆన్‌లైన్ పరీక్ష, స్కిల్ టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జూన్ 29
- **వెబ్‌సైట్:**www.nimhans.ac.in.

## సనత్‌నగర్ ఈఎస్‌ఐలో 154 ఖాళీలు

**హైదరాబాద్ సనత్‌నగర్‌లోని ఎంప్లాయిస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్‌ఐసీ)లో ఫ్యాకల్టీ, సూపర్ స్పెషాలిటీ, సీనియర్ రెసిడెంట్, జూనియర్ రెసిడెంట్, ట్యూటర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**



- **పోస్టులు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్
- ఖాళీల సంఖ్య- 24
- **విభాగాలు:** బయోకెమిస్ట్రీ, పాథాలజీ, జనరల్ మెడిసిన్, టీబీ/చెస్ట్, పిడియాట్రిక్స్, సైకియాట్రీ, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్స్, అనెస్థీషియా, రేడియాలజీ, డెంటిస్ట్రీ, బ్లడ్‌బ్యాంక్, కమ్యూనిటీ మెడిసిన్.
- **పోస్టు:** సీనియర్ రెసిడెంట్స్ (మెడికల్ కాలేజీ హాస్పిటల్/సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్) -54 పోస్టులు.
- **విభాగాల వారీగా ఖాళీలు:** అనెస్థీషియా-7, పిడియాట్రిక్స్-3, ఆప్తాల్మాలజీ-1, ఆర్థోపెడిక్స్-3, ఓబీజీవై-5, రేడియాలజీ-7, జనరల్ మెడిసిన్-2, జనరల్ సర్జరీ-3, న్యూరాలజీ-5, ఎండొక్రైనాలజీ-1, గ్యాస్ట్రోఎంటరాలజీ-1, ఆంకాలజీ (మెడికల్)-1, ఐసీయూ/ఎంఐసీయూ (మెడికల్)-3, నియోనాటాలజీ/ఎన్ఐసీయూ-3. కార్డియాలజీ-2, పిడియాట్రిక్ సర్జరీ-2, యూరాలజీ-1, న్యూరో సర్జరీ-2, పిడియాట్రిక్ క్రిటికల్ కేర్-1, నెఫ్రాలజీ-1 ఉన్నాయి.
- **పోస్టు:** సూపర్ స్పెషలిస్టు (నాన్-టీచింగ్/ఫుల్ టైం/పార్ట్‌టైం)
- ఖాళీల సంఖ్య- 12
- **పోస్టు:** స్పెషలిస్టు (నాన్ టీచింగ్/ఫుల్‌టైమ్/పార్ట్‌టైం)
- ఖాళీల సంఖ్య- 3 (పాథాలజీ-1, రేడియాలజీ-1, సైకియాట్రీ/న్యూరో సైకాలజీ-1)
- **పోస్టు:** జూనియర్ రెసిడెంట్
- ఖాళీల సంఖ్య- 38
- **పోస్టు:** ట్యూటర్
- ఖాళీల సంఖ్య-23

**నోట్:** పై పోస్టులను పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు.

- **అర్హతలు:** ఎంసీఐ నిబంధనల ప్రకారం అర్హతలు కలిగి ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూన్ 24 (సాయంత్రం 6 గంటల వరకు)
- **వెబ్‌సైట్:** https://www.esic.nic.in

## పవర్‌గ్రిడ్‌లో

**పవర్‌గ్రిడ్‌లో విజిలెన్స్ విభాగంలో కింది ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

- **పోస్టులు:** ఆఫీసర్ (విజిలెన్స్)-2, అసిస్టెంట్ మేనేజర్ (విజిలెన్స్)-1, డిప్యూటీ మేనేజర్ (విజిలెన్స్)-2 ఖాళీలు ఉన్నాయి.
- అర్హతలు, వయస్సు, ఎంపిక తదితర వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 12
- **వెబ్‌సైట్:** www.powergridindia.com

## హెల్త్ కోర్సులు

**శ్రీకాకుళంలోని డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ కింది మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది.**

- **కోర్సులు:** మాస్టర్ ఆఫ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ (రెండేండ్లు), పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ రికార్డ్స్&హెల్త్ ఇన్ఫర్మేషన్ (ఏడాది)
- ఈ కోర్సులను అంబేద్కర్ యూనివర్సిటీ, బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.
- **అర్హతలు:** ఎంబీబీఎస్, బీడీఎస్, బీఫార్మసీ, బీకాం, బీఎస్సీ నర్సింగ్, బీఏ లేదా ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2019, ఆగస్టు 31 నాటికి 20-35 ఏండ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** జూన్ 21
- **వెబ్‌సైట్:** www.brau.edu.in

## బార్క్‌లో జేఆర్‌ఎఫ్‌లు

**బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్ (బార్క్) జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్స్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

- **పోస్టు:** జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్‌ఎఫ్)
- ఖాళీల సంఖ్య - 25
- **అర్హతలు:** ఎమ్మెస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ (ఫిజిక్స్/కెమిస్ట్రీ లేదా లైఫ్ సైన్సెస్)
- **ఎంపిక:** యూజీసీ- సీఎస్‌ఐఆర్-నెట్/స్లెట్, జెస్ట్ లేదా ఐసీఎంఆర్-జేఆర్‌ఎఫ్ లేదా డీబీటీ-జేఆర్‌బీ బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో వచ్చిన మార్కుల ప్రాతిపదికన ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూలో సాధించిన మార్కుల ఆధారంగా తుది ఎంపిక చేస్తారు.
- **స్టయిఫండ్:** నెలకు రూ. 31,400+ హెచ్ఆర్‌ఏ రూ.7,440/- (వసతి సౌకర్యం అందుబాటులో లేనప్పుడు)తోపాటు ఇతర అలవెన్సులు ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 12
- **వెబ్‌సైట్:** www.barc.gov.in

## ఎన్‌సీఏవోఆర్‌లో

**నేషనల్ సెంటర్ ఫర్ పోలార్ అండ్ ఓషన్ రిసెర్చ్ (ఎన్‌సీఏవోఆర్)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- పోస్టులు-ఖాళీలు: వెహికిల్ మెకానిక్-2, వెహికిల్ ఎలక్ట్రీషియన్-3, క్రేన్ ఆపరేటర్-2, స్టేషన్ ఎలక్ట్రీషియన్-1, జనరేటర్ మెకానిక్/ఆపరేటర్-2, బాయిలర్ ఆపరేటర్/ప్లంబర్ లేదా ఫిట్టర్-1, కార్పెంటర్-2, వెల్డర్-3, మల్టీటాస్కింగ్ స్టాఫ్-1, మేల్ నర్స్-3, ల్యాబ్ టెక్నీషియన్-2, కమ్యూనికేటర్-3, ఇన్వెంటరీ/బుక్ కీపింగ్ స్టాఫ్-2, చెఫ్/కుక్-5 ఉన్నాయి.
- అర్హతలు, అనుభవం, ఎంపిక వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **వెబ్‌సైట్:** www.ncaor.gov.in

# బాలకృష్ణ కొత్తచిత్రం


కె.ఎస్.రవికుమార్, సి.కల్యాణ్, బాలకృష్ణ

బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం గురువారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. కె.ఎస్.రవికుమార్ దర్శకుడు. హ్యాపీ మూవీస్ పతాకంపై సి.కల్యాణ్ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి వి.వి.వినాయక్ క్లాప్‌నివ్వగా, బోయపాటి శ్రీను కెమెరా స్విచాన్ చేశారు. తొలి సన్నివేశానికి కోదండ రామిరెడ్డి గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'జూలై నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. వాణిజ్య అంశాలు మేళవించిన పవర్‌పుల్ చిత్రమిది. ఇతర నటీనటుల వివరాల్ని త్వరలో తెలియజేస్తాం' అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సి. రాంప్రసాద్, ఆర్ట్: చిన్నా, ఫైట్స్: రామ్‌లక్ష్మణ్, సంభాషణలు: రత్నం, సహనిర్మాత: సి.వి.రావు, సమర్పణ: సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్, కథ: పరుచూరి మురళి, దర్శకత్వం: కె.ఎస్.రవికుమార్.


'సాహో' చిత్రంలో ప్రభాస్

# సాహో అదరహో

'బాహుబలి' ప్రపంచవ్యాప్తంగా సృష్టించిన హంగామా అంతా ఇంతా కాదు. ఈ సినిమా సంచలన విజయంతో హీరో ప్రభాస్ పాన్ ఇండియా స్టార్‌గా గుర్తింపును సొంతం చేసుకున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'సాహో'. సుజిత్ దర్శకుడు. యువీ క్రియేషన్స్ పతాకంపై వి.వంశీకృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'బాహుబలి' అనంతరం రెండేళ్ల విరామం తరువాత వస్తున్న సినిమా కావడంతో 'సాహో' చిత్రంపై సర్వత్రా భారీ అంచనాలు నెలకొన్నాయి. చాలా కాలంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్ర టీజర్‌ని చిత్ర బృందం గురువారం విడుదల చేసింది. రిలీజైన ఆరు గంటల్లోనే 25 మిలియన్ వ్యూస్ దాటడం విశేషం. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్ర టీజర్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ ఎంట్రీతో మొదలవుతుంది. టీజర్‌లో ఆమె కనిపించే విజువల్స్ మేకింగ్ ప్రఖ్యాత హాలీవుడ్ నిర్మాణ సంస్థ డిస్నీ పిక్చర్స్ స్థాయిలో వున్నాయి. 'బాధైనా హ్యాపీనెస్ అయినా నాతో షేర్ చేసుకోవడానికి ఎవ్వరూ లేరు' అంటూ కథానాయిక శ్రద్ధా కపూర్ చెబుతున్న డైలాగ్‌లతో టీజర్ మొదలైంది. శ్రద్ధా ఆలింగనం చేసుకుని భావోద్వేగానికి లోనవుతుంటే 'నేనున్నానని' ప్రభాస్ చెబుతున్న సంభాషణ ఆకట్టుకుంటోంది. ఆ తరువాత వచ్చే యాక్షన్ సన్నివేశాలు హాలీవుడ్ స్థాయిలో వున్నాయి. తెలుగు తెరపై హాలీవుడ్ సినిమా అనేంతగా 'సాహో' విజువల్స్‌ని వెండితెరపై ఆవిష్కరించిన తీరు అబ్బురపరుస్తోంది. టీజర్ చివర్లో విలన్ బ్యాచ్‌ని ఉద్దేశించి 'ఎవరు వీళ్లని శ్రద్ధా అడుగుతుంటే ఫ్యాన్స్ అని ప్రభాస్ చెప్పడం..దానికి ఇంత వైలెంట్‌గా వున్నారేంటని మళ్లీ శ్రద్ధా అడిగితే 'డై హార్డ్ ఫ్యాన్స్..' అని ప్రభాస్ చెబుతున్న డైలాగ్ హైలైట్‌గా నిలుస్తోంది. ఆగస్టు 15న తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# నాలుగు దశాబ్దాల తర్వాత


మోహన్‌బాబు

అలనాటి మేటినటి సావిత్రి జీవిత కథ ఆధారంగా రూపొందిన 'మహానటి' సినిమాలో ఎస్వీ రంగారావు పాత్రలో అతిథిగా కనిపించారు మోహన్‌బాబు. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కిన ఈ బయోపిక్‌తో దాదాపు నలభై ఏళ్ల తర్వాత కోలీవుడ్‌లో పునరాగమనం చేశారాయన. తాజాగా మోహన్‌బాబు తమిళంలో మరో జీవిత కథకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సూర్య కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సూరరై పోట్రు'. ఏయిర్ దక్కన్ విమానయాన సంస్థ వ్యవస్థాపకుడు జీఆర్ గోపీనాథ్ జీవితం ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రానికి సుధ కొంగర దర్శకురాలు. ఈ సినిమాలో కీలకమైన పాత్రలో మోహన్‌బాబు నటిస్తున్నారు. శుక్రవారం నుంచి ఆయన చిత్రీకరణలో పాల్గొనబోతున్నారు. చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో జరిగే షెడ్యూల్‌లో ఆయనతో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని చిత్రీకరించబోతున్నారు. నాలుగు దశాబ్దాల అనంతరం మహిళా దర్శకురాలితో మెహన్‌బాబు చేస్తున్న సినిమా ఇదే కావడం విశేషం. గతంలో విజయనిర్మల దర్శకత్వంలో మోహన్‌బాబు ఓ సినిమాలో నటించారు.

# '83'కోసం 14కోట్లు!


దీపికాపదుకునే

కపిల్‌దేవ్ నేతృత్వంలోని భారత క్రికెట్ జట్టు 1983లో తొలిసారి ప్రపంచకప్‌ను గెలుచుకొని విశ్వ విజేతగా ఆవిర్భవించింది. భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాధ్యాయంగా లిఖించబడ్డ నాటి మహోజ్వల ఘట్టాన్ని '83' పేరుతో వెండితెర మీద ఆవిష్కరిస్తున్నారు. కపిల్‌దేవ్ పాత్రలో రణవీర్‌సింగ్ నటిస్తున్నారు. కబీర్‌ఖాన్ దర్శకుడు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమాలో కపిల్‌దేవ్ సతీమణి రోమీ భాటియా పాత్రలో దీపికాపదుకునే నటించబోతున్నది. రియల్‌లైఫ్ జోడీ అయిన రణవీర్-దీపికా రీల్‌లైఫ్‌లో కూడా భార్యాభర్తలుగా నటించబోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. త్వరలో ఈ సినిమా షూటింగ్‌లో దీపికాపదుకునే పాల్గొనబోతున్నది. ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా వెల్లడించారు రణవీర్‌సింగ్. తొలుత ఈ సినిమాలో నటించాలా? వొద్దా? అనే విషయంలో సందిగ్ధతలో ఉందట దీపికాపదుకునే. భర్త రణవీర్ సింగ్ తొలిసారి నటిస్తున్న స్పోర్ట్స్‌డ్రామా కావడంతో సినిమాను అంగీకరించిందని తెలిసింది. ఇదిలావుండగా ఈ సినిమా కోసం దీపికాపదుకునే 14కోట్ల పారితోషికం అందుకోబోతున్నదని చెబుతున్నారు. రణవీర్-దీపికాపదుకునే జోడీ వల్ల సినిమాకు వాణిజ్యపరంగా క్రేజ్ ఎక్కువయ్యే అవకాశాలు ఉండటంతో దీపికాపదుకునేకు భారీ మొత్తంలో రెమ్యునరేషన్‌ను ఆఫర్ చేశారని అంటున్నారు. ప్రస్తుతం దీపికాపదుకునే 'ఛపాక్' చిత్రంలో నటిస్తున్నది. ఆసిడ్ దాడి బాధితురాలు లక్ష్మిఅగర్వాల్ జీవితకథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మేఘనా గుల్జార్ దర్శకత్వం వహిస్తున్నది.


నాగార్జున, రకుల్‌ప్రీత్‌సింగ్

# ప్రేమలో పడను..పడేస్తాను!

నాగార్జున కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మన్మథుడు-2'. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. మనం ఎంటర్‌ప్రైజెస్, ఆనంది ఆర్ట్స్, వయకామ్ 18 స్టూడియోస్ పతాకాలపై నాగార్జున, పి.కిరణ్ నిర్మిస్తున్నారు. ఆగస్ట్ 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. గురువారం చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. 'నీకు షట్టర్లు మూసేసి దుకాణం సర్దేసే వయసొచ్చేసింది' అంటూ సీనియర్ నటి దేవదర్శిని చెబుతున్న సంభాషణతో టీజర్ మొదలైంది. ఇంకా పెళ్లెందుకు చేసుకోలేదంటూ అందరూ నాగార్జునను ఆటపట్టించడం చక్కటి వినోదాన్ని పంచింది. 'ఎండిపోయిన చెట్టుకి నీళ్లు పోస్తే మళ్లీ పూలు పూస్తాయా' 'కోచింగ్ ఇవ్వాల్సిన వయసులో నువ్వు బ్యాటింగ్‌కు దిగుతున్నావ్' వంటి డైలాగ్‌లు వ్యంగ్యాస్త్రాలతో ఆకట్టుకున్నాయి. టీజర్‌లో నాగార్జున అందంగా, స్టైలిష్‌గా కనిపించారు. చివరగా 'ఐ డోన్ట్ ఫాల్ ఇన్ లవ్..ఐ ఓన్లీ మేక్ లవ్' అని నాగార్జున చెప్పిన సంభాషణ హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్‌సింగ్, కీర్తి సురేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. సమంత కీలకమైన అతిథి పాత్రలో కనిపించనుంది. సింగిల్ షెడ్యూల్ మినహా చిత్రీకరణ మొత్తం పూర్తయిందని చిత్ర బృందం పేర్కొంది. లక్ష్మి, వెన్నెల కిషోర్, రావు రమేష్ తదితరులు ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎం.సుకుమార్, స్క్రీన్‌ప్లే: రాహుల్ రవీంద్రన్, సత్యానంద్, సంగీతం: చైతన్య భరద్వాజ్, సంభాషణలు: కిట్టు విస్సాప్రగడ, రాహుల్ రవీంద్రన్, దర్శకత్వం: రాహుల్ రవీంద్రన్.

# సరికొత్తగా.. ఉత్కంఠగా..



విహారి, షెర్రీ అగర్వాల్ జంటగా వీర గనమాల స్వీయ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం తొలిషెడ్యూల్‌ని శరవేగంగా పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలను తెలియజేస్తూ ' ఓ వినూత్నమైన కథతో, ఎవరూ అంచనా వేయలేని ట్విస్టులతో క్షణం క్షణం ఉత్కంఠగా సాగే సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. స్క్రీన్‌ప్లే ప్రధానంగా కొనసాగే ఈ చిత్రంలో ప్రతి మలుపు ఎంతో థ్రిల్లింగ్‌గా వుంటుంది. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు తప్పకుండా నచ్చే చిత్రమిది. అన్ని వర్గాలను అలరించే అంశాలు ఇందులో వున్నాయి. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగిన షూటింగ్‌తో ఇప్పటి వరకు యాభై శాతం చిత్రీకరణ జరుపుకున్న ఈ చిత్రం రెండో షెడ్యూల్ ఈ నెల 15 నుండి ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌తో రెండు పాటలు మినహా చిత్రీకరణ పూర్తవుతుంది' అని తెలిపారు. అజయ్, రాజీవ్‌కనకాల, తనికెళ్లభరణి, చమ్మక్‌చంద్ర, తోటపల్లి మధు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సందీప్, కెమెరా: సునీల్‌కుమార్ ఎన్, స్క్రీన్‌ప్లే: హరిప్రసాద్ జక్కా, మాటలు, పాటలు: రామాంజనేయులు.











